LAUNCHING
CASAGRAND
GS INFINITY
ATTAPUR

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

LAUNCHING
CASAGRAND
GS INFINITY
ATTAPUR

శనివారం | 3-5-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 17 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి ఉ.7.52 తదుపరి సప్తమి; నక్షత్రం: పునర్వసు మ.12.34 తదుపరి పుష్యమి; వర్జ్యం: రా.8.40-10.17; దుర్ముహూర్తం: ఉ.5.51-7.33; అమృతఘడియలు: ఉ.10.13-11.47; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.32 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

TS RERA: P02500009503 | www.rera.telangana.gov.in
*T&C apply excluding GST & Registration

విలాసం చేరుకుంటుంది ఓ సరికొత్త స్థాయికి

ప్రతీ యూనిట్ హైదరాబాద్ రమణీయత యొక్క అంతరాయం లేని విశాల దృశ్యాలను ఆవిష్కరిస్తుంది
నగరం యొక్క ప్రధాన కేంద్రాలకు సమీపంలో వెలసినది

LAUNCHING
CASAGRAND
GS INFINITY

న్యూయార్క్ లాంటి అనుభూతిని హైదరాబాద్‌లో సొంతం చేసుకోండి.
3 & 4 BHK కండోస్ ₹1.8Cr - ₹2.4Cr*
ఫ్లోర్ విల్లాలు (5 BHK) ₹3.2Cr*



405 వెల్-డిజైన్డ్ అపార్ట్‌మెంట్స్ | 4.8 ఎకరాల కమ్యూనిటీ | G+35 హై-రైజ్ స్కైస్క్రేపర్ | 80% ఖాళీ ఏరియా | 41,000 sft. గ్రాండ్ క్లబ్‌హౌస్ | 100+ ప్రపంచ-స్థాయి సౌకర్యాలు

CREDAI
FOR BOOKING CALL: 80155 08602 | Exclusive site visit available. Visit model house at site.
CASAGRAND building aspirations

LAUNCHING
CASAGRAND GS INFINITY

న్యూయార్క్ లాంటి అనుభూతిని హైదరాబాద్‌లో సొంతం చేసుకోండి.

3 & 4 BHK కండోస్ &
5 BHK ఫ్లోర్ విల్లాలు మెయిడ్ రూమ్‌తో

₹1.8Cr* Onwards

INCREDIBLY PRICED				
Type	**Size** (Sft.)	**Market Price**	**Launch Price**	**Early Bird Price** (*For the first 30 bookings only)
3 BHK	2386	~~₹2.1Cr~~	~~₹1.9Cr~~	₹1.8Cr
4 BHK	2961	~~₹2.7Cr~~	~~₹2.6Cr~~	₹2.4Cr
5 BHK Floor Villas	3917	~~₹3.5Cr~~	~~₹3.4Cr~~	₹3.2Cr

Total Units: **405** | Phase 1 Units: **270** | Available Units: **154** | **Handover in 36 months** | Price after 30 bookings - ₹**1.9**cr - ₹**3.4**cr*

100+ WORLD-CLASS AMENITIES



అవుట్‌డోర్ సౌకర్యాలు

ఫీచర్లు & ఎంటర్‌టైన్‌మెంట్

1. ఎంట్రీ డ్రాప్-ఆఫ్ జోన్
2. వాకింగ్/జాగింగ్ ట్రాక్
3. గణిత గుర్తులతో పిల్లల జాగింగ్ ట్రాక్
4. అప్‌గ్రేడ్ చేసిన పార్కింగ్ ఫీచర్‌లతో సైకిల్ పార్కింగ్ జోన్
5 సైకిళ్లతో సైక్లింగ్ ట్రాక్
6 వాల్ బార్బిక్యూ
7 హ్యాంగ్‌అవుట్ స్పేస్
8 పెట్స్ పార్కు
9 పెట్ వాషింగ్ స్టేషన్
10. హెర్బ్ మరియు స్పైస్ గార్డెన్
11. ఈవీ కార్ ఛార్జింగ్ స్టేషన్
12. సెల్ఫీ స్పాట్
13. బర్డ్ ఫీడర్
14. అవుట్‌డోర్ ఏరియాలో దోమల మాగ్నెట్
15. అవుట్‌డోర్ ఫ్యాన్
16. పైప్డ్ మ్యూజిక్ సిస్టమ్‌తో బొల్లార్డులు
17. గ్రానైట్ చెస్ టేబుళ్లు
18. కొరియర్/ పార్శిల్ కోసం లాకర్లు
19. పనిమనిషి/ డ్రైవర్లు & ఎఫ్ఎం బృందం కోసం ప్రత్యేక పార్కింగ్

కిడ్స్ జోన్

20. అవుట్‌డోర్ ప్లేబోర్డ్
21. ఎడ్యుకేషనల్ ప్లేగ్రౌండ్
22. కిడ్స్ మ్యూజిక్ పార్క్
23. కిడ్స్‌ప్లే ఏరియాలో రబ్బర్ మౌండ్
24. అడల్ట్ నెక్ట్ స్వింగ్
25. సీ-సా
26. సీటింగ్‌తో గ్రానైట్ స్నేక్ & ల్యాడర్
27. పేరెంట్ & కిడ్స్ స్వింగ్
28. ఇన్-గ్రౌండ్ ట్రామ్పొలిన్
29. కర్ల్ స్వింగ్
30. ఇంటరాక్టివ్ ఫ్లోర్ గేమ్ - జెయింట్ స్నేక్ & ల్యాడర్
31. కిడ్స్‌ప్లే ఏరియాలో జెయింట్ అబాకస్
32. కిడ్స్ వర్టికల్ ప్లే గ్రౌండ్
33. పల్స్ ఇంటరాక్టివ్ గేమ్స్
34. కిడ్స్ ఏరియాలో సైకిల్ పార్కింగ్ స్పేస్
35. టోట్ లాట్
36. పిల్లల కోసం బాస్కెట్‌బాల్ హూప్

స్పోర్ట్స్ & ఫిట్‌నెస్ వెల్‌బీయింగ్

37. ఫిట్‌నెస్ కోర్ట్
38. గ్రానైట్ టేబుల్ టెన్నిస్ - అవుట్‌డోర్
39. ఇంటిగ్రేటెడ్ టార్గెట్ వర్క్‌అవుట్స్ & మంకీ బార్ - ఫ్లోర్ మార్కింగ్స్
40. మల్టీపర్పస్ స్పోర్ట్స్ కోర్ట్
41. వాలీబాల్ క్రాస్ నెట్
42. పికిల్‌బాల్ కోర్ట్
43. సెల్ఫ్ టెన్నిస్ (అవుట్‌డోర్)
44. మినీ గోల్ఫ్ కోర్స్
45. స్కేటింగ్ రింక్
46. మల్టీ-హూప్ బాస్కెట్‌బాల్ కోర్ట్
47. అవుట్‌డోర్ క్రాస్‌ఫిట్ కోర్ట్

క్లబ్‌హౌస్ సౌకర్యాలు

ఆరోగ్యం & సంక్షేమం

48. మెడిటేషన్ లాన్
49. జెన్ గార్డెన్
50. మెడిసినల్ ప్లాంట్ గార్డెన్
51. నేచర్ వాక్‌వే
52. మ్యూజికల్ ఇంటరాక్టివ్ స్కల్ప్చర్
53. లీజర్ ల్యాండ్‌స్కేప్ కోర్ట్ (బయోఫిలిక్ యాంఫిథియేటర్)
54. రిఫ్లెక్సాలజీ మొజాయిక్ గార్డెన్

ఫీచర్స్ & ఎంటర్టైన్మెంట్

55. కన్వీనియన్స్ స్టోర్
56. బాంకెట్ హాల్ - సెపరేట్ డైనింగ్ ఏరియా
57. క్రెచ్
58. మినీ థియేటర్
59. క్యారొకి ఫ్లోర్
60. రూఫ్‌టాప్ డైనింగ్ & కేఫ్
61. వీడియో గేమ్‌లతో కూడిన ఏవీ రూమ్
62. కిడ్స్ రూమ్‌లో ఆర్ట్స్ & క్రాఫ్ట్స్ స్పేస్
63. గెస్ట్ రూమ్
64. అసోసియేషన్ రూమ్
65. అమినిటీస్ మేనేజ్‌మెంట్ యాప్

స్పా మరియు సెలూన్

66. సెలూన్
67. స్పాలో ఫ్లష్డ్ జాకుజీ
68. స్టీమ్/సౌనా
69. మసాజ్ రూమ్

స్పోర్ట్స్ & ఫిట్‌నెస్ వెల్‌బీయింగ్

70. బ్యాడ్మింటన్ కోర్ట్
71. గోల్ఫ్ సిమ్యులేటర్ రూమ్
72. ఏఆర్ స్క్వాష్ కోర్ట్
73. ఆటోమేటెడ్ బీఎంఐ మెషీన్
74. ఆక్సిజన్ డిఫ్యూజర్
75. జిమ్
76. యోగా/ ఏరోబిక్స్

కో-వర్కింగ్ స్పేస్

77. కాన్ఫరెన్స్ రూమ్
78. క్లబ్‌హౌస్‌లో కాఫీ స్టేషన్
79. రీడింగ్ పాడ్స్

టెర్రస్ సౌకర్యాలు

80. స్కై సినిమా
81. టెర్రస్‌పై ఆర్ట్స్ & క్రాఫ్ట్స్ ఏరియాతో కిడ్స్ జోన్
82. స్టార్ గేజింగ్ డెక్
83. టెర్రస్‌లో పిక్నిక్ లాన్
84. టెర్రస్‌లలో ఓపెన్ జిమ్
85. అబ్జర్వేటరీ డెక్స్

ఇండోర్ గేమ్స్

86. బోర్డ్ గేమ్స్
87. డార్ట్ బోర్డ్
88. ఆర్కేడ్ గేమ్స్
89. కిడ్స్ సైక్లింగ్ ఇంటరాక్టివ్ వాల్
90. పిల్లల కోసం వెల్క్రో వాల్
91. ఎయిర్ హాకీ
92. ఫూస్‌బాల్
93. పూల్ టేబుల్
94. మినీ హాకీ
95. లెగో వాల్
96. టేబుల్ టెన్నిస్
97. వీడియో గేమ్ రూమ్

క్లబ్‌హౌస్ టెర్రస్ సౌకర్యాలు

98. టెర్రస్ సౌకర్యాల కోసం టెర్రస్ వద్ద లాబీ
99. స్టార్ గేజింగ్ డెక్‌లోకి విస్తరించే అంతస్తు
100. గ్రిల్లింగ్ పెవిలియన్ (బీబీక్యూ కౌంటర్)

స్విమ్మింగ్ పూల్ సౌకర్యాలు

101. ఇన్ఫినిటీ స్విమ్మింగ్ పూల్ (క్లోరిన్‌ఫ్రీ)
102. డెక్ సీటర్లతో కూడిన కిడ్స్ పూల్
103. ఇంటరాక్టివ్ కిడ్స్‌ప్లే తో కూడిన
104. వాటర్ స్కల్ప్చర్ హైడ్రోథెరపీ పూల్


ఏరియల్ వ్యూ


క్లబ్ హౌజ్ వ్యూ


స్విమ్మింగ్ పూల్

Scan to visit the site

Scan to experience luxury like never before

TS RERA: P02500009503 | www.rera.telangana.gov.in | *T & C Apply.

WHY CASAGRAND

20 years of real estate excellence	160+ landmark projects	55,000+ happy families	2023 rigorous quality checks	87% on-time delivery	7 cities Chennai, Bengaluru, Hyderabad, Coimbatore, Pune, Delhi & Dubai
2 months of rental assurance	6 months of resale support	8 Year warranty & 10-year community maintenance	75% open area for 2x more light & ventilation	0% space wastage for carpet area efficiency	23 global brands used in fittings and finishing materials

CREDAI

FOR BOOKING CALL: 80155 08602 | Exclusive site visit available. Visit model house at site.

CASAGRAND building aspirations

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 3-5-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 17 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి ఉ.7.52 తదుపరి సప్తమి; నక్షత్రం: పునర్వసు మ.12.34 తదుపరి పుష్యమి; వర్జ్యం: రా.8.40-10.17; దుర్ముహూర్తం: ఉ.5.51-7.33; అమృతఘడియలు: ఉ.10.13-11.47; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.32 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

దోస్త్ నోటిఫికేషన్ జారీ



దోస్త్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, శ్రీదేవసేన

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నేటి నుంచి దరఖాస్తులు

10 నుంచి తొలి విడత వెబ్ ఆప్షన్లు

29న సీట్ల కేటాయింపు

14



కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్

రిజర్వేషన్లపై 50% పరిమితిని

తొలగించండి

సామాజిక, ఆర్థిక, విద్యారంగాల్లో వెనకబాటుతనం గుర్తింపునకు కులగణన జరపండి

తెలంగాణ నమూనానే దేశానికి ఆదర్శం కావాలి

ప్రైవేటు సంస్థల్లోనూ కోటా కోసం చర్యలు చేపట్టాలి

బిహార్ ఎన్నికల కోసమే కులగణనపై ప్రకటన

మోదీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

పహల్గాంపై ఇంకెంతకాలం మౌనం?: సీడబ్ల్యూసీ

కులగణనపై గతంలో మా డిమాండ్‌ను వ్యతిరేకించారు.. రాహుల్ ఒత్తిడి వల్లే దిగివచ్చారు

ఈ క్రెడిట్ పూర్తిగా రాహుల్‌గాంధీదే: ఖర్గే

దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిన రాష్ట్రం

14 తెలంగాణ ప్రతిష్ఠను దేశ స్థాయిలో చాటిన అందరికీ అభినందనలు.. 'ఎక్స్' వేదికగా రేవంత్

న్యూఢిల్లీ, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో జరిగినట్లుగా దేశమంతటా సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా వెనకబాటుతనాన్ని నిర్ధారిస్తూ కులగణన జరిపించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. కులగణన విషయంలో తెలంగాణ నమూనానే దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరింది. ఈ మేరకు శుక్రవారం ఇక్కడ జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో తీర్మానం చేసింది. తెలంగాణలో అత్యంత శాస్త్రీయంగా, వివిధ రంగాల్లో వెనకబాటుతనాన్ని నిర్ధారిస్తూ కులగణన జరిగిందని, మోదీ ప్రభుత్వం ఏ ప్రాతిపదికన కులగణన జరపాలని నిర్ణయిస్తుందో తెలియజేయాలని కోరింది. 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. ప్రైవేట్ సంస్థల్లోనూ సామాజికంగా, ఆర్థికంగా

మిగతా 12వ పేజీలో...

గవర్నర్‌కు కాంగ్రెస్ బీసీ నేతల ధన్యవాదాలు

మహేశ్‌గౌడ్ నేతృత్వంలో జిష్ణుదేవ్‌ను కలిసిన నేతలు

14 బీసీ బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపినందుకు కృతజ్ఞతలు తెలిపి సన్మానం

అమరావతికి, ఆంధ్రప్రదేశ్‌కు..

అండగా నిలుస్తా..

చంద్రబాబు రాకతో దుష్టగ్రహాలు తొలగిపోయాయి

స్వర్ణాంధ్ర సాధనకు అమరావతి 'శక్తి'!

ఐటీ, ఏఐ, విద్య, వైద్యానికి 'లీడింగ్ సిటీ'

రికార్డు స్థాయిలో పూర్తికి కేంద్రం మద్దతు

భారీ ప్రాజెక్టుల పూర్తిలో బాబుకు సాటిలేరు

అమరావతి పూర్వయ్యాక ఏపీ జీడీపీ ఎక్కడికెళుతుందో ఊహించగలను

అంతరిక్షంతోపాటు రక్షణలోనూ ఏపీ పతాక

'జూన్ 21'న విశాఖలో యోగా చేస్తా

ఇప్పుడు భారతదేశ శక్తి ఆయుధాల్లో మాత్రమే లేదు.. మన ఐక్యతలో కూడా ఉంది

'అమరావతి పునఃప్రారంభ' సభలో ప్రధాని

పలు ప్రాజెక్టులకు శ్రీకారం, ప్రారంభం

తాను సీఎంగా ఉండగా టెక్నాలజీ గురించి బాబును చూసి నేర్చుకున్నానని వ్యాఖ్య



ఏపీలో పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన. చిత్రంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్‌కల్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): "ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు సరైన దారిలో వెళుతోంది. సరైన వేగం అందుకుంది. రాష్ట్రాభివృద్ధి ప్రస్థానంలో మీతో భుజం కలిపి నడుస్తాను" అని ప్రధాని మోదీ ఏపీ ప్రజలకు హామీ ఇచ్చారు. అమరావతి పనుల పునరుద్ధరణతోపాటు రాష్ట్రంలోని పలు రైల్వే, రహదారులు, రక్షణ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పూర్తయిన ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా అమరావతిలోని వెలగపూడి సచివాలయ సమీపంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. అమరావతి, పోలవరం పూర్తికి సంపూర్ణంగా సహకరిస్తామన్నారు. అమరావతిని ఒక 'శక్తి'గా అభివర్ణించారు. "అమరావతి... స్వర్ణాంధ్ర విజన్‌కు శక్తినిస్తుంది. స్వర్ణాంధ్ర.. వికసిత్ భారత్ లక్ష్యాన్ని బలపరుస్తుంది. అమరావతి కేవలం ఒక నగరం కాదు... అమరావతి ఒక శక్తి. ఆంధ్రప్రదేశ్‌ను ఆధునిక ప్రదేశ్‌గా, అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి" అని ఉద్ఘాటించారు. చంద్రబాబు మూడేళ్లలో అమరావతిని నిర్మిస్తామని లక్ష్యంగా పెట్టుకున్నారని.. ఆ తర్వాత రాష్ట్ర

మిగతా 13వ పేజీలో...

13 **అవకాశాల 'రాజధాని'!**

ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లక్కర్లేదు

మోదీ సహకారం.. చంద్రబాబు అనుభవంతో ప్రపంచస్థాయి నగరంగా అమరావతి తథ్యం

ప్రజాస్వామ్యానికే ప్రతీకగా నిలుస్తుంది: పవన్

ఆత్మగౌరవ ప్రతీక అమరావతి

13

ఇది కేవలం రాజధాని నగరమే కాదు..

ఐదు కోట్ల మంది ప్రజల సెంటిమెంట్

రూ.49 వేల కోట్ల పనులతో పునరుజ్జీవం

మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి

మోదీ చేతుల మీదుగానే ప్రారంభిస్తాం

క్వాంటమ్ వ్యాలీగా అమరావతి: చంద్రబాబు

12 **వేదికపై నాతో థరూర్**

ఇక చాలామందికి నిద్ర లేని రాత్రులే!

ఇండియా కూటమిపై కేరళలో మోదీ విసుర్లు



పెద్దపల్లి ఎయిర్‌పోర్టు..

బసంత్‌నగర్‌లో కాదు..

అంతర్గాంలో!

591 ఎకరాల గుర్తింపు.. కేంద్రానికి నివేదిక

ఆ భూములను పరిశీలించిన కేంద్ర బృందం

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లాలోని బసంత్‌నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన విమానాశ్రయం వేరే ప్రాంతానికి మారింది. బసంత్‌నగర్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు వాతావరణం సహా పరిస్థితులు అనువుగా లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం వేరే ప్రాంతంలో భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా పరిధిలోనే అంతర్గాం మండలంలో దాదాపు 591 ఎకరాలను జిల్లా అధికారులు గుర్తించారు. ఆ భూములకు సంబంధించిన రెవెన్యూ మ్యాపులు, పదేళ్ల

మిగతా 14వ పేజీలో...

గొర్రెల స్కామ్ కేసు నిందితుడు

మొయినుద్దీన్ ఇంట్లో 2

ఏసీబీ సోదాలు

కీలక బ్యాంకు లావాదేవీల గుర్తింపు?

ఇది రూ.700 కోట్ల కుంభకోణమని గతంలోనే తేల్చిన అధికారులు

కంచ గచ్చిబౌలి భూములపై 14

కొత్త సీఎస్ సమీక్ష

వివాదానికి సంబంధించి వివిధ అంశాలపై చర్చ



కాళేశ్వరం బ్యారేజీలపై

దిద్దుబాటు! 2

ఎన్డీఎస్ఏ నివేదిక అధ్యయనానికి కమిటీ

సత్వర సిఫారసులకు ప్రభుత్వం ఆదేశం

పది రోజులు.. 10 లక్షల

సైబర్ దాడులు

పహల్గాం ఘటన తర్వాత రెచ్చిపోయిన పాక్ హ్యాకర్లు

భారత రక్షణ, టెలికాం, రవాణా, విద్యా రంగాల వెబ్ సర్వర్లలోకి చొరబడే యత్నాలు

పాకిస్థాన్‌తోపాటు బంగ్లాదేశ్, మొరాకో, మధ్యప్రాచ్య దేశాల్లో తిష్ట వేసి దాడులు

పాక్ ప్రధాని షెహబాజ్ యూట్యూబ్ చానల్‌పై భారత్‌లో నిషేధం

ఆర్థిక దిగ్బంధనంలో పాకిస్థాన్!

కేంద్రం వ్యూహరచన.. ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో పాక్‌ను తిరిగి చేర్చేలా యత్నాలు

ఫలిస్తే.. ఆ దేశానికి విదేశీ పెట్టుబడులు కరువు

ఐఎంఎఫ్ ఆర్థిక ప్యాకేజీని అడ్డుకునే చర్యలు

ముంబై, మే 2: పహల్గాం ఘటన తర్వాత పాకిస్థాన్ హ్యాకర్లు భారత్‌పై సైబర్ దాడులు ముమ్మరం చేశారు. గత పది రోజుల్లోనే ఏకంగా పది లక్షల సైబర్ దాడులకు పాల్పడ్డారు. మహారాష్ట్ర సైబర్ విభాగం తమ నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. భారత్‌లోని వెబ్ సర్వర్లపై.. ముఖ్యంగా రక్షణ, టెలికం, రవాణా, విద్య వంటి కీలక రంగాలకు చెందిన పోర్టళ్లపై పాక్ హ్యాకర్లు దాడులకు దిగినట్టు తెలిపింది. సున్నితమైన సమాచారాన్ని దొంగిలించడం, నిఘా పెట్టడంతోపాటు జాతీయ భద్రతను దెబ్బతీసేందుకు పాక్ హ్యాకర్లు ప్రయత్నిస్తున్నట్టు వెల్లడించింది. పాకిస్థాన్‌తోపాటు బంగ్లాదేశ్, మొరాకో, మధ్య ప్రాచ్యదేశాల్లో అడ్డా వేసి ఈ సైబర్ దాడులకు తెగబడుతున్నట్టు పేర్కొంది. కేంద్ర నిఘా సంస్థలు ఈ వ్యవహారంపై దృష్టిపెట్టాయని, సైబర్ భద్రతను కట్టుదిట్టం చేసే చర్యలు చేపట్టాయని తెలిపింది. మరోవైపు 'సైబర్‌గ్రూప్ హోక్స్1337, నేషనల్ సైబర్ క్రూ' పేరిట

మిగతా 12వ పేజీలో...



అమెరికా డబుల్ గేమ్!

భారత్‌కు మద్దతని ఓ వైపు ప్రకటన

కానీ, నేతల వ్యాఖ్యలు తటస్థం

భారత్-పాకిస్థాన్ సంయమనం పాటించాలని అగ్రనేతల కబుర్లు 12

మా ఉగ్రవాద చరిత్రలో రహస్యాలేమ్

తొలుత పశ్చిమ దేశాలతో పనిచేశాం

ఇప్పుడిప్పుడే మార్పులు: బిలావల్

రోడ్లపై ఫైటర్ జెట్లు.. గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాయుసేన విన్యాసాలు



వడగాలులపై కార్యాచరణను విడుదల చేస్తున్న మంత్రి పొంగులేటి, అధికార్లు

వడదెబ్బ మృతులకు

రూ.4 లక్షల పరిహారం

రాష్ట్రంలో వడగాలుల ప్రభావిత మండలాలు 588

రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాల ఏర్పాటు

తాగునీరు, మజ్జిగ అందించాలి

సీఎస్‌ఆర్ నిధులు వినియోగించుకోవాలి

అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

'వడగాలులపై ప్రణాళిక' విడుదల

చేతికొచ్చిన పంటలను ముంచిన వాన

పలు జిల్లాల్లో వరి, మిర్చి, మామిడికి నష్టం

భూపాలపల్లి కాటారంలో 4సెం.మీ. వాన

ఇప్పటిదాకా 25 వేల ఎకరాల్లో పంట నష్టం: మంత్రి తుమ్మల 3

ఆదిలాబాద్ బేలలో 44.7 డిగ్రీల ఎండ

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండలు, వడగాలుల నుంచి ప్రజల్ని రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. వడదెబ్బతో మృతి చెందిన వారి కుటుంబాలకు అందించే పరిహారం గతంలో రూ.50 వేలు ఉండగా.. ప్రస్తుతం దాన్ని రూ.4 లక్షలకు పెంచినట్లు తెలిపారు. ఈ ఏడాది జూన్ వరకు అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయన్న భారత వాతావరణ శాఖ(ఐఎండీ) హెచ్చరికల నేపథ్యంలో

మిగతా 2వ పేజీలో...

భూ భారతితో

సమస్యలు తీరేనా?

విధివిధానాలపై వివరంగా చెప్పేవారేరి?

అవగాహనా సదస్సుల్లో భూ సమస్యలపై అనేక సందేహాలు వెలిబుచ్చిన రైతులు

నివృత్తి చేయలేకపోతున్న తహసీల్దార్లు

ఆ సందేహాలకు భూ నిపుణుడు సునీల్ సమాధానాలు.. 'ఆంధ్రజ్యోతి'తో సంభాషణ



హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): "భూములకు సర్వే మ్యాప్ తప్పనిసరి చేస్తారా? ధరణి రికార్డే భూ భారతిలో ఉంది కదా? ఇది కొత్త రికార్డు ఎలా అవుతుంది? ధరణి కింద ఇచ్చిన పాస్ పుస్తకాలు చెల్లుబాటు అవుతాయా? పాస్‌పుస్తకాలు, ఇతర సమస్యలపై గతంలో పెట్టిన దరఖాస్తులు చెల్లుతాయా?".. రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిన నేపథ్యంలో రైతులకున్న కొన్ని సందేహాలివి. భూ భారతి చట్టంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహనా సదస్సులు నిర్వహించగా.. రైతుల నుంచి వచ్చిన ఉమ్మడి సందేహాలు ఇలాంటివి పది ఉన్నాయి. వాటిపై కొత్త చట్టంలోని నిబంధనలు ఏం చెబుతున్నాయి? ఎంత వరకు పరిష్కారమయ్యే అవకాశం ఉంది? అనేదానిపై తహసీల్దార్ స్థాయిలో స్పష్టత ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. మరికొంత మంది తమ సమస్యలకు పరిష్కారం ఉందా, లేదా? అనేది తెలుసుకునేందుకు నేరుగా కార్యాలయాలకు వెళ్తుంటే.. 'అసలు చట్టం అమల్లో లేదు. నాలుగు మండలాల్లోనే ఉంది. అమల్లోకి వచ్చాక రండి' అంటూ అధికారులు

మిగతా 2వ పేజీలో...



డీఆర్ఆర్ ధాన్ 75 రకం వరి 3

ఎకరానికి 68 బస్తాలు!

డీఆర్ఆర్ ధాన్-75 రకం వరి వంగడంతో రైతులకు అధిక దిగుబడి

ఈ రకానికి కుంకికి 380-400 గింజలు


వచ్చే రెండేళ్లలో కంకికి వెయ్యి గింజలు పండే మరో రకమూ అందుబాటులోకి

అప్పుడు ఎకరానికి 144 బస్తాల దిగుబడి

పరిశోధనల్లో ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు

పాలకు పాలు, నీళ్లకు నీళ్లు..

వేరుచేస్తాం



గ్రూప్-1 వేల మందికి సంబంధించిన అంశం

ఏళ్లుగా వేచి ఉన్నారు.. తొందరపాటు వద్దు..

సమగ్రంగా విచారించి నిర్ణయం: హైకోర్టు

రీకౌంటింగ్‌లో ఓ అభ్యర్థికి 60 మార్కులు తగ్గాయ్

ఆ అభ్యర్థిని ప్రతివాదిగా చేర్చాం: పిటిషనర్లు

ఇది నకిలీ మెమో.. మరో పిటిషన్‌లో ఇలా చేసే కొందరు దొరికిపోయారు: టీజీపీఎస్సీ

ఆ అభ్యర్థి జవాబు పత్రాలు సమర్పించాలన్న కోర్టు

నియామకపత్రాలు ఇవ్వొద్దన్న మధ్యంతర ఉత్తర్వులు కొనసాగింపు.. జూన్ 11కు వాయిదా

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 అంశం వేల మంది జీవితాలతో ముడిపడినదని.. అందువల్ల అందరి వాదనలు సమగ్రంగా విని నిర్ణయం తీసుకుంటామని హైకోర్టు స్పష్టం చేసింది. పాలకు పాలు, నీళ్లకు నీళ్లు వేరుచేస్తామని వ్యాఖ్యానించింది. ఆలస్యం అవుతోందంటూ ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఎంత బాధ ఉందో, ఎంపిక కాలేకపోయిన వారికీ అదే స్థాయి బాధ ఉంటుందని పేర్కొంది. ఇంత కీలక అంశంలో వేగంగా విచారణ చేపట్టి తీర్పు ఇవ్వాలనడం సరికాదని పేర్కొంది. విచారణను జూన్ 11 వాయిదా వేస్తున్నట్టు

మిగతా 10వ పేజీలో...





వడదెబ్బ మృతులకు రూ.4 లక్షల పరిహారం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం ఆయన 12 శాఖల అధికారులతో సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ, ఐఎండీ కలిసి 'వడగాలుల కార్యాచరణ ప్రణాళిక-2025'ను రూపొందించాయి. మంత్రి ఈ ప్రణాళికను విడుదల చేశారు. ఇందులో భాగంగా జిల్లాకో నోడల్ అధికారిని నియమించినట్లు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు, వడగాలుల దృష్ట్యా రద్దీ ప్రాంతాల్లో తాగునీటితోపాటు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను సరఫరా చేయాలని ఆదేశించారు. సీఎస్ఆర్ నిధులతో వీటిని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కొత్తగూడెం, మెదక్, కరీంనగర్ తదితర పట్టణ ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణలో 588 మండలాలను వడగాలుల ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించామన్నారు. వడగాలుల ప్రభావం సామాన్యులపై పడకుండా అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. వడదెబ్బతో ఎవరైనా మరణిస్తే మానవతా దృక్పథంతో వ్యవహరించి, తక్షణమే పరిహారం అందేలా చూడాలని సూచించారు. బస్టాండ్లు, మార్కెట్లు, పర్యాటక కేంద్రాలు, ప్రార్థనా స్థలాల వంటి చోట్ల అవసరమైన షెల్టర్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల తరఫున ప్రజలకు రక్షిత తాగునీటిని సరఫరా చేయాలని, అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని చెప్పారు.

5 నుంచి హైకోర్టుకు వేసవి సెలవులు

» వెకేషన్ బెంచ్‌ల ఏర్పాటు

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): హైకోర్టుకు ఈనెల 5 నుంచి జూన్ 6 వరకు వేసవి సెలవులు ప్రకటిస్తూ రిజిస్ట్రార్ జనరల్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. సెలవుల్లో అత్యవసర కేసులు విచారణ చేపట్టేందుకు వెకేషన్ బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఈ వెకేషన్ బెంచ్‌ల్లో మే 5, 12 19, 26, జూన్ 2 తేదీల్లో కేసుల ఫైలింగ్, మే 7, 14, 21, 28, జూన్ 4 తేదీల్లో విచారణ జరుగుతుందని పేర్కొన్నారు. సెలవుల్లో హెబియస్ కార్పస్, ముందస్తు బెయిల్, బెయిల్ అప్లికేషన్లు, ఇతర అత్యవసర కేసులను విచారిస్తారు.

APPOINTMENTS

JAHNAVI DEGREE, P.G. COLLEGE
NARAYANAGUDA (Co-Ed.) Jr, Degree & P.G. College DOST Code : 1106 Ph : 9395567555
SECUNDERABAD (Co-Ed.) Jr. & Degree College DOST Code : 1107 Ph : 8333964710
WOMENS - Narayanaguda Degree College DOST Code : 1108 Ph : 9515146005
BODUPPAL (Co-Ed.) Degree & P.G. College DOST Code : 1178 Ph : 9490317027
WANTED PRINCIPALS & LECTURERS
Applications are invited for the following posts in the above locations
Principals (4)
Lecturers in: Degree — Required Posts: English, Electronics, Statistics, Commerce, Comp. Science, Chemistry, Political Sci. | Degree — Public Admn., Nutrition, Geography, Micro Biology, Bio Chemistry, Maths, Mngt. MBA | Degree — Bio Tech., Psychology, Zoology, Botany, Biomedical, Mass Communication & Journalism | P.G. — Nutrition, Micro Biology, Bio. Chemistry, Chemistry, Computers, Statistics, Bio Chemistry, Telugu, Food Science & Technology | P.G. — Commerce, Psychology, Zoology & Botany, Genetics, Food Nutrition, Clinical Nutrition, English, Clinical Nutrition, Sanskrit
LANGUAGES ● Telugu ● Hindi ● Arabic ● French ● Sanskrit
Admin positions like Accountants, Computer/ Life Science subjects Lab Assistants, Counselors / Telecallers, Librarians.
Qualification: as Per UGC/ Osmania University norms NET/SET/ Ph. D Candidates are Preferred. Eligible candidates asked to mail their application, resume,Scanned copies of certificates to our college
Mail Id: info@jahnavicolleges.com, www.jahnavicolleges.com
AKKA'S EDUCATIONAL SOCIETY
H.O. : SURYA HOUSE', Opp. Veg. Market, NARAYANAGUDA, Hyderabad.
Sd/- Secretary

INDIA'S BEST SCHOOL FOR IIT FOUNDATION
RECIPIENT OF A.P. STATE BEST SCHOOL AWARD
Dr.K.K.R's GOWTHAM Educational Institutions : A.P & T.S
Ph.Nos:9160444661, 9160444111 / 222, 9160444646
E-mail: jobingowtham@gmail.com, Website: www.kkrgowtham.com
WALK - IN - INTERVIEW

POST	NO.OF POSTS	SALARY (Rs.) Per Month
PRINCIPALS	10 Posts	75,000 to 1,00,000
IIT FOUNDATION LECTURERS (Advanced Level)	Mat, Phy & Che 10 Posts	1,25,000 to 1,75,000
LECTURERS FOR IIT FOUNDATION IITJEE (MAINS), NEET, EAMCET Level	Mat, Phy, Che, Bot & Zoo each 20 Posts	75,000 to 1,25,000
SECONDARY SCHOOL TEACHERS (State & CBSE) (9th, 10th CLASSES)	All Subjects each 25 Posts	30,000 to 50,000
MIDDLE SCHOOL TEACHERS (State & CBSE) (6th, 7th & 8th)	All Subjects each 25 Posts	20,000 to 40,000
PRIMARY SCHOOL TEACHERS (I to V CLASSES)	All Subjects each 25 Posts	20,000 to 30,000
PRE-PRIMARY TEACHERS (Montessori Trained)	20 Posts	20,000 to 25,000
TRAINEE TEACHERS (M.Sc., & B.Tech Freshers)	All Subjects each 25 Posts	15,000 to 20,000 Lodging+Boarding
CHIEF-WARDENS	Any Degree (Min. 3 Years exp.)	20,000 to 30,000
COMPUTER TEACHERS	B.Tech, MCA, M.Sc., Comp.,	20,000 to 30,000
STUDENT COUNSELLOR	M. A. Psychology / MSW	20,000 to 30,000

Also required Wardens, Class-incharges, Receptionists & PETs. (Salary commensurate with qualification & experience)
Note: Candidates aspiring jobs at HAPPY VALLEY SCHOOL, AGIRIPALLI can attend interview in our school campus at GUDAVALLI (Vijayawada Rural) - 7799979746
THE VACANCIES ARE FOR Dr.K.K.R BRANCHES AT : Gudivada,Gudavalli, Kakinada, Rajahmundry,Tanuku, Eluru, Poranki, Vijayawada, Tenali, Guntur, Nellore, Machilipatnam, Sattupally, Vizag [Lawsons-Bay Colony, Kurmannapalem, Chinnamushidiwada, Anandapuram], Hyderabad [Kushaiguda, Kukatpalli], Agiripalli,Vuyyuru.
Interviews will be conducted in our campuses in the following centres.
Gudivada - 9160444661 | Gudavalli - 9160444646
Guntur - 9160444464 | Rajahmundry - 9160444493
Kakinada - 9160444553 | Kushaiguda - 9160444552
Vijayawada - 9160444660 (Gurunanak Colony) | Vizag - 9642820777 (Lawsons-bay Colony)
Vuyyuru - 9441520718
Interview Dates: 4th, 11th, 18th May 2025 | 1st, 8th June 2025
Interview Timings: 9.00 am to 3.00 pm.

కాళేశ్వరం బ్యారేజీలపై దిద్దుబాటు!

» ఎన్‌డీఎస్‌ఏ నివేదిక అధ్యయనానికి కమిటీ

» సత్వర సిఫారసులకు ప్రభుత్వం ఆదేశం

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక ఇవ్వడంతో.. దాని ఆధారంగా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఈ నివేదికపై అధ్యయనం చేసి.. తదుపరి చర్యలు చేపట్టేందుకు ఈఎన్‌సీ(జనరల్), ఈఎన్‌సీ(ఓఅండ్ఎం), రామగుండం చీఫ్ ఇంజనీర్, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) చీఫ్ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్‌లతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ ఎన్‌డీఎస్‌ఏ నివేదికను అధ్యయనం చేయడంతోపాటు బ్యారేజీల రక్షణకు, వాటిపై ఆధారపడిన వారి కోసం తీసుకునే చర్యలకు సంబంధించి నివేదిక అందించాల్సి ఉంటుంది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాకు పూర్తిగా నిరుపయోగంగా మారిందని ఎన్‌డీఎస్‌ఏ నివేదికలో పేర్కొంది. దీంతోపాటు మిగిలిన బ్లాకుల్లోనూ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ అవే రకమైన సమస్యలు ఉన్నాయని, తద్వారా మూడు బ్యారేజీలు ఇప్పటికిప్పుడు నిరుపయోగమేనని నివేదిక వివరించింది. అన్ని రకాల పరీక్షలు/అధ్యయనాలు చేశాక.. దీర్ఘకాలిక ప్రయోజనాల రీత్యా ఈ బ్యారేజీల పునరుద్ధరణ చేపట్టాలని, ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసి కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) అనుమతులు తీసుకొని అమలు చేయాలని సూచించింది. ఈ పరిశోధనలు/అధ్యయనాల కోసం దేశంలోని ప్రతిష్ఠాత్మక సంస్థల సేవలను వినియోగించుకోవాలని సిఫారసు చేసింది. మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి నిర్మాణ, నిర్వహణ, డిజైన్ లోపాలే కారణమని స్పష్టం చేసింది. ఈ బ్యారేజీలోని కుంగిన బ్లాకు-7 మొత్తాన్ని తొలగించాలని సూచించింది.

గొర్రెల స్కామ్ కేసు నిందితుడు మొయినుద్దీన్ ఇంట్లో ఏసీబీ సోదాలు

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన గొర్రెల కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు మొయినుద్దీన్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగదు బదిలీలకు సంబంధించిన సమాచారాన్ని ఏసీబీ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. గొర్రెల కుంభకోణంపై 2023 డిసెంబరులో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసిన తర్వాత.. కుమారుడు ఇక్రముద్దీన్‌తో కలిసి మొయినుద్దీన్ దుబాయ్ పారిపోయాడు. తొలుత 2.10కోట్ల అక్రమాలు జరిగాయంటూ కేసు నమోదు కాగా.. తదుపరి విచారణలో ఇది రూ.700 కోట్ల కుంభకోణమని అధికారులు తేల్చారు. అప్పట్లోనే వారిపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేయగా.. దుబాయ్ నుంచి మొయినుద్దీన్‌ను రప్పించడానికి ఏసీబీ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఏసీబీ అధికారులు సెర్చ్ వారెంట్‌తో కోకాపేటలో ఉన్న మొయినుద్దీన్ ఇంటికి వెళ్లగా.. ఆయన భార్య అభ్యంతరం వ్యక్తం చేశారు. చివరకు సెర్చ్ వారెంట్ చూపిన తర్వాత ఏసీబీ అధికారులను ఆమె అనుమతించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా మొయినుద్దీన్ భార్యకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో అనుమానాస్పద లావాదేవీలు గుర్తించినట్లు సమాచారం.

భూ భారతితో సమస్యలు తీరేనా?

(మొదటిపేజీ తరువాయి)



కసురుకుంటున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. అధికారులకు కూడా పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో ప్రజల సందేహాలకు జవాబు చెప్పలేకపోతున్నారు. విధివిధానాల్లో నెలకొన్న గందరగోళంతో కీలక విషయాలపై రైతుల సందేహాలను నివృత్తి చేయలేకపోతున్నామని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది రైతులు అడిగిన సందేహాలు.. వాటికి చట్టంలో ఉన్న వెసులుబాటుపై భూ చట్టాల నిపుణుడు భూమి సునీల్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

భూములకు సర్వే మ్యాప్ తప్పనిసరి చేస్తారా? భూమికి, రికార్డుకు వ్యత్యాసం ఉంటే పరిస్థితి ఏంటి?

సమాధానం: కొత్త ఆర్వోఆర్ నిబంధనల్లో సర్వే మ్యాప్ విషయమై దశలవారీ (ఇంక్రిమెంటల్) సర్వే విధానం అమలు చేయనున్నట్లు చెప్పారు. కొనేవారు, అమ్మేవారు అంగీకారానికి వచ్చి లావాదేవీలకు సిద్ధమైతే.. అలాంటి వారికి సర్వే మ్యాప్ ఇచ్చేందుకు నిబంధనల్లో వెసులుబాటు కల్పించారు. ఇక, గట్టు వివాదం ఉన్న సమయంలో సర్వేకు అభ్యంతరాలు వస్తే ఎలా? అనే దానిపై నిబంధనల్లో స్పష్టత లేదు. గ్రామమంతా సర్వే చేస్తారా? లేక కోర్టు ఉత్తర్వులతో సర్వే చేస్తారా? అనుభవంలో ఉన్న విస్తీర్ణం వరకే పరిమితమై సర్వే చేస్తారా? అనే సందేహాలను అధికారులే నివృత్తి చేయాలి. ఆ మేరకు నిబంధనల్లోనూ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ధరణి రికార్డే భూ భారతిలో ఉంది కదా? ఇది కొత్త రికార్డు ఎలా అవుతుంది?

భూ భారతి పోర్టల్‌లో ప్రస్తుతం ఉన్న ధరణి రికార్డు తాత్కాలికంగా కొన్ని రోజులు ఉంటుంది. దశలవారీగా జరిగే సర్వేతో రికార్డుల సవరణ జరుగుతుంది. దాని ఆధారంగా కొత్త ఆర్ఎస్ఆర్ తయారవుతుంది. రెవెన్యూ సదస్సులు పెట్టి రైతుల అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరించి.. వారి సమస్యలను పరిష్కరించడం, రికార్డులకు ఎక్కని భూములను ఎక్కించడం ద్వారా కొత్త రికార్డు అందుబాటులోకి వస్తుంది. సవరణలు చేశాక, తాత్కాలిక భూధార్ కార్డులు జారీ చేస్తారు. ప్రస్తుతం గత చట్టంపై కోర్టులో ఉన్న పిటిషన్ మీద తీర్పు రావాల్సి ఉంది. ఆ తీర్పులో ధరణి రికార్డుల్లో జరిగిన మార్పులు, చేర్పులు చెల్లవని చెబితే నాలుగేళ్లపాటు రెవెన్యూ రికార్డుల్లో చోటుచేసుకున్న మార్పులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ఇలాంటి సాంకేతిక ఇబ్బందులకు తావు లేకుండా కొత్త చట్టంలో సవరణకు చట్టబద్ధత కల్పించేలా ప్రభుత్వం భూ భారతిని తీసుకొచ్చింది. కొత్త చట్టం ప్రకారం రెవెన్యూ రికార్డుల పూర్తి సవరణలతో గత చట్టం బంగాళాఖాతంలో కలవనుంది.

పాస్‌పుస్తకాలు, ఇతర సమస్యలపై గతంలో పెట్టిన దరఖాస్తు చెల్లుతుందా?

ఇప్పటికే దరఖాస్తు చేసుకుని, ఆ సమస్య అపరిష్కృతంగా ఉంటే మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరంలేదు. పాత దరఖాస్తు ప్రకారమే పరిష్కారం చూపుతారు. ఒకవేళ సమస్య పరిష్కరించకుండా దరఖాస్తును తిరస్కరించి ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు. పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఏదో ఒక ఆధారం చూపాలి. తండ్రికి పాస్ పుస్తకం ఉండి, కుమారుడికి లేకపోతే.. తండ్రి పాస్ పుస్తకం ఆధారంగా వారసత్వ హక్కుల కోసం దరఖాస్తు పెట్టుకోవచ్చు.

ధరణి కింద ఇచ్చిన పాస్‌పుస్తకాలు చెల్లుబాటు అవుతాయా? లేక కొత్తవి ఇస్తారా?

ధరణి కింద ఇచ్చిన పాస్‌పుస్తకాలు చెల్లుబాటవుతాయి. కొత్త పాస్‌పుస్తకం కోసం దరఖాస్తు పెట్టుకోవాల్సిన పని లేదు. ప్రస్తుతం ఉన్న పాస్‌పుస్తకంలో విస్తీర్ణం, పేర్లు తప్పులు ఉంటే సవరణ కోసం సెక్షన్ 4(5) ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి. పాస్ పుస్తకం ఉండి.. తమ భూమిని రికార్డుల్లో పూర్తిగా ఎక్కించలేదనే వారు సెక్షన్ 4(6) ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ రెండు సెక్షన్లపై తీసుకునే నిర్ణయాలు కీలకమైనందున సెక్షన్(6)ను లోతుగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. భూమి రికార్డుల్లో ఎక్కలేదనే సాకుతో ప్రభుత్వ భూములను పొరపాటున నమోదు చేయడానికి వీల్లేకుండా ఈ సెక్షన్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సీసీఎల్ఏ భావిస్తోంది.

ఆర్డీవో, కలెక్టర్ చుట్టూ మళ్లీ తిరగాల్సిందేనా?

కొత్త చట్టం ప్రకారం అధికారాల వికేంద్రీకరణ చేపట్టారు. 1971 ఆర్వోఆర్ ప్రకారం సాదాబైనామాపై తహసీల్దార్‌కు నిర్ణయం తీసుకునే అధికారం ఉండేది. భూ భారతిలో ఆర్డీవోకు అప్పగించారు. తహసీల్దార్, ఆర్డీవో మధ్య అధికారాల విభజన చేసింది.

పట్టాదార్ పాస్‌పుస్తకంలో మ్యాప్ కావాలనుకుంటే ఎవరిని సంప్రదించాలి?

ప్రస్తుతం పాస్‌పుస్తకం ఉండి.. ఎవరైనా రైతు తనకు సర్వే మ్యాప్ కావాలనుకుంటే.. త్వరలో ప్రభుత్వం మండలానికి ఐదుగురి చొప్పున లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించనుంది. ఈ సర్వేయర్లు మ్యాప్ తయారు చేసి, మండలంలో ఉండే రెగ్యులర్ సర్వేయర్ దాన్ని నిర్ధారించాక.. మ్యాప్ జత చేసి, తహసీల్దారు కొత్త పాస్ పుస్తకాన్ని జారీ చేస్తారు.

సాదాబైనామా ద్వారా భూమిని అమ్మిన వ్యక్తి, దాన్నే మరొకరికి రిజిస్టర్ డాక్యుమెంట్‌తో విక్రయించి ఉంటే ఎలా? దరఖాస్తు పెట్టుకోకపోతే క్రమబద్ధీకరిస్తారా? ఫీజులు ఎలా ఉంటాయి?

సాదాబైనామా దరఖాస్తుల విషయంలో విక్రయదారు ఒక వ్యక్తికి అమ్మిన భూమిని మరో వ్యక్తికి రిజిస్టర్ చేస్తే.. సివిల్ కోర్టులో కేసు వేసుకొని హక్కులు తెచ్చుకోవాలి. దీనికి భూ భారతి నిబంధనల్లో పరిష్కారం లేదు. సాదాబైనామా కింద ఉన్న భూమిని క్రమబద్ధీకరణ చేయించుకుంటే ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న స్టాంప్ డ్యూటీ ప్రకారమే రుసుములు చెల్లించాలి. సాదాబైనామా ద్వారా కొని, దరఖాస్తు పెట్టుకోని వారు.. భూమిని విక్రయించిన వ్యక్తి అంగీకారంతో క్రమబద్ధీకరణ చేసుకునే వెసులుబాటు ఉంది.

గ్రామ రికార్డులను ఎలా రాస్తారు? పాత విధానమా, డిజిటల్ రూపంలోనా?

కొత్త చట్టంలో గ్రామ రికార్డులను డిజిటల్ రూపంలోనే భద్రపరుస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏడాదికి ఒకసారి ఈ రికార్డును ప్రింట్ తీస్తారు. ఎన్ని కాలమ్స్ ఉండాలి? ధరణికి ముందు ఉన్న విధానంలోనే గ్రామ రికార్డులను కొనసాగించాలా? ఎలాంటి నమూనాలో ఉండాలి? అనే దానిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. త్వరలో స్పష్టత ఇవ్వనుంది. డిజిటల్ రికార్డులను పోర్టల్‌లో అందుబాటులో ఉంచనున్నారు.

భూధార్ కార్డు.. పాస్‌పుస్తకాలకు ప్రత్యామ్నాయమా?

క్రయవిక్రయాల సమయంలో సర్వే మ్యాప్ వచ్చిన వారికి తాత్కాలిక భూధార్ కార్డు ఇస్తారు. ఇది పాస్ పుస్తకానికి ప్రత్యామ్నాయం కాదు. గతంలో నకిలీ పాస్‌పుస్తకాలను నిలువరించేందుకు విశిష్ట సంఖ్యను ఇచ్చినట్లుగానే ఇప్పుడు భూధార్ కార్డును ఇస్తారు.

అసైన్డ్ భూములు కొన్న పేదలకు క్రమబద్ధీకరించి, లావుణి పట్టాలు ఇస్తారా?

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలు 5 ఎకరాల్లోపు ప్రభుత్వ భూములు కొని ఉండి, చట్ట ప్రకారం అర్హులైతే లావుణి పట్టా ఇస్తారు. 2017కి ముందు కొనుగోలు చేసిన భూములకే ఇది వర్తిస్తుంది. వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు మాత్రమే దీన్ని వర్తింపజేస్తారు. భూమి కొన్న వ్యక్తి ఇంట్లో ఉద్యోగస్థులు ఉండకూడదు. భూ భారతి చట్టం సెక్షన్ 8 ప్రకారం దీనిపై నిర్ణయం తీసుకుంటారు. పేదల ముసుగులో భూములు పెద్దల చేతుల్లోకి పోకుండా అడ్డుకునేలా నిబంధనల్లో మార్పు చేయాల్సిన అవసరం ఉంది.

కిషన్‌రెడ్డీ.. కులగణనపై చర్చకు సిద్ధమా?

అసెంబ్లీలో మీ ఎమ్మెల్యేలూ మద్దతిచ్చారు.. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని ఖాయం

» బీజేపీవి అన్నీ డైవర్ట్ రాజకీయాలే

» తెలంగాణలో ఉరికే గుర్రం ఉంది

» ఎందుకు పాడుస్తున్నావ్ కిషన్ రెడ్డీ ?

» టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి



హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణనపై చర్చకు సిద్ధమా.. కిషన్ రెడ్డీ అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడి సవాలు విసిరారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేసిన నెలరోజుల పాటు కిషన్‌రెడ్డి తెలంగాణలో లేరు కాబట్టి ఆయన అవగాహన లేదని ఎద్దేవా చేశారు. అందుకే కులగణనపై కిషన్ రెడ్డి విమర్శలు చేస్తున్నారని అన్నారు. అసెంబ్లీలో బీజేపీ పక్షనేతతో సహా ఆ పార్టీ ఎమ్మెల్యేలు కూడా కుల గణనకు మద్దతిచ్చారని, వాళ్ల మీద కూడా అనుమానమేనా..? అంటూ నిలదీశారు. యాభైయేండ్ల నుంచి ఆర్.కృష్ణయ్య బీసీల కోసం కొట్లాడుతున్నారని, కులగణనలో అతని సూచనలు కూడా ప్రభుత్వం తీసుకుందని, మరి ఆయనకు లేని అనుమానాలు కిషన్‌రెడ్డికి ఎందుకు కలుగుతున్నాయని ప్రశ్నించారు. దేశంలో ఇందిరమ్మ పాలన రాహుల్ గాంధీతోనేనని చెప్పారు. కులమతాలకు అతీతంగా పాలన సాగాలి అంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలని, అందుకే దేశ ప్రజలు వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాలనుకుంటున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకు కులగణన కమిటీ చైర్మన్‌గా ఉత్తమ్.. సభ్యులుగా పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, సీతక్క, శ్రీధర్ బాబు, మల్లు రవి ఉన్నారని, వాళ్లంతా కలిసి సర్వేను విజయవంతంగా పూర్తి చేయించారని కొనియాడారు. ఈ విజయాన్ని చూసి బీజేపీ నేతలకు నిద్ర పట్టడం లేదని దుయ్యబట్టారు. అసెంబ్లీ లో జరిగిన చర్చలో బీజేపీ, సీపీఐ, బీఆర్ఎస్ సభ్యులు కూడా పాల్గొన్నారని వెల్లడించారు. కులగణనను క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి అధికారులు సర్వే చేశారని, కిషన్ రెడ్డి ఈ విషయం తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. కులగణన బిల్లుకు గవర్నర్ కూడా ఆమోదముద్ర వేశారు అంటే సర్వే సరిగ్గా జరిగిందనే కదా.. అంటూ వ్యాఖ్యానించారు. కులగణన చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాదరణ చూరగొన్నది కాబట్టి బీజేపీ నేతలు ఓర్వలేక డైవర్ట్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. అందుకే కిషన్‌రెడ్డి మాటలు నమ్మొద్దని రాష్ట్ర ప్రజలను కోరారు. సర్వేలో పాల్గొనని వాళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ సమయం పొడిగించిందని, బీసీ సంఘాలన్నీ సీఎం రేవంత్‌ను సన్మానించాయని ఆయన తెలిపారు. సర్వే చేస్తేనే.. ఈ బీజేపీ వాళ్లు రాళ్ళు వేస్తున్నారు.. చెయ్యకుండా ఉంటే పెద్ద పెద్ద బండరాళ్లు వేసే వాళ్లేమో అంటూ ఎద్దేవా చేశారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలనేదే రాహుల్ గాంధీ అజెండా అని.. అందుకే తెలంగాణలో కులగణన చేయించారని పేర్కొన్నారు. తెలంగాణలో ఉరికే గుర్రం ఉంది.. ఉరికే గుర్రాన్ని ఎందుకు పాడుస్తున్నావు అంటూ కిషన్ రెడ్డికి చురకలంటించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కులగణన సంగతి చూసుక్కోమ్మని హితవు పలికారు.

మా ప్లాట్లు మాకు ఇప్పించండి

- యాదాద్రి జిల్లా ఎస్ఎల్ఎన్ఎస్ నగర్ కాలనీ 'హౌజింగ్ సొసైటీ' బాధితులు

మల్కాజిగిరి, మే 2 (ఆంధ్రజ్యోతి): గ్యాంగ్‌స్టర్ నయీం భార్య, అనుచరులు తప్పుడు ధ్రువపత్రాలతో కాజేసిన తమ భూములను ఇప్పించాలని యాదాద్రి భువనగిరి జిల్లా శ్రీ లక్ష్మీనర్సింహస్వామినగర్ (ఎస్ఎల్ఎన్ఎస్) కాలనీ మ్యూచువల్ ఏయిడెడ్ కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీకి చెందిన దాదాపు 400 మంది ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం హైదరాబాద్ మల్కాజిగిరిలో వారు మీడియాతో మాట్లాడారు. 'యాదాద్రి భువనగిరి జిల్లాలోని సర్వే నంబర్ 722 నుంచి 724, 726 నుంచి 733 వరకు ఉన్న స్థలంలో వేసిన ప్లాట్లను సుమారు 500 మంది కొనుగోలు చేశాం. రెవెన్యూ రికార్డుల ప్రకారం వీటికి మ్యుటేషన్ జరిగింది. అయితే 2002-2003లో రికార్డుల్లో మా పేర్లకు బదులు ఇతరుల పేర్లు చేర్చారు. ఆరా తీస్తే మా ప్లాట్లను తప్పుడు ధ్రువపత్రాలతో నయీం భార్య, అనుచరుల పేరిట ఏజీపీఏ ద్వారా బదలాయించుకున్నట్లు తెలిసింది. నయీం ఎన్‌కౌంటర్ తర్వాత మా భూములను సర్కారు నిషేధిత జాబితాలో పెట్టింది. దీంతో మా ప్లాట్ల కోసం 2008 నుంచి న్యాయ పోరాటం చేస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిషేధిత జాబితా నుంచి ప్లాట్లను తొలగించి న్యాయం చేయాలని కోరుతున్నాం' అని పేర్కొన్నారు.

జేఎన్‌టీయూలో విశ్వేశ్వరయ్య పీహెచ్‌డీ స్కీమ్

- ఇద్దరు ఫుల్‌టైమ్ పీహెచ్‌డీ స్కాలర్లకు ఫెలోషిప్

హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్(డీఐసీ) ప్రవేశపెట్టిన విశ్వేశ్వరయ్య పీహెచ్‌డీ స్కీమ్‌కు జేఎన్‌టీయూ హైదరాబాద్ ఎంపికైంది. ఈమేరకు పరిశోధనలు(పీహెచ్‌డీ) చేసే వారికి ఫెలోషిప్, ఆర్థిక తోడ్పాటును అందిస్తారు. విశ్వేశ్వరయ్య పీహెచ్‌డీ స్కీమ్ ఫర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ: ఫేజ్1ను జేఎన్‌టీయూలో అమలు చేసేందుకు డీఐసీ పీహెచ్‌డీ సెల్ ఇన్‌చార్జ్ సుదీప్‌కుమార్ బన్సల్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి జేఎన్‌టీయూలో ఈ స్కీమ్ కింద ఇద్దరు ఫుల్‌టైమ్ పీహెచ్‌డీ స్కాలర్లకు ఫెలోషిప్‌ను అందజేయనున్నారు. వీరికి ఐదేళ్ల వ్యవధిలో రూ.76,62,400 అందజేయనున్నారు. విశ్వేశ్వరయ్య పీహెచ్‌డీ స్కీమ్ కింద దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ, ఐటీ ఆధారిత రంగాల్లో పరిశోధనలు పెంచాలని కేంద్రం నిర్ణయించింది.

బాలుడితో అసభ్య ప్రవర్తన.. యువతిపై పోక్సో కేసు నమోదు

బంజారాహిల్స్, మే 2 (ఆంధ్రజ్యోతి) : బాలుడి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువతిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వెంకటగిరి ప్రాంతానికి చెందిన భార్యాభర్తలు జూబ్లీహిల్స్‌లోని ఓ భవనంలో పనిచేస్తున్నారు. వారికి కుమారుడు(14) ఉన్నాడు. అదే భవనంలో పనిచేస్తున్న ఓ యువతి పలుమార్లు ఆ బాలుడితో అసభ్యంగా ప్రవర్తించింది. ఈ విషయాన్ని అతడు తల్లికి చెప్పడంతో.. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

10.17 మీటర్ల లోతులో భూగర్భ జలాలు

- గత ఏప్రిల్‌తో పోల్చితే 17 జిల్లాల్లో 0.34 మీటర్లు పైకి.. 16 జిల్లాల్లో 0.02 మీటర్లు కిందికి

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూగర్భ జలాలు సరాసరి 10.17 మీటర్ల లోతులో ఉన్నాయని భూగర్భ జల శాఖ వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా 1,771 బోరు బావుల్లోని పీజోమీటర్ల ఆధారంగా 33 జిల్లాల్లోని భూగర్భ జలమట్టంపై ఏప్రిల్ నివేదికను ఆ సంస్థ వెలువరించింది. ఆ నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో ఈ ఏడాది ఏప్రిల్ దాకా 891 మి.మీ.కు గాను 1,083 మి.మీ వర్షపాతం నమోదయింది. యాదాద్రిలో అత్యల్పంగా 816 మి.మీ., ములుగులో అత్యధికంగా 1,706 మి.మీ. వర్షపాతం రికార్డయింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 5.57 మీటర్ల నుంచి 16.60 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. 18 జిల్లాల్లో సరాసరి 5-10 మీటర్ల లోతులో, 11 జిల్లాల్లో 10-15 మీటర్ల లోతులో, నాలుగు జిల్లాల్లో 15 మీటర్లకు మించి లోతులో ఉన్నాయి. 2024 ఏప్రిల్‌తో 2025 ఏప్రిల్ లెక్కలను పరిశీలించగా.. 17 జిల్లాల్లో గత ఏప్రిల్ కన్నా 0.34 మీటర్ల పైన నీళ్లు ఉండగా.. 16 జిల్లాల్లో 0.02 మీటర్ల లోతుకు పడిపోయాయి. భూ ఉపరితలం నుంచి 5 మీటర్ల లోతులో నీళ్లున్న ప్రాంతం 12 శాతం విస్తరించి ఉండగా.. 5-10 మీటర్ల లోతులో నీళ్లున్న ప్రాంతం 42 శాతం మేర, 10-15 మీటర్ల లోతులో నీళ్లు ఉన్న ప్రాంతం 30 శాతం, 15-20 మీటర్ల లోతులో నీళ్లున్న ప్రాంతం 15 శాతం మేర విస్తరించి ఉంది.

తెలంగాణ ప్రభుత్వము
రహదారులు మరియు భవనాల శాఖ, సర్కిల్, సిద్దిపేట
టెండరు కోరుతూ ప్రకటన
e-NIT No.3/SE(R&B) SDPT/TS/2025-26 తేది: 30.04.2025
పని పేరు: మెదక్ జిల్లాలో 3 నంబర్ల ER (HAM) పనులు.(4వ పిలుపు), అంచనా మొత్తం కోట్లలో: రూ.4.89 కోట్లు. మొత్తం మూడు నంబర్ల పనులు: రూ.4.89 కోట్లు. 1. బిడ్ దాఖలు ముగింపు తేదీ: 12.05.2025న మ.3.30 గం.లకు. 2. సంబంధిత సూపరింటెండింగ్ ఇంజినీర్ పేరు మరియు చిరునామా: సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఆర్&బి) సర్కిల్, సిద్దిపేట, ఫోన్ : 8121127730. 3. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://eprocure.gov.in/eprocure/appలో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (R&B) సర్కిల్ సిద్దిపేట.
DIPR R.O.No.1213-PP/CL/ADVT/1/2025-26 Dt.02.05.2025

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనాల శాఖ, సర్కిల్ సంగారెడ్డి
e-NIT NO.4/SE(R&B) SRD/TS/2025-26 తేది: 30.04.2025
పని పేరు: 1) వికారాబాద్ జిల్లాలో 3 నంబర్ల ER (HAM) పనులు.(4వ పిలుపు), అంచనామొత్తం కోట్లలో: రూ.4.2 కోట్లు.2) సంగారెడ్డి జిల్లాలో 5 నంబర్ల ER (HAM) పనులు.(4వ పిలుపు), అంచనామొత్తం కోట్లలో: రూ.7.32 కోట్లు. 3) వికారాబాద్ జిల్లాలో కొడంగల్ వద్ద గౌరవనీయ తెలంగాణ ముఖ్యమంత్రి నివాసం వద్ద సెక్యూరిటీ రూమ్స్, షెడ్ నిర్మాణం మరియు బారికేడింగ్ ఏర్పాటు చేయుట. అంచనామొత్తం కోట్లలో: రూ.0.95 కోట్లు. మొత్తం 9 నంబర్ల పనులు: రూ.12.47 కోట్లు. 1. క్ర.సం.1 & 2 కొరకు బిడ్ దాఖలు ముగింపు తేదీ: 12.05.2025న మ.3.30 గం.లకు. క్ర.సం 3 కొరకు బిడ్ దాఖలు ముగింపు తేదీ: 21.05.2025న మ.3.30 గం.వరకు. 2. సంబంధిత సూపరింటెండింగ్ ఇంజినీర్ పేరు మరియు చిరునామా: సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఆర్&బి) సర్కిల్, సంగారెడ్డి, ఫోన్:8333922725. 3.తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://eprocure.gov.in/eprocure/app:లో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (R&B) సర్కిల్ సంగారెడ్డి.
DIPR RO No.1221-PP/CL/ADVT/1/2025-26, తేది: 02.05.2025

GHMC **హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
NIT No.02/SE(P-WZ)/GHMC/2025-26 తేది:02.05.2025
పని పేరు: GHMC, జూబ్లీహిల్స్ సర్కిల్-18లో విరించి హాస్పిటల్ జంక్షన్ నుండి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ వరకు 100 అ.ల/120 అ.ల RDP వరకు రోడ్డు వెడల్పు చేయబడిన భాగంలో BT రోడ్డు నిర్మాణం. అంచనా మొత్తం: రూ.150.00 కోట్లు. బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేదీ/ ఆఖరి తేదీ & సమయం:- ప్రారంభ తేదీ: 05.05.2025న మ.03.00 గం.లకు, బిడ్ల స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 19.05.2025న మ.03.00 గం.లకు. అధికారి పేరు మరియు చిరునామా, సెల్ నం: C/o సూపరింటెండింగ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్-WZ), GHMC, 7993360288. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in/ లో చూడవచ్చును లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్-WZ) GHMC కార్యాలయంలో కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, (ప్రాజెక్ట్స్-WZ), GHMC
DIPR RO No.1236-PP/CL/ADVT/1/2025-26 తేది:02.05.2025

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్
(రక్షణ మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం)
సర్దార్ పటేల్ రోడ్, కోర్ట్ కాంపౌండ్, సికింద్రాబాద్-500003
టెలి నం.: 040- 27808600/040-27808601
ఇ మెయిల్ ఐడి :ceo.scb2009@gmail.com, వెబ్‌సైట్:secundrabad.csntt.gov.in
సఖి నివాస్ :: వర్కింగ్ ఉమెన్ హాస్టల్, మడ్‌ఫోర్ట్ వద్ద ప్రకటన
సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు వారు మడ్‌ఫోర్ట్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ వద్ద "సఖి నివాస్ - వర్కింగ్ ఉమెన్ హాస్టల్" లో వసతి కొరకు అర్హత గల పనిచేస్తున్న మహిళల నుండి దరఖాస్తులు కోరుచున్నారు. వసతి కొరకు దరఖాస్తు చేయడానికి నెలకు **రూ.50,000/-** కంటే తక్కువ జీతంతో పనిచేస్తున్న మహిళలు అర్హులని గమనించగలరు. పనిచేస్తున్న మహిళల పిల్లలకు, బాలికలకు 18 సంవత్సరాల వయస్సు వరకు మరియు బాలురకు 5 సంవత్సరాల వరకు వారి తల్లులతో ఇటువంటి హాస్టళ్లలో వసతి పొందవచ్చు. ఆసక్తిగల పనిచేస్తున్న మహిళలు దరఖాస్తు ఫారమ్ మరియు నియమ నిబంధనలను **https://secunderabad.gov.in/** నుండి డౌన్‌లోడ్ చేసుకోగలరు మరియు దానిని **"చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు, కోర్టు కాంపౌండ్, ఎస్‌పి రోడ్, సికింద్రాబాద్ -500003"** కు దాఖలు చేయగలరు. ఏవైనా వివరాల కోసం మీరు శ్రీ తాజముల్ అక్బర్, రెవెన్యూ సూపరింటెండెంట్ **(ఫోన్: 9490611190)** మరియు శ్రీ టి. చైతన్య, సీనియర్ అసిస్టెంట్ **(ఫోన్: 9490611197)** లను సంప్రదించగలరు.
సం/-
చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,
సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు.
Lr.No. SCB/RS/WWH/2025/1024
తేది: 02/05/2025.

చేతికొచ్చిన పంటలను ముంచెత్తిన వాన

పలు జిల్లాల్లో వరి, మిర్చి, మొక్కజొన్న, మామిడికి తీవ్ర నష్టం.. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

- నేడు, రేపు పలు జిల్లాలకు వర్ష సూచన
- ఖమ్మం జిల్లాలో వడదెబ్బతో ఇద్దరి మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో ఒకవైపు మండుతున్న ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా.. మరోవైపు అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా భానుడు నిప్పులు కక్కుతుండగా.. సాయంత్రానికి వాతావరణం చల్లబడి వరుణుడు పలకరిస్తున్నాడు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఆదిలాబాద్ జిల్లా బేలలో అత్యధికంగా 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. భూపాలపల్లి జిల్లా కాటారంలో 4 సెం.మీ. వర్షం కురిసింది. ఖమ్మం, భద్రాద్రి, సూర్యాపేట, నల్లగొండ, వరంగల్, హన్మకొండ, ములుగు, భూపాలపల్లి, మంచిర్యాల, మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో శని, ఆదివారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.



మహాదేవపూర్ కొనుగోలు కేంద్రంలో అకాల వర్షం కారణంగా కొట్టుకుపోయిన వరి ధాన్యం

అకాల వర్షాలతో అతలాకుతలం

భూపాలపల్లి జిల్లాలోని కాటారం, మహాదేవపూర్, మలహర్, మహాముత్తారం, ఘనపురం మండలాల్లో గురువారం రాత్రి కురిసిన వర్షాలు బీభత్సం సృష్టించాయి. కాటారంలో అత్యధికంగా 4సెం.మీ. వర్షం కురిసింది. కాటారం, మహా ముత్తారం మండలాల్లో పెనుగాలుల కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరి, మొక్కజొన్న పంటలు నేలవాలగా, కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం తడిసి ముద్దయింది. మహాదేవపూర్‌లో కొనుగోలు కేంద్రంలోని ధాన్యంతోపాటు కల్లాల్లో ఆరబెట్టిన మిరప పంట వరదకు కొట్టుకుపోయింది. గణపురం మండలంలోని వెంకటేశ్వర్ల పల్లిలో ఒక ఇల్లు ధ్వంసం కాగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా 5వేల టన్నుల ధాన్యం తడిసిపోయినట్లు అధికారులు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద్, బయ్యారం, కురవి, డోర్నకల్, గార్ల మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల 150 ఎకరాల మామిడితోటకు నష్టం వాటిల్లింది. గాలివాన ఉధృతికి ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని చల్వాయిలో 1200 ఎకరాల వరి పంట దెబ్బతింది. వరంగల్ జిల్లాలోని నర్సంపేట డివిజన్‌లో విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. నర్సంపేట, ఖానాపురం, దుగ్గొండి, చెన్నారావుపేట మండలాల్లో కోత దశకు వచ్చిన వరి పంట నేలవాలింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో 3.1 సెం.మీ. వర్షపాతం నమోదైంది. కూసుమంచి మండలంలో ఈదురుగాలులకు మామిడి కాయలు పెద్ద ఎత్తున నేల రాలాయి. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలోని సోలీపూర్, మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని 12 కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి తెచ్చిన వంద టన్నుల ధాన్యం తడిసి ముద్దయింది. బాదేపల్లి మార్కెట్‌లో 11వేల క్వింటాళ్ల ధాన్యం తడిసింది. మంచిర్యాల జిల్లాలోని భీమారం, జైపూర్ మండలాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. చెన్నూరు మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. పెద్దపల్లి జిల్లాలోని ఆరెంద, మల్లారం, వెంకటాపూర్ ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఆరెంద, గోపాల్‌పూర్, ఎక్లాస్‌పూర్, నాగెపల్లి, అడవిసోమన్‌పల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది.



రఘునాథపాలెం మండలం సూర్యతండాలో బొప్పాయి పంటను పరిశీలిస్తున్న తుమ్మల

హైదరాబాద్‌లో వడగాడ్పులు

హైదరాబాద్‌లో వడగాలులు మంట పుట్టిస్తున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగుతోంది. నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం 41-42 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖమ్మం జిల్లాలో వడదెబ్బతో ఇద్దరు మృతిచెందారు. ఖమ్మం రూరల్ పరిధిలోని ఆరెంపుల గ్రామంలో దోరెపల్లి శ్రీను(55), పెనుబల్లి మండలం రామచంద్రరావు బంజర్ గ్రామానికి చెందిన మరకాల శ్రీనివాసరావు(40) వడదెబ్బతో మృత్యువాత పడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలో 41.1, గద్వాల జిల్లాలో 41.1. మహబూబ్‌నగర్ జిల్లాలో 39.5డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

రాష్ట్రంలో 25వేల ఎకరాల్లో పంటనష్టం

రాష్ట్రంలో రెండు, మూడు రోజులుగా కురిసిన అకాల వర్షాలతో 25 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా సమాచారం అందిందని, ఈ విషయమై కలెక్టర్లను నివేదికలు అడిగామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరఫున తాత్కాలిక సాయం అందిస్తామన్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం సూర్యతండాలో దెబ్బతిన్న బొప్పాయి, ఇతర పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు.

ఎకరానికి 68 బస్తాల ధాన్యం!

డీఆర్ఆర్ ధాన్-75 రకం వంగడంతో రైతులకు దిగుబడే దిగుబడి

- ముమ్మర పరిశోధనల్లో ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు

రాజేంద్రనగర్, మే 2(ఆంధ్రజ్యోతి): ఎకరానికి 40-45 బస్తాల దిగుబడొస్తే రైతుకు తృప్తి! అదే ఎకరానికి ఏకంగా 68 బస్తాల దిగుబడొస్తే? 'డీఆర్ఆర్ ధాన్-75' అనే రకం వంగడంతో ఈ అద్భుతం సాధ్యం అంటోంది రాజేంద్రనగర్‌లోని భారతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్)! ఇటీవ ల విడుదల చేసిన డీఆర్ఆర్ ధాన్-75 రకం వరి వంగడం (భాగ్యనగర్ సోనా)తో హెక్టారుకు 10 టన్నుల నుంచి 12 టన్నుల ధాన్యం దిగుబడి (ఎకరానికి 68 బస్తాలు-బస్తాకు 70కిలోలు) వస్తోందని ఐఐఆర్ఆర్ జెనిటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ విభాగం హెడ్ డాక్టర్ సాయి ప్రసాద్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఆర్ అబ్దుల్ ఫియాజ్ తెలిపారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ఐఐఆర్ఆర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఐఐఆర్ఆర్ చేపడుతున్న వరి పరిశోధనలు, నూతన వంగడాల రూపకల్పనల గురించి వీరు వివరించారు. భారత్‌లో వరి వంగడాలు హెక్టారుకు 6 టన్నుల నుంచి 8 టన్నుల మేర దిగుబడి ఇస్తుండగా రాజేంద్రనగర్‌లోని ఐఐఆర్ఆర్‌కు చెందిన డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం సహకారంతో ఇటీవల విడుదల చేసిన డీఆర్ఆర్ ధాన్-75 హెక్టారుకు 10 టన్నుల నుంచి 12 టన్నుల వరకు దిగుబడి ఇస్తోందని చెప్పారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ ఉత్పత్తులు చేపట్టే విధంగా డీఆర్ఆర్ ధాన్-75ను రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఈ రకాన్ని 2024, అక్టోబరు 8న విడుదల చేశామని చెప్పారు. సాంబా మసూరిలాంటి రకానికి ఒక కంకికి 150 నుంచి 200 వరకు గింజలు వస్తాయని.. డీఆర్ఆర్ ధాన్-75 రకానికి 380 నుంచి 400 గింజలు వస్తున్నాయన్నారు. ఈ రకాన్ని తెలంగాణతో పాటు ఏపీ, తమిళనాడు, యూపీ, ఒడిసా, ఝార్ఖండ్, బిహార్, గుజరాత్, మహరాష్ట్రలోని 50మంది రైతులకు ఇచ్చి పండిస్తున్నామన్నారు. వారిలో ఇప్పటి వరకు ఐదుగురు హెక్టారుకు 10 టన్నుల నుంచి 12 టన్నుల దిగుబడి వచ్చిందని చెప్పారని వెల్లడించారు. పైగా ఇది అగ్గి తెగులు, ఎండాకు తెగులను తట్టుకునే రకం అని చెప్పారు. కాగా రానున్న రోజుల్లో ఒక కంకికి వెయ్యి గింజలు పండే విధంగా, అవన్నీ కూడా తాలు లేకుండా నాణ్యమైనవిగా ఉండేవిధంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ మేరకు 'టార్గెట్ 1000' పై తొమ్మిదేళ్లుగా పరిశోధనలు జరుగుతున్నాయని డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ అబ్దుల్ ఫియాజ్ వెల్లడించారు.. ఇది మార్కెట్ లోకి రావడానికి మరో రెండేళ్లు పడుతుందన్నారు. టార్గెట్ 1000 రకాన్ని ఇటీవల ఐఐఆర్ఆర్ సందర్శించిన ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్‌కు చూపిస్తే శాస్త్రవేత్తలను భుజం తట్టి అభినందించారని చెప్పారు. త్వరలోనే ఈ రకం గురించి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రికి చూపించి వివరించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. టార్గెట్ 1000 రకం వరి వండగం విడుదలైతే వరి పరిశోధన, ఉత్పత్తుల్లో చైనాను అధిగమిస్తామని చెప్పారు. ఈ రకం విడుదలైతే హెక్టారుకు 20 నుంచి 25 టన్నులు (ఎకరానికి 144 బస్తాలు) పండినా ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు.



ఒక కంకికి వెయ్యి గింజలు పండే టార్గెట్ 1000 వరి రకం


INDIAN INSTITUTE OF SCIENCE EDUCATION AND RESEARCH, TIRUPATI
(An Autonomous Institute Under Ministry of Education., Govt. of India)
Yerpedu Mandal – 517619, Tirupati.
Corrigendum
Admission to Ph.D. Program, AUGUST- 2025
The last date for submission of online application forms for the PhD program in Biology, Chemistry, Physics, Earth & Climate Sciences, and Humanities & Social Sciences discipline has been extended till 07 May 2025. For the updated educational qualifications, eligibility criteria, selection procedure of Ph.D., please visit: https://www.iisertirupati.ac.in/admission-phd/
Advt. No. 17/2025/IISER-T/Admissions/02-05-2025
Sd/-
Director

Sahitya Akademi | Ministry of Culture, Government of India
కేంద్ర సాహిత్య అకాదెమీ అనువాద పురస్కారం 2025
కేంద్ర సాహిత్య అకాదెమీ, గుర్తింపు పొందిన 24 భారతీయ భాషలలో 2025 వ సంవత్సరానికి గాను అనువాద పురస్కారం కోసం భారతీయ అనువాదకుల నుంచి, వారి సన్నిహితులు, శ్రేయోభిలాషులు, ప్రచురణకర్తలనుంచి పుస్తకాలను ఆహ్వానిస్తోంది. 2019, 2020, 2021, 2022, 2023 (అంటే 1 జనవరి 2019 నుంచి డిసెంబర్ 31, 2023 నడుమ) సంవత్సరాలలో ప్రచురితమైన పుస్తకాలు పురస్కారానికి అర్హమైనవి. పురస్కారానికి ఎంపికైన పుస్తకానికి బహుమతిగా 50,000 రూపాయల నగదు, జ్ఞాపిక అందచేయడం జరుగుతుంది. నమూనా దరఖాస్తుతో పాటు పుస్తకపు ఒక ప్రతిని 2025 మే 31 వ తేదీ లోగా పంపాలి. మరిన్ని వివరాలు, నిబంధనల కోసం అకాదెమీ వెబ్ సైట్ www.sahitya-akademi.gov.in ను సందర్శించండి.
సం/-
కార్యదర్శి
సాహిత్య అకాదెమీ, న్యూఢిల్లీ

ఇందిరమ్మ ఇళ్లు 600 చ.అడుగులకు మించొద్దు

400 అడుగులకు తగ్గొద్దు.. ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతాల్లో 500 ఇళ్లు

- 5 నుంచి 20 వరకు 28 మండలాల్లో భూ భారతి సదస్సులు
- కలెక్టర్లు, ఎస్పీలతో పొంగులేటి
- జూన్‌లో సర్వే మ్యాప్ ద్వారా ప్రయోగాత్మకంగా రిజిస్ట్రేషన్లు



హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను 400 చదరపు అడుగులకు తగ్గకుండా, 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మించుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు. లబ్ధిదారులు ఈ మేరకు ఇంటి నిర్మాణాలు చేపట్టేలా కలెక్టర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి ఆయన భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్షకు ఏర్పాట్లపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగిరం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ఎంత వరకు పూర్తయితే అంతవరకు ఏరోజుకారోజు, ఇన్‌చార్జి మంత్రుల నుంచి జాబితాకు ఆమోదం తీసుకోవాలని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో కనీసం 500ఇళ్లను కేటాయించి, లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. జాబితాలో ఎవరైనా అనర్హులని తేలితే ఇంటి నిర్మాణం ఏ దశలో ఉన్నా రద్దు చేస్తామన్నారు. ఈ పథకంలో భాగంగా ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలను రూపొందించినప్పటికీ వాటితో సంబంధం లేకుండా నిరుపేదలనే పథకానికి ఎంపిక చేయాలని కలెక్టర్లకు సూచించారు.

28 మండలాల్లో భూ భారతి సదస్సులు..

ఈ నెల 5 నుంచి 20 వరకు జిల్లాకో మండలం చొప్పున 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు పొంగులేటి తెలిపారు. పైలట్ మండలాల్లో వచ్చిన దరఖాస్తులను ఈ నెల 31కల్లా పరిష్కరించాలని, పరిష్కారం కాని వాటికి ఎందుకు కాలేదనే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ దరఖాస్తును తిరస్కరించాలని కలెక్టర్లకు సూచించారు. 605 మండలాలకు గాను ఇప్పటి వరకు 590 మండలాల్లో సదస్సులను నిర్వహించామని తెలిపారు. ఈ నెల 4 నుంచి జరగబోయే నీట్ పరీక్షకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రం నుంచి 72,572 మంది విద్యార్థులు నీట్‌కు హాజరవుతున్నారని, 24 జిల్లాల్లో 190 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కాగా, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో శిక్షణ పూర్తి చేసుకున్న 390 మంది అసిస్టెంట్ ఇంజినీర్లకు మంత్రి పొంగులేటి శనివారం ధ్రువపత్రాలను అందించనున్నారు.

జూన్‌లో సర్వే మ్యాప్ ద్వారా రిజిస్ట్రేషన్లు

జూన్‌లో సర్వే మ్యాప్ ఆధారంగా ప్రయోగాత్మకంగా భూముల రిజిస్ట్రేషన్లు చేస్తామని, త్వరలోనే రాష్ట్రంలో సర్వేయర్ల నియామకానికి ప్రకటన జారీ చేస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. సచివాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. సర్వేయర్ల నియామకానికి 6వేల దరఖాస్తులు వచ్చాయని, ప్రైవేట్ సర్వేయర్లతో భూముల సర్వే జరుగుతుందని చెప్పారు. దీనిపై ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుందన్నారు. భూ భారతి వల్ల 70 శాతం ప్రజలకు లబ్ధి చేకూరినా తాము విజయవంతమైనట్లేనన్నారు.

21 మందికి పదోన్నతులు

రిజిస్ట్రేషన్ శాఖలో 21 మందికి ప్రభుత్వం పదోన్నతులను కల్పించింది. గ్రేడ్-2లో పనిచేస్తున్న సబ్‌రిజిస్ట్రార్లు 10 మందిని గ్రేడ్-1కి, సీనియర్ సహాయకులుగా పని చేస్తున్న 11 మందిని గ్రేడ్-2కి పదోన్నతులు కల్పించారు. శనివారం వీరికి మంత్రి పదోన్నతుల పత్రాలను అందించనున్నారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాపం–ప్రాయశ్చిత్తం

రెండేళ్లక్రితం మణిపూర్ మండిపోవడం ఆరంభమైంది ఈ రోజే. జాతులమధ్య ద్వేషంతో, అవిశ్వాసంతో, పరస్పరం ఊచకోతలకు, అఘాయిత్యాలకు గురైన ఈ రాష్ట్రం మే 3ను మాత్రం మరిచిపోదు. హింసావలయంలోకి జారుకొని ఇప్పటికీ ఆ ఊబినుంచి బయటకు రాలేకపోతున్నదీ రాష్ట్రం. ఈ రెండేళ్లకాలంలో తాము నష్టపోయిందేమిటో, ఇకపై ఆశిస్తున్నదేమిటో వివరించడానికి ఆయా తెగలకు చెందిన సంస్థలు నేడు కార్యక్రమాలు చేపడుతున్నాయి. మరోవైపు, పౌరసంస్థలు ఈ సందర్భాన్ని సానుకూల మార్పు దిశగా అడుగులువేయడానికి వాడుకోవాలని అంటున్నాయి. రాష్ట్రపతి పాలనలో ఉన్న మణిపూర్‌లో ఉద్రిక్తతలు, అవిశ్వాసాలు తగ్గి, వాతావరణంలో మార్పు మొదలుకావాలంటే ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఒక్కటే మార్గమని 21మంది ఎమ్మెల్యేలు లేఖ రాసిన నేపథ్యంలో, కేంద్రప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని మేధావులు కోరుతున్నారు.

మణిపూర్ మూడునెలలుగా రాష్ట్రపతిపాలన ఉన్నా, పరిస్థితుల్లో మార్పురాలేదని, రాదని, రావాలంటే ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం అధికారంలో ఉండాలని ఆ ఎమ్మెల్యేలు తమ లేఖలో తేల్చేశారు. రాష్ట్రపతిపాలనను ప్రజలు, మేధావులు వ్యతిరేకిస్తున్నారని, ప్రజాదరణ ఉన్న ప్రభుత్వం ఏర్పడితే పరిస్థితి మారుతుందని వారి వాదన. హింస ఆగిందనో, తగ్గిందనో వస్తున్నవాదనలను ఈ ఎమ్మెల్యేలు కొట్టిపారేశారు, మళ్ళీ మళ్ళీ హింసరేగే అవకాశాలు ఉన్నాయని స్పష్టంచేస్తున్నారు. బీజేపీనుంచి 14, ఎన్పీపీనుంచి ముగ్గురు, నాగా పీపుల్స్‌ఫ్రంట్‌నుంచి ఇద్దరు, స్వతంత్రులు ఇద్దరు ఈ లేఖమీద సంతకాలు చేసినవారిలో ఉన్నారు. బీజేపీకి అక్కడ ముపె[illegible]డుమంది ఎమ్మెల్యేలు ఉన్న విషయం తెలిసిందే. తెరవెనుక రాజకీయాలు తెలియదు కానీ, అరవైమంది ఎమ్మెల్యేలున్న అసెంబ్లీలో మూడోవంతుమంది ఈ ప్రతిపాదన చేయడం కొట్టిపారేయాల్సిన విషయమైతే కాదు.


మూడునెలల క్రితం వరకూ మణిపూర్‌ను ఏలి దానిని అగ్నిగుండంగా మార్చిన ఘనత బీరేన్‌సింగ్‌కు దక్కుతుంది. మీతీలకు ఎస్టీ హోదా ప్రతిపాదన అగ్గికి కారణంగా కనిపిస్తున్నా, అప్పటికే కుకీ–జో తెగలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అప్రదిష్టను మీతీ బీరేన్ మూటగట్టుకున్నారు. తమ నివాసాలు, భూములు, హక్కులను హస్తగతం చేసుకొనే విస్తృతమైన కుట్రకు బీరేన్ పాల్పడుతున్నాడన్న అనుమానాలు అప్పటికే ఉన్నాయి. బీరేన్ తన ఏలుబడిలో రాష్ట్ర ప్రజలందరిపక్షాన నిలవలేదు. మీతీలకు నేతగానే వ్యవహరించాడు, తన చర్యలూ చేష్టలతో కార్చిచ్చు రాజేశాడు. మీతీలను ఆయుధాలు దోచుకోనివ్వాలని, వారు శత్రుశేషం లేకుండా చేసుకుంటారని సీఎం స్వయంగా అధికారుల సమావేశంలో చేసిన వ్యాఖ్యల టేపులు లీకై, మణిపూర్‌లో అప్పటికి 21నెలలుగా జరుగుతున్నదేమిటో నిర్ధారించాయి. బీరేన్‌కు అండగా ఉంటున్న బీజేపీ పెద్దలను కూడా బోనులో నిలబెట్టాయి. సర్వోన్నత న్యాయస్థానం పరిశీలనలో ఉన్న ఆ టేపుల్లో ఉన్నది బీరేన్‌గొంతేనని ట్రూత్‌ల్యాబ్స్ నిర్ధారించిన తరువాత, సుప్రీంకోర్టుతో తమ ముఖ్యమంత్రి నేడోరేపో అభిశంసన ఎదుర్కోవాల్సి వస్తుందని, ఇంతలోగా విపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో ఆయన ఓడిపోవడం ఖాయమని తేలిపోవడంతో బీజేపీ పెద్దలు ఎట్టకేలకు బీరేన్‌ను గద్దెదింపేశారు. తెగలమధ్య తగవులుపెట్టి 650రోజులపాటు రాష్ట్రాన్ని రగల్చిన బీరేన్‌కు ఆదినుంచీ అండగా నిలిచినవారు, ఆయన నిష్క్రమణ తరువాత అధికులకు ఆమోదయోగ్యమైన వ్యక్తిని కూచోబెట్టినా బాగుండేది. స్పీకర్ కేంద్రంగా అసమ్మతి రాజుకుంటూ, అంతర్గత తిరుగుబాట్లతో తీసుకుంటున్న సొంతపార్టీని చక్కదిద్దుకోవడం సాధ్యంకాదని అర్థమైపోవడంతో రాష్ట్రాన్ని రాష్ట్రపతి పాలనలోకి నెట్టేశారు. అగ్గిరాజుకున్న వెంటనే బీరేన్‌ను తప్పించివుంటే, రాష్ట్రం ఈ దుస్థితిలోకి జారుకొనేది కాదు. బీరేన్ కారణంగా నిలువునా చీలిన సమాజం ఇప్పటికీ ఏకం కాలేకపోతోంది. రెండేళ్లపాటు మణిపూర్‌కు కేంద్రప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిదిద్దడం అంత సులభం కాదు. మిలిటెంట్ గ్రూపులనుంచి ఆయుధాల స్వాధీనం మరింత వేగంగా, నిబద్ధతతో జరగాలి. పరస్పర అవిశ్వాసం, అనుమానాలు, భయాలతో బతుకుతున్న తెగలూ, జాతులూ సయోధ్యతో జీవించేట్టు చేయగలిగే స్థానిక నాయకత్వం అవసరం ఆ రాష్ట్రానికి ఉంది.

చరిత్రాత్మకం.. మోదీ కులగణన నిర్ణయం

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు నిండే నాటికి భారతదేశాన్ని ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్నదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్ @ 2047' లక్ష్యం. ఈ క్రమంలో మోదీ అనేక సాహసోపేత నిర్ణయాలు, చరిత్రాత్మక చర్యలకు శ్రీకారం చుట్టారు. రానున్న జనాభా లెక్కల్లో కులగణన చేపట్టాలన్న నిర్ణయం కూడా ఈ కోవలోకే వస్తుంది. ఈ నిర్ణయం సామాజిక న్యాయానికి మెరుగైన బాటలు వేస్తుంది. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడుతుంది. అందుకే దేశంలోని వెనకబడిన వర్గాల తరఫున ప్రధానమంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

దేశంలో కులగణన చివరిసారిగా 1931లో బ్రిటిష్ వారి హయాంలో నిర్వహించారు. 94 సంవత్సరాల తర్వాత నరేంద్ర మోదీ ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకొని చరిత్రాత్మక అధ్యాయాన్ని ఆరంభించింది. కులగణన నిర్ణయం తీసుకున్న 30 ఏప్రిల్, 2025 చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ కులగణన బీసీలకు, మైనారిటీ వర్గాలకే కాకుండా, దేశం మొత్తానికి సామాజిక-, ఆర్థిక సమతుల్యతను తీసుకొచ్చే మార్గం. అందుకే ప్రజలు, ముఖ్యంగా బడుగు, బలహీనవర్గాలు మోదీని 'అభినవ అంబేడ్కర్', 'అభినవ జ్యోతిబా ఫూలే' అని పిలుచుకుంటూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.

బీసీల పట్ల కాంగ్రెస్ మొసలి కన్నీరు కారుస్తోంది. 60 ఏళ్ల పాలనలో ఏనాడూ కులగణన గురించి ఆలోచించని కాంగ్రెస్, ఇప్పుడు వరుసగా మూడు పర్యాయాలు అధికారం కోల్పోయి, రోజురోజుకు బలహీనమవుతూ, ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో గత్యంతరం లేకే కులగణన ఎత్తుకున్నారే కానీ, బడుగు బలహీన వర్గాలపై ప్రేమతో కాదు. ఇప్పుడు మోదీ ప్రభుత్వం కులగణన చేపట్టాలన్న నిర్ణయం తమ విజయంగా కొందరు కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవడం వారి దివాళాకోరుతనానికి అద్దం పడుతోంది. 2021 జనగణనలో కులగణన తప్పక జరుగుతుందని 2018లోనే అప్పటి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. అయితే కోవిడ్ తదితర కారణాలరీత్యా 2021లో జనాభా లెక్కలు జరగలేదు. అప్పుడు రాజ్‌నాథ్ సింగ్ చెప్పిన దాని ప్రకారం త్వరలో జరగనున్న జనగణనలో కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం తప్పిస్తే, కాంగ్రెస్ కానీ, మరే పార్టీ ఒత్తిడి అనేది శుద్ధ అబద్ధం.



త్వరలో జరగనున్న జనగణనలో కులగణన చేపట్టాలన్న నిర్ణయం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం తీసుకున్నది. కాంగ్రెస్ మాదిరిగా కాకుండా, పాలనలో పారదర్శకత, జవాబుదారీతనానికి పెద్దపీట వేస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్వహించే జనగణన, కులగణన శాస్త్రీయంగా, ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉంటుంది.

కాంగ్రెస్ బీసీ వ్యతిరేకత ఈనాటిది కాదు. జవహర్‌లాల్ నెహ్రూ హయాం నుంచే ఉంది. భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్.అంబేడ్కర్ రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలతో పాటు వివిధ వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా హక్కులు కల్పించారు. బీసీలకు ప్రత్యేక రాజ్యాంగ హక్కులు కల్పించని కారణంగా వెంటనే జాతీయ కమిషన్‌ను నియమించాలని, ఆ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ సూచించారు. అయితే నెహ్రూ అందుకు ససేమిరా అన్నారు. చివరకు అంబేడ్కర్ ఒత్తిడితో బీసీల సంక్షేమం కోసం, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను అంచనా వేసేందుకు 1953లో కాకా కాలేల్కర్ కమిషన్‌ను నియమించారు. ఈ కమిషన్ 1955లో నివేదిక సమర్పించింది. అయితే, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నివేదికపై పార్లమెంట్‌లో చర్చించకుండానే చెత్తబుట్టపరం చేసింది. ఓబీసీ రిజర్వేషన్లపై నెహ్రూ ఏనాడూ సానుకూలంగా స్పందించలేదు.


ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ హయాంలో కూడా కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించింది. 1990లో వీపీ సింగ్ మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తే, నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న రాజీవ్‌గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారు. రిజర్వేషన్లు కులాల ఆధారంగా కాకుండా ఆర్థిక ప్రాతిపదికన మాత్రమే ఉండాలని వాదించిన రాజీవ్ గాంధీ, బీసీల హక్కులను కాలరాసి, రిజర్వేషన్లను అణిచివేశారు.

మన్మోహన్ సింగ్ ప్రధానిగా సోనియాగాంధీ నేతృత్వంలో సాగిన యూపీఏ పాలనలోనూ బీసీలకు అన్యాయమే జరిగింది. అప్పుడు బీజేపీ నాయకులు రాజ్‌నాథ్ సింగ్, అరుణ్ జైట్లీ, సుష్మా స్వరాజ్ 2010లో కులగణన జరిపించాలని యూపీఏపై ఒత్తిడి తీసుకొచ్చారు. రాజ్యాంగంలోని 246వ ఆర్టికల్‌కు అనుగుణంగా జనగణనలో భాగంగా కాకుండా ప్రైవేట్ ఏజెన్సీలతో రూ.5,000 కోట్లు ఖర్చు చేసి సర్వే చేపట్టారు. ఆ సర్వే వివరాలు ఇప్పటివరకు బహిర్గతం చేయలేదు.

ఎన్డీఏ ప్రభుత్వం ఓబీసీ పక్షపాతిగా వ్యవహరిస్తోంది. జాతీయ ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించడం, వైద్యవిద్యలో అఖిల భారత కోటాలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయడం, ప్రస్తుత మోదీ మంత్రివర్గంలో 27 మంది ఓబీసీలకు స్థానం కల్పించడం.. ఇలా చెప్పుకొంటూ పోతే ఓబీసీల సాధికారత దిశగా మోదీ ప్రభుత్వంలో అనేక చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఇది బీసీల పట్ల బీజేపీ నిబద్ధతకు నిదర్శనం. ఎన్డీఏ ప్రభుత్వం దేశంలో తొలిసారి బిహార్‌లో కులగణనను చేపట్టింది. ఆ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టరూపం దాల్చేలా చేసింది. అందులో అన్ని వివరాలు పొందుపర్చారు, పారదర్శకంగా ఉండేలా బహిర్గతం చేశారు. అయితే కొందరు కోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం ఆ చట్టంపై స్టే విధించింది.

కులగణనలో తెలంగాణను రోల్ మోడల్‌గా తీసుకోవాలని రాహుల్‌గాంధీ, రేవంత్ రెడ్డి తదితరులు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అశాస్త్రీయంగా కులగణన చేపట్టింది. అందుకే, ఆ వివరాలు ప్రజాబాహుళ్యంలో పెట్టలేదు. శాస్త్రీయంగా నిర్వహించి ఉంటే గ్రామాల వారీగా కులాల వివరాలు, వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులను వెల్లడించేవారు. కానీ అలా జరగలేదు. తెలంగాణలో 51శాతం బీసీలున్నారని గతంలో పేర్కొన్నారు, కానీ కాంగ్రెస్ చేపట్టిన కులగణనలో బీసీల జనాభా 46శాతానికి పడిపోయింది. సంతాన సాఫల్యత రేటు ప్రకారం చూసుకుంటే బీసీల జనాభా శాతం పెరిగి ఉండాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ చూపెడుతూ తెలంగాణ బీసీలకు తీరని అన్యాయం చేసింది. పైగా తెలంగాణలో 12శాతం ముస్లింలు ఉంటే, 10శాతం ఓబీసీలుగా చూపించారు. అంటే రేవంత్ ప్రభుత్వ లెక్కల ప్రకారం 80 శాతం పైగా ముస్లింలు ఓబీసీలే. వీరిని 'ముస్లిం ఓబీసీ'లు అన్న కొత్త పదప్రయోగంతో కాంగ్రెస్ తెలంగాణ ఓబీసీలకు వెన్నుపోటు పొడిచింది. ఇలాంటి తప్పులతడక, అశాస్త్రీయమైన కులగణన ఏ విధంగా 'రోల్ మోడల్' అవుతుందో రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ చెప్పాలి.

కాంగ్రెస్ మాదిరిగా కాకుండా, పాలనలో పారదర్శకత, జవాబుదారీతనానికి పెద్దపీట వేస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్వహించే జనగణన, కులగణన శాస్త్రీయంగా, ప్రజల ఆమోదయోగ్యంగా ఉంటుంది. దేశ సామాజిక, ఆర్థిక పునాదులు బలోపేతం చేయాలనేది మోదీ ప్రభుత్వం లక్ష్యం. దానికనుగుణంగానే కులాల వారీగా సమాచారం సేకరించి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించి, బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటారు.



• డా. కె.లక్ష్మణ్
రాజ్యసభ సభ్యులు
బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు

భారతీయులకు పహల్గాం పరీక్ష

విషాదం నడుమ భరోసాకు ఆలంబన లభించడం నిస్సందేహంగా ఉదాత్త భావోద్వేగాన్ని కలిగిస్తుంది. పహల్గాంలో ఉగ్రవాదులు హతమార్చిన పర్యాటకులలో ఒకరు కేరళవాసి ఎన్. రామచంద్రన్. ఆయన కుమార్తె ఆరతీ శరత్ స్వస్థలానికి తిరిగివచ్చిన అనంతరం ఆ కష్ట సమయంలో తనకు అవసరమైన సహాయాన్ని ఇద్దరు యువకుల నుంచి ఎలా పొందిందీ చాలా ఉద్వేగంతో చెప్పారు. ఆమె మాటలను 'ది హిందూ' ఇలా ఉటంకించింది: 'ముసాఫిర్, మరో స్థానిక డ్రైవర్ సమీర్ చివరివరకు నాతోనే ఉన్నారు. ఆస్పత్రిలో శవాల గది వెలుపల తెల్లవారుజాము 3 గంటలదాకా నిలబడి ఉన్నప్పుడు కూడా వారు నా పక్కనే ఉన్నారు. వారిరువురూ నన్ను ఒక చెల్లెలుగా ఆదరించారు. కశ్మీర్ నాకు ఇద్దరు సోదరులను ఇచ్చింది'. పహల్గాంలో 26 మంది అమాయకులను బలిగొన్న ఉగ్రవాదుల రాక్షసచర్యకు సమస్త కశ్మీర్ ప్రజలు ప్రతిస్పందించిన తీరుకు ముసాఫిర్, సమీర్ ప్రతినిధులని పలు దినపత్రికలలో వెలువడిన వార్తా కథనాలు ధ్రువీకరించాయి. ఘటన ప్రదేశంలో ఉన్న పలువురు పర్యాటకులను కశ్మీరీ గైడ్‌లు స్వయంగా సురక్షిత ప్రదేశాలకు తీసుకువెళ్లారు. తన వృత్తి సహచరుల వలే ముస్లిం మతస్థుడు అయిన ఒక గైడ్‌ను ఉగ్రవాదులు హతమార్చారు. భయాందోళనలలో ఉన్న పర్యాటకులకు ముస్లిం మతాచార్యులు మసీదులలో ఆశ్రయం కల్పించారు. ఆ క్లిష్ట సమయంలో టాక్సీ డ్రైవర్లు డబ్బులు తీసుకోకుండా పర్యాటకులను వారి వారి హోటళ్లకు, విమానాశ్రయానికి తీసుకువెళ్లారు.

పహల్గాం ఘటన మరుసటి రోజు కశ్మీర్ అంతటా ప్రజలు సంపూర్ణ హర్తాళ్ పాటించారు. ఉగ్ర హింసాకాండ బాధితులకు సంతాపంగా దుకాణాలు, హోటళ్లు, పాఠశాలలు, కళాశాలలు అన్నిటినీ మూసివేశారు. పాలక ప్రతిపక్షాలతో పాటు అన్ని రాజకీయ పార్టీలు ఉగ్రవాదులను, సరిహద్దుల ఆవల నుంచి వారికి మద్దతునిస్తున్న వారి అమానుషత్వాన్ని ఖండిస్తూ ర్యాలీలు నిర్వహించాయి.

ఉగ్రవాద దాడి సందర్భంలో కశ్మీరీల మానవీయ ప్రవర్తనా ఉదంతాలు చరిత్రకారుడినైన నాకు దేశ విభజన వెనువెంటనే కశ్మీర్ లోయపై పాకిస్థాన్ ప్రప్రథమంగా దాడి చేసినప్పుడు సమస్త కశ్మీరీలు ఎలా ఆదర్శపూర్వకంగా వ్యవహరించిందీ గుర్తుచేశాయి. 1947 శరత్కాలంలో దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో, తూర్పు, పశ్చిమ పంజాబ్‌లలో మతోన్మాద హింసాకాండ తీవ్ర స్థాయిలో జరుగుతుండగా కశ్మీర్ సంపూర్ణంగా మత సామరస్యానికి నెలవుగా ఉన్నది. ముస్లింలు, హిందువులు, సిక్కులు దృఢ సంఘీభావంతో సమైక్యంగా దురాక్రమణదారును ఎదుర్కొన్నారు.

పహల్గాంలో హిందువులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఉగ్రవాదులు దేశవ్యాప్తంగా ముస్లింలకు హిందువులు పూర్తిగా వ్యతిరేకులు అవుతారని, మత ఘర్షణలు ప్రజ్వరిల్లుతాయని భావించారు. ఈ లక్ష్య సాధనలో వారు కనీసం కశ్మీర్‌కు సంబంధించినంత వరకు విఫలమయ్యారు. సరే ఆ విషాద ఘటన అనంతరం మన దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో నివసిస్తున్నవారూ కశ్మీరీల వలే ప్రవర్తించారా? రాజస్థాన్‌లో ఒక బీజేపీ ఎమ్మెల్యే శుక్రవారం ప్రార్థనల సమయంలో ఓ మసీదులోకి వెళ్లి 'జై శ్రీరామ్ 'అని అరిచాడు. 'పాకిస్థాన్ ముర్దాబాద్' అని రాసి ఉన్న ప్లకార్డును ప్రదర్శించాడు. అస్సోంలో బీజేపీ ముఖ్యమంత్రి రాజకీయ ప్రత్యర్థులను అరెస్ట్ చేయించేందుకు చొరవ చూపాడు. ఆ రాజకీయ ప్రత్యర్థులు 'భారత్ వ్యతిరేకులు' అనీ అస్సోం రాష్ట్ర పాలనా యంత్రాంగం ఆరోపించింది. సామాజిక మాధ్యమాలలో కూడా అటువంటి ఆరోపణలే చేసింది. మధ్యప్రదేశ్‌లో ముస్లిం మతస్థుడైన కాంగ్రెస్ ఎమ్మెల్యేకు, అజ్ఞాత వ్యక్తుల నుంచి చంపివేస్తామనే బెదిరింపులు వచ్చాయి. గుజరాత్‌లో 'చొరబాటుదారులు' అనే ఆరోపణతో వందలాది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిజానికి వారిలో అత్యధికులు నికార[illegible] భారత పౌరులు.



పహల్గాంలో హిందువులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఉగ్రవాదులు దేశవ్యాప్తంగా ముస్లింలకు హిందువులు పూర్తిగా వ్యతిరేకులు అవుతారని, మత ఘర్షణలు ప్రజ్వరిల్లుతాయని భావించారు. ఈ లక్ష్య సాధనలో వారు కనీసం కశ్మీర్‌కు సంబంధించినంత వరకు విఫలమయ్యారు. ఆ విషాద ఘటన అనంతరం మన దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో నివసిస్తున్నవారూ కశ్మీరీల వలే ప్రవర్తించారా?

ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్‌లలో మితవాద వర్గాల గూండాలు కశ్మీరీ విద్యార్థులు హాస్టళ్లను వీడిపోయేలా బలవంతపెట్టారు. చాలా మంది కశ్మీరీ విద్యార్థులు విద్యాభ్యాసాన్ని విరమించి తమ స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. ముస్సోరిలో కశ్మీరీ శాలువాల విక్రేతలు తమ వ్యాపారానికి స్వస్తి చెప్పి కశ్మీర్‌కు వెళ్లిపోయారు. ఇప్పుడు కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్న కశ్మీర్‌లో పహల్గాం ఘటనతో ఎటువంటి సంబంధంలేని ఎంతో మందిని అరెస్ట్ చేశారు. బుల్డోజర్లతో పలువురి కూల్చి వేశారు. ఈ చట్ట విరుద్ధ చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.



▪ రామచంద్ర గుహ

గతానుగతం

పహల్గాం ఘటన అనంతరం ప్రధానమంత్రి తన తొలి బహిరంగ ఉపన్యాసాన్ని బిహార్‌లో వెలువరించడం నిరుత్సాహం కలిగిస్తోంది. మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రంలో ప్రధాని ఆ ఉపన్యాసం చేయడం గమనార్హం. ఆ ఉపన్యాసంలోను, ఆ తరువాత 'మన్ కి బాత్' ప్రసంగంలోను ఆసేతు హిమాచలం అన్ని భాషల వారూ పహల్గాం ఘటనను ముక్తకంఠంతో ఖండించారని పేర్కొన్నారు. ఈ దేశంలో బహుళ మతాలు విలసిల్లుతున్నాయని, ఆ మత బాహుళ్యం మన దేశానికి ఒక విశిష్టతను సమకూర్చుతుందనే వాస్తవాన్ని ఆయన అంగీకరించి ఉన్నట్టయితే ఉదాత్త రాజనీతిజ్ఞత అయివుండేది. మతాలకతీతంగా సమస్త ప్రజలూ పహల్గాం ఘటనను ఖండించారనే విషయాన్ని ఆయన ప్రస్తావించలేదు. ముఖ్యంగా ఘటన సందర్భంలోనూ, ఆ తరువాత కశ్మీరీలు మానవీయంగా వ్యవహరించిన వైనం ఆయనకు తెలీకుండా ఎలా ఉంటుంది? ఉగ్రవాద ఘటనపై చర్చించేందుకు జరిగిన అఖిలపక్ష సమావేశానికి ప్రధానమంత్రి హాజరుకాకపోవడం ప్రజాస్వామిక కార్యసరళి పట్ల ఆయన నిర్లక్ష్య వైఖరిని స్పష్టంగా సూచించింది.

ప్రధానమంత్రి భాషా వైవిధ్యాన్ని గౌరవించారుగానీ మత బహుళత్వాన్ని విస్మరించారు (ఇతర బీజేపీ నాయకులు మరింత సంకుచితత్వంతో వ్యవహరించారు. వారి దృష్టిలో హిందీయే సర్వోన్నత భాష, హిందూమతమే సర్వోన్నత మతం). ఈ దృష్ట్యా పహల్గాం మారణకాండకు వ్యతిరేకంగా సమస్త భారతీయులు మతాలకతీతంగా సమైక్యంగా నిలబడ్డారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రకటించడం ఉత్సాహజనకంగా ఉన్నది.

సరిహద్దు ఆవలివైపువారి అండదండలతో గతంలో సంభవించిన ఉగ్రవాద దాడుల వలే పహల్గాం ఘాతుకం కూడా రెండు పరీక్షలు పెట్టింది. ఒకటి భారత రాజ్యవ్యవస్థకు, రెండోది భారత ప్రజలకు. ప్రజాస్వామ్య రాజ్యాంగ విలువలు, బహుత్వవాద సంప్రదాయాలను సమర్థించే ఆలోచనాపరుడుగా పహల్గాం ఘటనకు సహచర పౌరులు ఎలా ప్రతిస్పందించాలనే విషయమై నాకు స్పష్టమైన భావాలు, అభిప్రాయాలు ఉన్నాయి. అవి చాలా వరకు జవహర్‌లాల్ నెహ్రూ భావాలతో ఏకీభవిస్తాయి. దేశ విభజన అనంతరం రెండు నెలలకు అక్టోబర్ 15, 1947న రాష్ట్రాల ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో నెహ్రూ ఇలా పేర్కొన్నారు: 'మన దేశంలో ముస్లిం మైనారిటీ ప్రజలు చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారు, ఈ దేశం నుంచి వెళ్లి పోదల్చుకున్నప్పటికీ ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి వారిది. వారు ఈ దేశంలోనే నివసించాలి. పాకిస్థాన్ ఎంతగా రెచ్చగొట్టినా, ఆ దేశంలోని ముస్లిమేతరులను ఎంతగా వేధింపులకు గురి చేస్తున్నా మనం మాత్రం మన దేశంలోని ముస్లిం మైనారిటీలను గౌరవాదరాలతో చూడాలి. వారికి పూర్తి భద్రత కల్పించాలి. ఒక ప్రజాస్వామిక రాజ్యంలో పౌరులకు ఉండే హక్కులు అన్నిటినీ మన ముస్లిం మైనారిటీలకు కల్పించాలి'. నెహ్రూ ఇప్పుడు చాలా నిందలు ఎదుర్కొంటున్న నాయకుడు. ఆయనను అపఖ్యాతిపాలు చేసేందుకు ప్రస్తుత పాలకులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన అనుసరించిన ఆర్థిక, దౌత్య విధానాలలో లొసుగులు ఉండవచ్చుగానీ భాషా, మతపరమైన బహుళతత్వాన్ని కాపాడడంలో ఆయన నిబద్ధత, దార్శనికత వర్తమాన భారతదేశానికి మరింతగా అవసరం.

పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ ఇటీవల చేసిన కొన్ని వ్యాఖ్యల నేపథ్యంలో నెహ్రూ భావాల, విధానాల ఉపయుక్తత మరింతగా విశదమవుతుంది. పహల్గాం ఘటనకు కొన్నిరోజులు ముందు కశ్మీర్ పాకిస్థాన్ కంఠ రక్తనాళం అని ఆ సైనికాధికారి నొక్కి చెప్పాడు. పహల్గాంలో పర్యాటకుల ఊచకోత అనంతరం పాకిస్థాన్ మిలిటరీ అకాడమీలో మాట్లాడుతూ, ద్విజాతి సిద్ధాంతం గురించి ప్రముఖంగా ప్రస్తావించాడు. హిందువులు, ముస్లింలు వేర్వేరు జాతులు అని— మతం, ఆచారాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షలలో పూర్తిగా భిన్నమైనవారని, ఒక సమాజంలో ఇరువురూ సహజీవనం నెరపడం అసాధ్యమని పాక్ ఆర్మీ చీఫ్ స్పష్టం చేశారు. వినాయక్ దామోదర్ సావర్కర్ మొదలైన మితవాద నాయకులు ఇటువంటి భావాలతో తమ సొంత ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. హిందువులు, ముస్లింల మధ్య శాంతియుత సహజీవనం అసాధ్యమని ఘోషించారు. దేశ విభజన అనంతరం కోట్లాది ముస్లింలు భారత్‌లోనే ఉండిపోయారు. అయితే ముస్లింలు ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా హిందువులకు లోబడి ఉండి తీరాలని హిందుత్వ వాదులు తెగేసి చెప్పుతున్నారు. ఈ హానికర ఆలోచనా ధోరణులను, రాజకీయ కార్యక్రమాలను నెహ్రూ దృఢ సంకల్పంతో ఎదుర్కొన్నారు. స్వాతంత్ర్య తొలి సంవత్సరాలలో పాకిస్థాన్‌లో ముస్లిమేతర పౌరులు ఎంతగా అవమానాలు, తిరస్కరణలకు గురవుతున్నప్పటికీ భారత్‌లో ముస్లింలను గౌరవాదరాలతో చూడాలని, దేశ పౌరులకు రాజ్యాంగం నిర్దేశించిన హక్కులు అన్నిటినీ వారికి ముస్లిం మతస్థులకు కల్పించాలని పదే పదే స్పష్టం చేశారు. తుదివరకూ ఆయన ఆ వైఖరికే కట్టుబడి ఉన్నారు. పాకిస్థాన్ ఉసిగొల్పిన ఉగ్రవాదులు పహల్గాంలో భారతీయులు, హిందువులు అయిన పర్యాటకులను ఊచకోత కోసిన నేపథ్యంలో మన సమున్నత భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య సంస్థాపక విలువలను గౌరవించే మనం, మన రిపబ్లిక్ భవిష్యత్తు భద్రంగా ఉండాలని కోరుకునే మనం మత విశ్వాసాల రీత్యా ముస్లింలు అయిన భారతీయులను గౌరవాదరాలతో చూసేందుకు, ఈ దేశ సంపూర్ణ, సమాన పౌరులుగా పరిగణించేందుకు మన ప్రయత్నాలను మరింత ద్విగుణీకృతం చేయాలి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

'సుప్రీం' హద్దులు విస్తరిస్తున్నాయా?

భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అత్యంత ఆమోదయోగ్యమైన, నిలకడైన పరిపాలనా విధానంగా కొనసాగడానికి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వేసిన పునాదే కారణం. అది మరింత బలోపేతం కావాలంటే రాజ్యాంగ మూలస్తంభాలైన శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు పరస్పర గౌరవంతో, స్పష్టమైన అధికార పరిధుల ఆధారంగా పనిచేయడం తప్పనిసరి. దీనికి విరుద్ధంగా ఇటీవల శాసన (రాష్ట్రపతి) — న్యాయ వ్యవస్థల మధ్య సంఘర్షణ చోటుచేసుకోవడం ఆందోళనకరం. ఇలాంటి ఘటనలతో ప్రజాస్వామ్య శాశ్వత మనుగడే ప్రశ్నార్థకం కాగలదు.

రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లుల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి గవర్నర్లకు నెల రోజుల గడువు, రాష్ట్రపతికి మూడు నెలల గడువును విధిస్తూ భారత సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించడాన్ని రాజ్యంగ, రాజకీయ, న్యాయశాస్త్ర విశ్లేషకులు విమర్శిస్తున్నారు. శాసన, న్యాయ, కార్యనిర్వాహక విభాగాల మధ్య సుస్పష్టమైన హద్దులు ఉన్నప్పటికీ, న్యాయవ్యవస్థ ఈ విధమైన ఆదేశాలతో తన పరిధిని అధిగమించాలనో, విస్తరించాలనో చూస్తున్నదా అన్న అనుమానం వ్యక్తం అవుతున్నది.

సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలపై ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ తీవ్రంగా స్పందించారు. న్యాయస్థానాలు 'సూపర్ పార్లమెంట్'గా వ్యవహరించాలని భారత రాజ్యాంగ నిర్మాతలు ఎన్నడూ అనుకోలేదని ఆయన అన్నారు. మరోవైపు సర్వోన్నత న్యాయస్థానం తన అభిప్రాయంగా— "రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఏ అధికార వినియోగమైనా న్యాయసమీక్షకు అతీతం కానే కాదు" అని స్పష్టం చేసింది. ఈ సందర్భాన్ని రాజ్యాంగ పరిరక్షణగా చూడాలా, లేక వ్యవస్థలు తమ పరిమితులు దాటే ప్రయత్నంగా చూడాలా అనే చర్చ అంతటా మొదలైంది.

సుప్రీంకోర్టు ఈ గడువు విధించే విషయంలో గవర్నర్ వ్యవస్థను రాష్ట్రపతి స్థాయితో సమానంగా భావించడం తగునా అన్నది ఆలోచించాల్సిన విషయం. రాష్ట్రపతి, గవర్నర్ ఈ రెండు రాజ్యంగ వ్యవస్థలను వారి వారి పరిధులలో "సమాన అధికారాలున్న అసమానులు"గా చూడాలి. భారత రాజ్యాంగం ప్రకారం సంపూర్ణమైన ఎన్నిక ద్వారా పదవిలోకి వచ్చే అత్యున్నత, ఏకైక అధికార పీఠం కేవలం రాష్ట్రపతిది మాత్రమే. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, రాష్ట్రాల -కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభ సభ్యుల ఎలెక్టోరల్ కాలేజీ కలిసి రాష్ట్రపతిని ఎన్నుకుంటారు. మిగతా వారంతా రాష్ట్రపతి విచక్షణాధికారం ద్వారా నియమించబడడమో, లేదా నామినేట్ చేయబడడమో జరుగుతుంది. కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థలకు రాష్ట్రపతే అధిపతి. రాష్ట్రపతి చేసే ముఖ్యాతి ముఖ్యమైన నియామకాలలో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, గవర్నర్లు, సుప్రీంకోర్ట్, హైకోర్ట్ న్యాయమూర్తులు, ఎన్నికల అధికారులు తదితరులు ఉంటారు.

గవర్నర్ వ్యవస్థ ఆది నుంచీ తటస్థ వ్యవస్థగా పేరు తెచ్చుకోలేకపోయింది. గవర్నర్ల నియామకం ఎప్పుడూ వివాదాస్పదమే. గవర్నర్ తనకు సంక్రమించిన అధికారాలను, విధులను సహకార సమాఖ్య స్ఫూర్తితో, భారతదేశాన్ని ఐక్యంగా ఉంచడానికి ఉపయోగిస్తారని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. దురదృష్టవశాత్తూ దీనికి పూర్తి భిన్నంగా, అందరూ కాకపోయినా మెజారిటీ గవర్నర్లు, అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం ఏజంట్లుగా పదవిని దుర్వినియోగం చేస్తూ వచ్చారు. కాబట్టి ఈ సందర్భంలో సర్వోన్నత న్యాయస్థానం గవర్నర్‌లకు గడువు విధించడం సమంజసమే కావచ్చు. కానీ రాష్ట్రపతిని గవర్నర్లతో సమానంగా భావిస్తూ గడువు విధించడం చర్చించాల్సిన అంశం!

ఏదైనా మౌలికమైన అంశంలో రాష్ట్రపతి సరైన ఆలోచన కోసం తీసుకునే సమయంతో సహా, అనేక అంశాల్లో స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోవడమన్నది ఆ పదవికి వన్నె తెచ్చే రాజ్యాంగపరమైన అధికారం. అటువంటి విషయంలో సర్వోన్నత న్యాయస్థానం గడువు విధించడం గౌరవభరిత రాజ్యాంగ కర్తవ్యంలో జోక్యం చేసుకోవడంగానే భావించాలి.

భారత రాజ్యాంగంలో న్యాయసమీక్షకు విశేష ప్రాధాన్యమున్నది. అలాగే రాష్ట్రపతి పదవికి, అధికారాలకు, బాధ్యతలకు కూడా విశేషమైన ప్రాధాన్యం ఉన్నది. న్యాయసమీక్ష అనే సూత్రాన్ని స్వేచ్ఛతో నిర్వర్తిస్తున్న సుప్రీంకోర్టు అత్యున్నత రాజ్యాంగ పదవి అయిన రాష్ట్రపతికి ఏ మేరకు పరిమితులు విధించవచ్చా అన్నది చర్చనీయాంశం. ఒకవేళ రాష్ట్రపతి లేదా గవర్నర్ కార్యాచరణలో మలినమైన ఉద్దేశం లేదా రాజ్యాంగ ఉల్లంఘన స్పష్టంగా కనిపిస్తే తప్ప, సర్వోన్నత న్యాయస్థానం ఈ అంశంపై మార్గనిర్దేశాలు ఇవ్వడం అనేది అతి జోక్యమే అవుతుంది.

అసలు రాష్ట్రపతి, గవర్నర్ల ఆలస్యాలపై తీర్పు చెప్పే ముందు న్యాయస్థానాలు స్వయంస్థితిని గుర్తించకపోవడం తగునా? వివిధ స్థాయి న్యాయస్థానాలలో వేలాది కేసులు దశాబ్దాలుగా పెండింగులో కొనసాగుతున్నాయి. అయోధ్య, ఎన్నికల అనర్హత కేసులు, పౌర వివాదాలు వంటి అనేక గుణాత్మక కేసులు సంవత్సరాల తరబడి కోర్టులలో కొట్టుమిట్టాడాయి. ముందు ఈ అంశంపై సమగ్రంగా ఆలోచన చేయకుండా, సర్వోన్నత న్యాయస్థానం రాష్ట్రపతికి గడువు విధించడంపై రాజ్యాంగ నిపుణులు, న్యాయ కోవిదులు చర్చ జరపాలి. 'ఆలస్యమైన న్యాయం అన్యాయమే' అనే సూత్రానికి అనుగుణంగా న్యాయస్థానాలు సైతం నిర్ణీత గడువులో కేసుల పరిష్కారం విషయంలో సమయపాలన పాటించేటందుకు తగిన చర్యలు తీసుకోవాలి.



భారత రాజ్యాంగంలో న్యాయసమీక్షకు విశేష ప్రాధాన్యత ఉన్నది. అలాగే రాష్ట్రపతి పదవికి, అధికారాలకు, బాధ్యతలకు కూడా విశేషమైన ప్రాధాన్యత ఉన్నది. న్యాయసమీక్ష అనే సూత్రాన్ని స్వేచ్ఛతో నిర్వర్తిస్తున్న సుప్రీంకోర్టు అత్యున్నత రాజ్యాంగ పదవి అయిన రాష్ట్రపతికి ఏ మేరకు పరిమితులు విధించవచ్చు?

బిల్లులపై నిర్ణయాలను గడువుల్లో తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించిన తీర్పు వెనుక ఉన్న ఉద్దేశం మంచిదే కావచ్చు. అధికార స్వామ్యం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలు ఆలస్యం కావటం లేదా వాటికి రాజకీయ ఆటలు అడ్డం రావటం... ఇంతవరకు మాత్రమే న్యాయశాస్త్రం పట్టించుకోవాల్సిన అంశం. రాజ్యాంగ విలువలను నిలబెట్టే బృహత్తర ప్రయత్నంలో శాసన, న్యాయ, కార్యనిర్వాహక విభాగాల మధ్య సమన్వయం తప్పనిసరి. నిజమైన మార్పు రావాలంటే రాజ్యాంగపరమైన నియామకాల్లో రాజకీయ ముసుగు తొలగాలి. రాష్ట్రపతి, గవర్నర్లు రాజ్యాంగంలోని అక్షరాన్ని మాత్రమే కాదు, ఆత్మను కూడా గౌరవించాలి. అదే విధంగా, న్యాయవ్యవస్థ కూడా ఇతరులపై ప్రమాణాలు విధించే ముందు తనదైన ఆలస్యాలపై స్వయంగా ఆలోచించాలి. ప్రజాస్వామ్య త్రిమూర్తులు (న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు) పరిమితులకు లోబడి, పోటీ తత్త్వం లేకుండా వ్యవహరించడంలోనే ప్రజాస్వామ్య స్థిరత్వం ఆధారపడి ఉంది.

▪ వనం జ్వాలానరసింహారావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా | ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com

ఒక్కపూటలోనే కీమోథెరపీ

● క్యాన్సర్ బాధితుల పడిగాపులకు ఇక చెక్
● ఉదయం చేరితే సాయంత్రం ఇంటికి
● రేడియోథెరపీలోనూ ఆధునిక చికిత్స
● కార్పొరేట్ స్థాయి వైద్యంపై ఎంఎన్‌జే దృష్టి



6

సీటు కోసం ఘర్షణ.. పిడిగుద్దులకు ఒకరి మృతి

● ఆలస్యంగా వెలుగులోకి..
● పర్మిట్ రూంలో ఘటన


ధనుష్ గౌడ్ (ఫైల్)



నటి డింపుల్ హయతి నిజాంపేటలో తళుక్కు మన్నారు. ఓ షాపు ప్రారంభానికి వి చ్చేసిన ఆమె త్వరలోనే మంచి సినిమాతో రాబోతున్నట్లు తెలిపారు.

- ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

నగరానికి చెందిన ఓ వ్యక్తికి యూపీకి చెందిన ఆకాశ్ వాట్సాప్ కాల్ చేసి పరిచయం చేసుకున్నాడు. ఓ లింక్‌ను పంపి దీని ద్వారా ట్రేడింగ్ చేస్తే తక్కువ సమయంలో అధిక రాబడి వస్తుందని నవి మ్మించాడు. నగరవాసి ఓకే చేయగా మొదట్లో లాభాలు వచ్చాయి. దీంతో పెద్ద మొత్తాల్లో పెట్టుబ డులుపెట్టి,ఏకంగా రూ.1.47 కోట్లు మోసపోయాడు.

■ బంజారాహిల్స్ నందినగర్‌లో నివసించే గాజుల వెంకటేష్ ఓ బార్లో ఆపరేషన్ మేనే జర్. ఇటీవల అతడికి ఒక వాట్సాప్ మెసేజ్ వచ్చింది. డబ్బులు పెట్టి కొన్ని వస్తువులు కొనుగోలు చేస్తే సాయంత్రానికి పెట్టుబ డితో పాటు లాభం తిరిగి ఇస్తామని దాని సారాంశం. నిజమని నమ్మిన వెంకటేష్ రూ.75,900 ఆన్‌లైన్ ద్వారా కట్టాడు. సాయంత్రానికి డబ్బు తిరిగి రాలేదు. ఆ ఫోన్ నంబర్ పనిచేయలేదు.

■ టాస్క్ పూర్తి చేస్తే డబ్బులు వస్తాయంటూ చాంద్రాయణ గుట్టకు చెందిన మహమ్మద్ ఫయాజుద్దీన్‌కు ఓ లింక్ వచ్చింది. దాని ద్వారా రిజిస్టర్ అయి రెండు టాస్కులు పూర్తి చేయగా, రూ.5,500 వచ్చినట్లు వర్చు వల్‌గా కనిపించింది. వాటిని డ్రా చేసుకునే క్రమంలో సైబర్ నేరగాళ్ల వలలో పడి విడ తల వారీగా రూ.20,000 చెల్లించాడు. మరో రూ.50 వేలు డిమాండ్ చేయడంతో పోలీసులను ఆశ్రయించాడు.

వాట్సాప్‌లో వల..

చిక్కితే విలవిల

గ్రూపుల్లో లాభాల పేరిట ప్రచారం.. పెట్టుబడులు పెట్టేలా ప్రలోభం

అత్యాశకు పోతే అసలుకే మోసం.. అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు

హైదరాబాద్ సిటీ, మే2 (ఆంధ్రజ్యోతి): 'తక్కువ సమయంలో మీ పెట్టుబడికి అధిక లాభాలు' అని ఊరించే ఆకర్షణీయమైన పోస్టులు వాట్సాప్ గ్రూపుల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. నమ్మి ఎవరైనా పెట్టుబడులు పెట్టారా మోసపోవడం ఖాయమని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రజల ప్రధాన వీక్‌నెస్‌లో ఒకటైన డబ్బు సంపాదనను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఇప్పటికే వర్క్ ఫ్రమ్ హోం పేరుతో ఎంతో మంది మోసపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. తాజాగా బ్యాంకుల్లో డబ్బులు ఉన్న వారినే లక్ష్యంగా చేసుకొని పెట్టుబడుల పేరుతో ఎర వేస్తున్నారు.



అధిక లాభాలంటూ ఆశ

అధిక లాభాల పేరుతో పెద్ద పెద్ద కంపెనీల పేర్లు, లోగోలతో వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడతారు. వెంటనే పెట్టుబడి పెట్టకపోతే మంచి అవకాశం కోల్పోతారని ప్రలోభ పెడతారు. వారితో కనెక్ట్ అయితే నమ్మకం కలిగేలా మాట్లాడతారు. పెట్టుబడులు పెట్టి చాలా మంది ధనవంతులు అయ్యారని కొన్ని ఫేక్ ఉదాహరణలు చూపెడతారు. మీతో పరిచయం లేని వ్యక్తులు ఈ తరహా సంభాషణలు చేస్తున్నారంటే అప్రమత్తంగా ఉండాల్సిందే. సరైన విచారణ చేపట్టకుండా వారు చెప్పినట్లు పెట్టుబడులు

మిగతా 6వ పేజీలో..

చెప్పకుండానే గ్రూపులో చేర్చి..
రూ. 2.80లక్షలు కాజేశారు 6

స్టాక్ మార్కెట్ గ్రూపులే ఎక్కువ

వాట్సాప్‌లోని అనేక గ్రూపుల్లో స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, క్రిప్టో కరెన్సీ వంటి పెట్టుబడి అవకాశాల గురించి చర్చిస్తారు. కొన్ని నిజమైన సమాచారాన్ని అందిస్తే, మెజారిటీ గ్రూపులు ఉద్దేశ్యపూర్వకంగానే తప్పుదారి పట్టించేలా ఉంటాయి. ఆకర్షణీయమైన ఆఫర్లు వస్తుంటే అవి మోసపూరిత పథకాలు అని గుర్తించాలి.



ఎర్లీగానే రూ. 900.93 కోట్లు

పన్ను రాయితీపై గ్రేటర్ వాసుల ఆసక్తి

ఏడు శాతం పెరిగిన చెల్లింపుదారులు



హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎర్లీ బర్డ్ రాయితీని గ్రేటర్‌వాసులు బాగానే వినియోగించుకుంటున్నారు. గతేడాది కంటే దాదాపు ఏడు శాతం అధికంగా ఏప్రిల్‌లో ముందస్తు పన్ను చెల్లించారు. జీహెచ్‌ఎంసీ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.900.93 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. ఏప్రిల్ 1 నుంచి 30 వరకు ఐదు శాతం రాయితీ అందుబాటులో ఉండగా, 7,93,552 మంది పన్ను చెల్లించారు. గత ఆర్థిక సంవత్సరం 7.43 లక్షల మంది రూ.831.23 కోట్లు, 2022-23లో 7.36 లక్షల మంది రూ.785.94 కోట్లు చెల్లించారు. కిందటి ఆర్థిక సంవత్సరం కంటే ప్రస్తుతం ఎర్లీ బర్డ్‌లో రూ.69.69 కోట్లు అదనంగా పన్ను వసూలైంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2034 కోట్ల పన్ను వసూలు కాగా.. ఎర్లీ బర్డ్‌లో రూ.900.93 కోట్లు (44శాతానికి పైగా) వసూలు కావడం గమనార్హం.

వాటర్‌బోర్డుకు ప్రపంచ బ్యాంకు నిధులు

● అధికారులతో చర్చించిన ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, మే2 (ఆంధ్రజ్యోతి) : వాటర్‌బోర్డు చేపట్టే వివిధ ప్రాజెక్టు పనులకు ప్రపంచ బ్యాంకు నిధులు వినియోగించనున్నారు. మురుగునీటి నిర్వహణ పనులతో పాటు తాగునీటి సరఫరా పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులను ప్రపంచ బ్యాంకు నుంచి రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీంతో బ్యాంకు ప్రతినిధులు శుక్రవారం ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు కార్యాలయాన్ని సందర్శించారు. ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఏఏ ప్రాజెక్టులకు ప్రపంచ బ్యాంకు నిధులను వినియోగించాలనే అంశంపై చర్చించినట్లు తెలిసింది. వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో సుంకిశాల ప్రాజెక్టును రూ.2250కోట్లతో చేపట్టగా, పనులు ఇంకా పూర్తవ్వలేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించిన కానీ విడుదల కాలేదు. దాంతో పాటు అమృత్ 2.0 కింద 39 ఎస్టీపీల నిర్మాణానికి వాటర్‌బోర్డు చర్యలు చేపట్టగా, ఆయా పనులు చేపట్టేందుకు దాదాపు రూ.2వేల కోట్ల వరకు నిధులు అవసరముంది. మహానగర దాహార్తి తీర్చడంతో పాటు జంట జలాశయాలైన గండిపేట, హిమాయత్‌సాగర్‌లను నింపడం, మూసీనదిలో గోదావరి జలాలను ప్రవహింపజేసే గోదావరి ఫేజ్-2, ఫేజ్-3 మల్టీపర్పస్ ప్రాజెక్టుకు రూ.7,250 కోట్ల వరకు నిధులు అవసరముంది. నగర తాగునీటి, మురుగునీటి నిర్వహణలో కీలకమైన ఈ ప్రాజెక్టులను అత్యవసరంగా పట్టాలెక్కించడానికి అవసరమైన పది వేల కోట్ల నిధులను ప్రపంచ బ్యాంకు నుంచి సమీకరించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

పాన్‌షాప్ నిర్వాహకుడి హత్య

చాంద్రాయణగుట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేసి ఓ పాన్‌షాప్ నిర్వాహకుడిని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన ఫలకనుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వట్టేపల్లికి చెందిన మొహమ్మద్ మాజిద్ (25) తీగలకుంటలో పాన్ షాప్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మాజిద్‌ను షాపునుంచి బయటికి పిలిపించుకుని మాట్లాడారు. ఈ సమయంలో వీరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో వారు కత్తితో అతన్ని దారుణంగా పొడిచి పరారయ్యారు. తీవ్ర గాయాలపాలైన అతను అక్కడికక్కడే చనిపోయాడు. కేసు దర్యాప్తులో ఉంది.

చుక్కలు చూపిన లెక్కలు


అబిడ్స్‌లోని ఓ సెంటర్ వద్ద..

ఎప్‌సెట్ తొలిరోజు 94 శాతం హాజరు

హైదరాబాద్ అభ్యరులు ఇతర జిల్లాలకు..

హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): టీజీ ఎప్‌సెట్-2025 ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు రెండు సెషన్లలోనూ లెక్కల ప్రశ్నలు చుక్కలు చూపించాయని అభ్యర్థులు వాపోయారు. జేఈఈ పరీక్షల స్థాయిలో ప్రశ్నలు ఉండడం, కొన్ని చాప్టర్లలో అంతకు మించి లెంగ్తీ క్వశ్చన్స్ ఇవ్వడం వలన ఆన్సర్ చేయడానికి సమయం సరిపోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం 80 మార్కులకు లెక్కలు ప్రశ్నలు ఉండగా సుమారు 25 నుంచి 30 ప్రశ్నలకు జవాబులు గుర్తించలేకపోయినట్లు వాపోయారు. ఫిజిక్స్ ప్రశ్నలు ఒక మోస్తరు కఠినంగా ఉన్నాయని, కెమిస్ట్రీ ప్రశ్నలు ఈజీగా ఉండడంతో ఎక్కువగా ఆన్సర్ చేయగలిగామని చెబుతున్నారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా తొలిరోజు రెండు సెషన్లకు 74,205 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, పరీక్షలకు 69,658 మంది (94శాతం) హాజరయ్యారు. వివిధ కారణాలతో 4,547 మంది అభ్యర్థులు పరీక్షలకు డుమ్మా కొట్టారు. ఇదిలా ఉంటే.. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షకు జిల్లా కేంద్రాల్లో సెంటర్లు దొరకని అభ్యర్థులు హైదరాబాద్‌లోని పరీక్షాకేంద్రాలను ఎంచుకోగా, ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు రాసే హైదరాబాద్ అభ్యర్థులు కొంతమందికి వరంగల్, నల్గొండ, మహబూబ్‌నగర్ సంగారెడ్డి తదితర జిల్లా కేంద్రాల్లోని టెస్ట్ సెంటర్లను కేటాయించడం పట్ల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నాలుగు జోన్లలో 94శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.

'క్రిప్టో' బాధితుడికి అధికారుల అండ

● ఖాతాలోకి క్రిప్టో కరెన్సీ వచ్చేలా చర్యలు

హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితుడికి సైబరాబాద్ సైబర్ క్రైం అధికారులు అండగా నిలిచారు. ట్రేడింగ్ సంస్థను సంప్రదించి అతడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారు. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు క్రిప్టో ట్రేడింగ్‌లో ఎక్కువ లాభాలు సంపాదించవచ్చని నమ్మించారు.



పలు దఫాలుగా రూ.20.90 లక్షలు పెట్టుబడి పెట్టించి క్రిప్టో కరెన్సీ కొనేలా చేశారు. ట్రేడింగ్ వాలెట్‌లోకి క్రిప్టో కరెన్సీ రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబరాబాద్ సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన అధికారులు సైబర్ నేరగాళ్లు కాజేసిన మొత్తంలో కొంత ఆఫ్రికాలో ఉన్న క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్‌కు పంపినట్లు గుర్తించారు. వాలెట్‌లో ఉన్న రూ.2.68 లక్షల విలువైన యూఎస్‌డీటీ కాయిన్లను ఫ్రీజ్ చేశారు. కోర్టు అనుమతితో బాధితుడి ట్రేడింగ్ ఖాతాకు క్రిప్టో కాయిన్లు జమ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. నకిలీ క్రిప్టో ట్రేడింగ్ సంస్థలు నకిలీ వెబ్‌సైట్లతో మోసాలకు పాల్పడుతున్నాయని, పెట్టుబడి పెట్టేవారు ముందుగా సంస్థ గురించి తెలుసుకున్న తర్వాతే ముందుకు సాగాలని సైబర్ క్రైం అధికారులు సూచిస్తున్నారు.


గవర్నర్‌కు రామానుజాచార్యుల ప్రతిమను బహూకరిస్తున్న చిన జీయర్‌స్వామి

రామానుజాచార్యులు అందరికీ ఆదర్శం

● గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

శంషాబాద్ రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): పేదలకు, నిమ్నవర్గాలకు ఆధ్యాత్మిక మార్గం చూపడంలో శ్రీ రామానుజాచార్యులు అందరికీ ఆదర్శమని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో రామానుజాచార్యుల 1008 జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. గురువారం రాత్రి కేంద్రానికి చేరుకున్న గవర్నర్‌కు అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ జీయర్ స్వామి, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వర్ణ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెయ్యి ఏళ్ల క్రితమే పేదలకు, నిమ్నవర్గాలకు ఆధ్యాత్మిక భావన మార్గం చూపించింది రామానుజాచార్యులైతే, నేటి సమాజంలో అందరూ సమానమే అని చాటి చెబుతున్న చిన జీయర్‌స్వామి మహనీయులని కొనియాడారు. నాటి కాలంలోనే కుల, మత బేధాలను రూపుమాపడానికి ఎంతో కృషి చేశారని, ఈ ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందు చిన జీయర్‌స్వామి గవర్నర్‌కు తీర్థ మంగళశాసనములు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో బిజీ షెడ్యూల్ ఉన్నా రామానుజాచార్యుల జయంతి వేడుకల్లో గవర్నర్ పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు రామానుజాచార్యుల ప్రతిమను అందజేశారు. కార్యక్రమంలో మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, జూపల్లి జగపతిరావు పాల్గొన్నారు.



బంజారాహిల్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సినీ నటి పూనమ్ కౌర్ మెరిశారు. అందానికి మెరుగులు అద్దుకుని 'బ్యూటీ'ఫుల్‌గా కనిపించారు.

- ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

3 నెలల్లో..

10.58 లక్షల కేసులు



యథేచ్ఛగా ట్రాఫిక్ ఉల్లంఘనలు

టాప్‌లో వితవుట్ హెల్మెట్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్నా ట్రాఫిక్ ఉల్లంఘనుల్లో మార్పు రావడంలేదు. ఈ ఏడాది కేవలం 3 నెలల వ్యవధిలోనే 10.58 లక్షల ట్రాఫిక్ వయొలేషన్ కేసులు నమోదు అయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సిటీ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు నమోదు చేసిన ఉల్లంఘన కేసుల్లో వితవుట్ హెల్మెట్ కేసులే 7.60 లక్షలు ఉన్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ వల్ల ప్రాణాలు కాపాడుకునే విషయం గురించి ట్రాఫిక్ పోలీసులు వందలాది అవగాహన సదస్సులు నిర్వహించారు. అయినా చాలామంది పెడచెవిన పెడుతున్నారు.

ఎక్కడికక్కడ స్పెషల్ డ్రైవ్

ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి సారించిన పోలీసులు ముందుగా ఉల్లంఘనులపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించారు. ట్రాఫిక్ వయొలేషన్స్‌కు పాల్పడుతున్న వారిని గుర్తించడానికి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. నిరంతరం ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగిస్తూ ఉల్లంఘనులను గుర్తిస్తున్నారు. ఎక్కడైనా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడితే వెంటనే టాస్క్‌ఫోర్స్ టీమ్‌లను రంగంలోకి దింపి, క్లియరెన్స్‌కు చర్యలు తీసుకుంటున్నారు.

టాప్ 10 కేసులివే..

వితవుట్ హెల్మెట్	7,60,434
రాంగ్ సైడ్ డ్రైవింగ్	1,44,778
సిగ్నల్ జంపింగ్	37,168
ట్రిబుల్ రైడింగ్	35,194
ఓవర్ స్పీడ్	33,842
సెల్‌ఫోన్ డ్రైవింగ్	17,618
డ్రంకెన్ డ్రైవ్	15,637
వితవుట్ సీట్‌బెల్టు	9,804
ఎక్స్‌ట్రా ప్యాసింజర్స్	2,983
మైనర్ డ్రైవింగ్	672

ఒకే పోస్టు..

వేర్వేరు ఉత్తర్వులు..!

● టీజీఎస్‌పీడీసీఎల్‌లో భిన్న పరిస్థితులు

హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఒకే పోస్టు.. ఇద్దరు అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు. ఇది టీజీఎస్‌పీడీసీఎల్‌లో పరిస్థితి. పదవీ విరమణ చేసిన సరూర్‌నగర్ విద్యుత్ ఆపరేషన్స్ డీఈ కేకే రామకృష్ణ స్థానంలో చంపాపేట్ ఆపరేషన్ డీఈ కే రాజేందర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజనీర్ 30వ తేదీన ఉత్వర్వులు జారీ చేశారు. అదే పోస్టును బేగంబజార్ డీఈ ఫర్హత్ అలీకి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తు టీజీడీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఒకే పోస్టుకు వేర్వేరుగా ఇద్దరిని నియమిస్తు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

మావోయిస్టులు భారతీయులు కారా?

● ఆపరేషన్ కగార్ పేరుతో నరమేధాన్ని వెంటనే ఆపాలి
● ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): "మావోయిస్టులు భారతీయులు కారా? వాళ్లు ఉగ్రవాదులా? మావోయిస్టులను హతమార్చే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఎక్కడిది?" అని ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు ప్రశ్నించారు. మావోయిస్టులతో శాంతియుతం గా చర్చించకుండా మారణహోమం సృష్టించడం దుర్మార్గమన్నారు. మావోయిస్టులు చట్టాన్ని అతిక్రమిస్తే న్యాయ విచారణ ద్వారా శిక్షించాలి తప్ప చట్టాన్ని చేతిలోకి తీసుకొనే అధికారం కేంద్రానికిలేదని కూనంనేని స్పష్టంచేశారు. మావోయిస్టులు జనజీవన స్రవంతి లోకి వచ్చి ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపు నిచ్చారు. 'మోదీ ప్రభుత్వం సీపీఐ (మావోయిస్టు) పార్టీతో వెంటనే శాంతి చర్చలు జరపాలి. ఆపరేషన్ కగార్ పేరుతో సాగిస్తున్న నరమేధాన్ని ఆపాలి' అనే డిమాండ్లతో వామపక్ష, కమ్యూనిస్టు పార్టీల రాష్ట్ర నేతలు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఎర్ర జెండాలన్నీ ఒక్కటి కావాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. అటవీ, ఖనిజ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టడానికి అడ్డుగా ఉన్న ఆదివాసీలను నక్సలైట్ల పేరుతో చిత్రహింసలు పెట్టడం, చంపడం అత్యంత అమానుషమ న్నారు. మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరపడంతోపాటు కాల్పుల విర మణ ప్రకటించాలని.. అందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిందిగా మోదీ ప్రధాని, హోం మంత్రి అమిత్‌షా, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తోపాటు దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు తాను లేఖలు రాసినట్లు శాంతి చర్చల కమిటీ అధ్యక్షుడు జస్టిస్ చంద్ర కుమార్ వెల్లడించారు. ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులు, ఆదివాసీలను చంపడం దుర్మార్గమంటూ కర్రెగుట్టల్లో సాయుధ బలగాల మోహరింపును వామపక్ష పార్టీల నేతలు ముక్తకంఠంతో నిరసించారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ప్రతి జిల్లాలో నిరసనసభలు, సమావేశాలు, ర్యాలీలు చేపడతా మన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి మెమోరాండం అందజే యాలని సభలో తీర్మానించారు. సదస్సులో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, వేములపల్లి వెంకట రామయ్య (సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ), ప్రజాగాయని విమలక్క, తదితర నేతలు సభలో పాల్గొని ఆపరేషన్ కగార్‌పై అసమ్మతిని ప్రకటించారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హెచ్‌సీఏ వేసవి శిక్షణ శిబిరాలు

● నేటి నుంచి రెండు రోజులపాటు రిజిస్ట్రేషన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) రాష్ట్ర వ్యాప్తంగా 47 కేంద్రాల్లో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్, ఫలక్‌నామా, అంబర్‌పేట్, లాలాపేట్, చార్మినార్, బాలాపూర్, గోల్కొండ, ఏఎస్‌రావునగర్, ఆర్‌కేపురం, ఎల్బీనగర్‌లో శిబిరాలను ఏర్పాటు చేశారు. ఆసక్తిగల వారు www.hycricket.org వెబ్‌సైట్‌లో శనివారం నుంచి పేర్లు నమోదు చేసుకోవచ్చు. జిల్లాల్లోని క్రికెటర్లు జిల్లా క్రికెట్ సంఘాల కార్యాలయాల్లో పేర్లను ఆఫ్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. ఈనెల 6 నుంచి శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్టు హెచ్‌సీఏ సంయుక్త కార్యదర్శి టి.బసవరాజు వెల్లడించారు.

నేటి నుంచి ఫిఫా సాకర్ ట్రయల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఫుట్‌బాల్ సంఘం (ఏఐఎఫ్ఎఫ్)- అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) సంయుక్తంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) ఆధ్వర్యంలో ట్రయల్స్ నిర్వహించనుంది. శనివారం నుంచి జీఎంసీ బాలయోగి స్టేడియంలో నాలుగు రోజుల పాటు ఈ ట్రయల్స్‌ను బాలబాలికలకు విడివిడిగా నిర్వహించనున్నామని శాట్ అడ్మినిస్ట్రేటర్ మధు తెలిపారు. అండర్-15 కేటగిరీలో బాలురకు శని, ఆదివారం, బాలికలకు సోమ, మంగళవారం ట్రయల్స్ ఏర్పాటు చేశారు. ఈ నాలుగు రోజులు ఉదయం 6 నుంచి 9 గంటలు, సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య ట్రయల్స్ నిర్వహిస్తారు. ఆసక్తి గలవారు వయస్సు, ఒరిజినల్ నివాస ధ్రువపత్రాలు, జిరాక్స్ కాపీలను తీసుకొని గచ్చిబౌలి ఫుట్‌బాల్ స్టేడియంలో ట్రయల్స్‌లో పాల్గొనవచ్చు.

'బ్రెయిన్‌డెడ్' యువకుడి అవయవదానం

● ఎనిమిది మందికి ప్రాణదానం

హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి):తాను చనిపోతూ మరో 8 మందికి ప్రాణదానం చేశాడు. వరంగల్‌కు చెందిన బానోత్ రమణ (20) గత నెల 27న బైక్‌పై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొని గాయపడగా, అతడిని హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో గురువారం బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. అవయవదానంపై మృతుడి కుటుంబసభ్యులకు జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్లు అవగాహన కల్పించారు. వారు అంగీకరించడంతో రెండు మూత్రపిండాలు, కాలేయం, గుండె, రెండు కార్నియాలు సేకరించి బాధితులకు అమర్చినట్లు జీవన్‌దాన్ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ శ్రీభూషణ్ రాజు తెలిపారు.

చెప్పకుండానే గ్రూపులో చేర్చి..

● రూ.2.80 లక్షలు కాజేశారు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చెప్పకుండానే టెలీగ్రామ్ గ్రూపులో యాడ్ చేసి, స్వల్ప పెట్టుబడులతో భారీ లాభాలంటూ నగరవాసి నుంచి రూ. 2.80 లక్షలు కొల్లగొట్టారు. సిటీ సైబర్ క్రైమ్ డీసీపీ కవిత తెలిపిన వివరాల ప్రకారం నగరానికి చెందిన 29 ఏళ్ల వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు ఒక టెలీగ్రామ్ గ్రూపులో యాడ్ చేశారు. చిన్న చిన్న టాస్కులు ఇచ్చి అవి పూర్త చేస్తే డబ్బులు ఇస్తామంటూ మభ్యపెట్టారు. ఆన్‌లైన్ ఇన్వెస్టిమెంట్‌పై క్లాసులు చెబుతూ, పెట్టుబడులు పెట్టే విధంగా ప్రోత్సహించారు. ప్రారంభంలో పెట్టుబడు లకు అధిక లాభాలు వచ్చినట్లు చూపించారు. అలా మెల్లగా ఊబిలోకి దింపిన క్రిమినల్స్ నగరవాసి నుంచి రూ.2.80లక్షలు పెట్టుబడి పెట్టిం చారు. లాభాలతో కలిసి రూ.4.31లు వచ్చినట్లు చూపించి విత్‌డ్రా కోసం క్లోజ్ చేశారు. ఇంకా ఎక్కువ మొత్తంలో పెట్టుబడులు పెడితే మొత్తం తీసుకోవచ్చని చెప్పి తర్వాత స్పందించడం మానేశారు. దీంతో బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


వాట్సాప్‌లో వల.. చిక్కితే విలవిల

(5వ పేజీ తరువాయి)

పెడితే కష్టార్జితం మోసగాళ్ల పాలు కావడం ఖాయం. పెట్టుబడులు పెట్టి నష్టపోతున్న వారిలో ఎక్కువగా విశ్రాంత ఉద్యోగులు, గృహిణులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, నిరుద్యోగులు.. ఇలా చదువుకున్న వారే ఉంటున్నారని పోలీసు రికార్డులు చెబుతున్నాయి.

నిపుణులు ఏం చెబుతున్నారంటే..

- కంపెనీ లేదా స్కీమ్ గురించి పూర్తి సమాచారం సేకరించిన తర్వాతే పెట్టుబడి పెట్టాలి.
- లాభాలు ఆశించే వారు కచ్చితంగా ధృవీకరించిన ఆర్థిక సలహాదారులను సంప్రదించాలి.
- ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి.
- మోసపూరిత కార్యకలాపాల కోసమే ఎక్కువ సంఖ్యలో వాట్సాప్ గ్రూపులు, చానల్స్ ఏర్పాటవుతున్నాయి. గ్రూపుల్లో చేరకపోవడమే మంచిదని గ్రహించాలి.













బీఆర్ఎస్‌లో పలువురు చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

నార్సింగ్, మే 2(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు హైదరాబాద్ కోకాపేట్‌లోని మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. అభివృద్ధి విషయంలో తెలంగాణను బీజేపీ ప్రభుత్వం పూర్తిగా తుంగలో తొక్కిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసి చేసి అచారక పాలనను కొనసాగించడం బాధాకరమని అన్నారు. బీఆర్ఎస్ ప్రారంభించిన బసవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్టు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధిని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీరు, సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు వచ్చిన నీళ్లు ఇప్పుడు ఎందుకు రావడం లేదని ఆయన ప్రశ్నించారు. పాలనా వైఫల్యం, కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారిందన్నారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని అన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ దేశిటి పటేల్, రవికుమార్, మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు తుకారాం, భాస్వరం, సంగశేటి, సంజీవ్, అమృత్‌లు ఉన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



బషీర్‌బాగ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న అభిజిత్ యాదవ్, తదితరులు



చాంద్రాయణగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు బోయ నగేశ్, వెంకటేశ్ ముదిరాజ్, మహేశ్‌గౌడ్, శ్యామ్‌రావు ముదిరాజ్



గాంధీభవన్ వద్ద రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ నాయకులు

కులగణన నిర్ణయం కాంగ్రెస్ విజయం

బర్కత్‌పుర/గోషామహల్/చాంద్రాయణగుట్ట మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేపడుతామని ప్రకటించడం ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ సాధించిన విజయమని యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎడ్ల అభిజిత్ యాదవ్ అన్నారు. బీసీ కులగణన చేపట్టడంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, సీఎం రేవంత్ రెడ్డి చూపిన చొరవ అభినందనీయం అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా అభిజిత్ యాదవ్ మాట్లాడుతూ... 42శాతం బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో బిల్లుపెట్టి ఆమోదించాలని, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకర్, ఆకాష్, సాయికుమార్, శ్రావణ్, రంజిత్ పాల్గొన్నారు.

పోరాటాల ఫలితే కులగణన

● బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగెందర్ గౌడ్



బర్కత్‌పుర, మే 2 (ఆంధ్రజ్యోతి): కులగణన కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా జరిగిన పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి జాతీయ స్థాయి కులగణనకు ఒప్పుకుందని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగెందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలన్నా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తాను స్వాగతిస్తున్నామని త్వరలో ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసి కృతజ్ఞతలు తెలుపుతామని అన్నారు. తెలంగాణ స్ఫూర్తితోనే దేశవ్యాప్తంగా కులగణనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదించిందని ఆయన అన్నారు. దేశంలో కులగణన చేపట్టిన తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయిందని, ఆ ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందని ఆయన పేర్కొన్నారు.

ఫోర్త్ క్లాస్ ఉద్యోగులకు సన్మానం



డా.రజనీరెడ్డి, డా.మధులతను సన్మానిస్తున్న ఉద్యోగులు

చార్మినార్, మే 2 (ఆంధ్రజ్యోతి): పేట్ల బురుజు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన చికిత్స అందించడంలో వైద్యులు, చిరు ఉద్యోగుల పాత్ర కీలకమని పేట్ల బురుజు ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రజనీ రెడ్డి అన్నారు. శుక్రవారం మేడే వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆస్పత్రిలోని ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ ఉద్యోగులు, ఆస్పత్రిలో పనిచేసే స్వీపర్లతో పాటు వివిధ విభాగాల్లోని ఉద్యోగులను ఆమె శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రికొచ్చే వారికి మెరుగైన చికిత్స అందించడంలో సిబ్బంది పాత్ర కీలకమన్నారు. అనంతరం సూపరిటెండెంట్ డాక్టర్ రజనీరెడ్డికి ఆస్పత్రి డిప్యూటీ సూపరిండెంట్ ప్రొఫెసర్ మధులతను ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో సన్మానించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఉద్యోగులు, డి.వినోదా భాయ్, స్వరూప, మాణిక్, రాజు, భాగ్యవతి, ఉమా, శివ,ఇందిర, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎల్బీస్టేడియంలో త్యాగరాజ జయంత్యుత్సవాలు



సమావేశంలో బ్రౌచర్ ఆవిష్కరిస్తున్న అలేఖ్య పుంజాల, మనోహర్

రవీంద్రభారతి, మే 2 (ఆంధ్రజ్యోతి): కళారంగాన్ని విశేషంగా ప్రోత్సహించాలనే పిలుపుతో వరుసగా పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ డా.అలేఖ్య పుంజాల తెలిపారు. ఈ నెల 4న ఎల్బీస్టేడియంలో శ్రీత్యాగరాజ జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఈమేరకు శుక్రవారం అకాడమీ కార్యాలయంలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన వెయ్యి మంది కళాకారులు ఇందులో పాల్గొంటారని ఆమె తెలిపారు. 4వ తేదీ ఉదయం 10గంటలకు త్యాగరాజ పంచరత్న కీర్తనల గాన గోష్టితో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈసమావేశంలో అకాడమీ కార్యదర్శి బి.మనోహర్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముసాఫిర్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, మే 2 (ఆంధ్రజ్యోతి): విమల సాహితీ సమితి అధ్యక్షుడు డా. జెల్ది విద్యాధర్ రచించిన ముసాఫిర్ పుస్తకావిష్కరణ సభ శుక్రవారం జరిగింది. విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మశ్రీ పురస్కారగ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయితను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముసాఫిర్ పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమన్నారు. ఇలాంటి విభిన్న రచనలు రావాల్సిన అవసరముందని అన్నారు. కార్యక్రమంలో కళారత్న బిక్కికృష్ణ, విజయలక్ష్మి పండిత్, నాళేశ్వరం శంకరం, శైలజా మిత్ర, రోహిణి వంజారి, రాధా కుసుమ, మంజుల సూర్య పాల్గొన్నారు. సభకు ముందు కవిసమ్మేళనం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కవులు తమదైన శైలిలో కవితలను చదివి వినిపించారు.

'టెన్త్'లో జిల్లా టాపర్‌గా పాపిశెట్టి కార్తీక్



రాజేంద్రనగర్, మే 2(ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా టాపర్‌గా రాజేంద్రనగర్ సర్కిల్ గణేశ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పాపిశెట్టి కార్తీక్ చోటు దక్కించుకున్నారు. రాజేంద్రనగర్ మండల విద్యాశాఖాధికారి, పాఠశాల అధ్యాపకులు, కార్తీక్ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. సాధారణ కుటుంబంలో పుట్టిన కార్తీక్‌కు తండ్రి పి.శ్రీనివాసులు సహకారం లేదు. తల్లి సంతోషీ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తోంది. పాపిశెట్టి కార్తీక్ (హాల్ టికెట్ నెంబర్ 2523138358) 10వ తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను 584(97.33శాతం) సాధించారు. రాజేంద్రనగర్ మండలంలో టాపర్‌గా నిలిచిన పాపిశెట్టి కార్తీక్ రంగారెడ్డిజిల్లాలో కూడా టాపర్‌గా నిలవడంతో వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆదిల్ షరీఫ్, తదితరులు

అఫ్జల్‌గంజ్, మే 2(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జీహెచ్ఎంసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ సహకార్ మజ్దూర్ సంఘ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ కోరారు. ఈ మేరకు ఆయన జీహెచ్ఎంసీ నూతన కమిషనర్ కర్ణన్‌ను కలిసి విన్నవించారు. ఈ మేరకు సంఘం ప్రధాన కార్యదర్శి ఏవీఎస్ గాంధీ, ఉపాధ్యక్షుడు మోజెస్, మహిళా కమిటీ చైర్‌పర్సన్ ఎల్ మెర్సీ, శేరిలింగంపల్లి జోనల్ అధ్యక్షుడు వై.యాదగిరి, సికిందరాబాద్ జోనల్ అధ్యక్షుడు కొడారి రాజు, ఇతర సిబ్బంది కలిసి నూతన కమిషనర్‌ను సత్కరించి ఉద్యోగుల సమస్యలను వివరించారు.

పేద మహిళలకు తోపుడు బండ్లు అందజేత



తోపుడు బండ్లు పంపిణీ పవన్ కుమార్

పహాడిషరీఫ్, మే 2(ఆంధ్రజ్యోతి): ధనవంతులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి పేదలకు చేయూత అందించాలని మాజీ కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సహకారంతో రంగనాయకుల కాలనీకి చెందిన నిరుపేదలైన చిరు వ్యాపారులైన ఆరుగురి మహిళలకు తోపుడు బండ్లు పంపిణీ చేశారు కార్యక్రమంలో జీఎంఆర్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ హెడ్ శుభ్రత రాయి, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సాయి శ్రీనివాస్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నగర సైబర్ క్రైం అధికారులు, సిబ్బంది

హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు జరిగే తీరును తెలుసుకుంటే.. సైబర్ నేరాల బారినపడే అవకాశం ఉండదని సైబర్ క్రైం అధికారులు తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా నిజాం కాలేజ్ హాస్టల్‌లో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాలు జరిగే తీరుపై వివరించారు. ఫెడెక్స్, కొరియర్ పార్సిల్, డిజిటల్ అరెస్ట్, ఏపీకే ఫైల్స్, ఓటీపీ, రివార్డ్ పాయింట్స్, పార్ట్‌టైం జాబ్, ట్రేడింగ్, పెట్టుబడి మోసాలు, నకిలీ లోన్‌యాప్, సోషల్ మీడియా వేదికగా జరిగే వేధింపులు జరిగే తీరుపై విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే సైబర్ క్రైం వెబ్‌సైట్ లేదా 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకుల నియామకం

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలకులను తెలుగుదేశం పార్టీ నియమించింది. ముషీరాబాద్ నియోజకవర్గం పరిశీలకులుగా కె.పరుశురామ్, పి.వీరబాబు, అంబర్‌పేటకు పి.బాల్‌రాజ్‌గౌడ్, లాయక్, ఖైరతాబాద్‌కు రాజేంద్రప్రసాద్, మల్లికార్జున్, జూబ్లీహిల్స్‌కు ఎంకే బోస్, సి.విఠల్, సనత్‌నగర్‌కు నల్లెల కిషోర్, మేడిపల్లి శ్యామ్‌సుందర్, నాంపల్లికి ఎం.రాజు, సత్యనారాయణ, సికింద్రాబాద్ నియోజకవర్గం పరిశీలకులుగా జాకబ్, ఎ.బి.ఆర్.మోహన్‌రావును నియమించారు.

గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న హిందీ ప్రచార సభ ప్రతినిధులు

బర్కత్‌పుర, మే 2(ఆంధ్రజ్యోతి): హిందీ ప్రచార సభ హైదరాబాద్ స్థాపించి 90 ఏళ్ళు నిండిన సందర్భంగా ఈ నెలాఖరున జాతీయ స్థాయిలో నిర్వహించనున్న 90వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం హిందీ ప్రచార సభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఎస్ గైబువల్లీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం గవర్నర్‌ను కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శాలువా జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హిందీ ప్రచార సభ న్యాయ సలహాదారులు జె.వెంకట్రాము నర్సింహారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ శృతి కాంతు భారతి, తెలంగాణ హిందీ ప్రచార సభ అధ్యక్షుడు కె. రాంచందర్, కార్యదర్శి ఏకే రాజు, ఉద్యోగుల సంఘం కార్యదర్శి శివలింగం తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరు సంతోషకరం



మమత గుప్తా, సంతోష్‌గుప్తాలకు శాలువా కప్పి సత్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అఫ్జల్‌గంజ్, మే 2 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గంలోని గన్‌ఫౌండ్రీ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ నిధులు మంజూరు చేసిన సందర్భం గా గన్‌ఫౌండ్రీ మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, సంతోష్‌గుప్తా మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గోషామహల్ నియోకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని మమతా, సంతోష్‌గుప్తా తెలిపారు.

లంగర్‌హౌజ్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటరాములు



కార్వాన్, మే 2(ఆంధ్రజ్యోతి): లంగర్‌హౌజ్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటరాములు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రాఘవేంద్ర బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో వెంకటరాములు బాధ్యతలు చేపట్టారు. ఈయన 2002 బ్యాచ్‌కు చెందినవారు. ఈయన గతంలో రాంగోపాల్‌పురం ఇన్‌స్పెక్టర్‌గా, రైల్వే ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటరాములు మాట్లాడుతూ... శాంతిభద్రతల పర్యవేక్షణకు ప్రజలు తమకు సహకారం అందించాలన్నారు.

బండ్లగూడ ఇన్‌స్పెక్టర్‌గా గుర్నాథ్



మదీన, మే 2 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కె.గుర్నాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేస్తున్న కె.సత్యనారాయణ లంగర్‌హౌజ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో గుర్నాథ్ బాధ్యతలు చేపట్టారు.

చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్‌గా గోపీ

చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా రౌతు గోపీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేస్తున్న గుర్నాథ్ బండ్లగూడకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో గోపీ బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని వారన్నారు.

ఎస్ఐకు వీడ్కోలు

ఖైరతాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో 41 సంవత్సరాల పాటు సేవలందించి మంచి అధికారిగా గుర్తింపు పొందిన ఎస్ఐ అమర్‌నాథ్‌కు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, డీఐ విఘ్నేశ్వర్, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, మహిళా సిబ్బంది ఆయనకు పోలీస్ స్టేషన్‌లో పూలబొకేలు ఇచ్చి వీడ్కోలు చెప్పారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/FmTZBJZలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



● జలవిహార్‌లో ఈనెల 4న సాయంత్రం జరుగనున్న తన కుమారుడు డాక్టర్ కృష్ణ, డాక్టర్ అంజలి వివాహ విందుకు హాజరు కావాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌కు శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేస్తున్న జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు - **బర్కత్‌పుర, మే 2(ఆంధ్రజ్యోతి)**



● గౌలిపురా డివిజన్‌లో తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ యాకుత్‌పురా ఏ బ్లాక్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్ తదితరులు - **చాంద్రాయణగుట్ట, మే 2(ఆంధ్రజ్యోతి)**

ఎయిర్‌పోర్టులో గుండెపోటుతో వ్యక్తి మృతి



మృతి చెందిన ఆజాద్

శంషాబాద్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన శంషాబాద్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని గోల్కొండకు చెందిన ఆజాద్(47) గురువారం తన కూతురు తలాత్ స్రీన్ బీదర్‌లోని షాహీన్ యూనివర్సిటీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కూతురిని బీదర్‌లో వదిలిపెట్టేందుకు వెళ్లిన ఆజాద్ తిరుగు ప్రయాణంలో ఇండిగో విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. ఎయిర్‌పోర్టులో ఒక్కసారిగా పడిపోవడంతో గమనించిన స్థానికులు వెంటనే అపోలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈఘటనపై మృతుడి సోదరుడు సజ్జాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..

బర్కత్‌పుర, మే 2 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. ఉందానగర్ - జూకల్ రైల్వే స్టేషన్‌ల మధ్య 45ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.13లో క్రికెట్ బెట్టింగ్ జరుగుతుందని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు దాడులు నిర్వహించగా ఓ వ్యక్తి లేజర్ 247 అనే మొబైల్ యాప్ లో బెట్టింగ్ పెడుతున్నట్టు తేలింది. అతడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా సింగాడిబస్తీకి చెందిన పి. వెన్నూరు అని తేలింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఊరు వెళ్లొచ్చే సరికి చోరీ

బంజారాహిల్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): భార్యను తీసుకువచ్చేందుకు ఊరెళ్లి వచ్చేసరికి బంగారు నగలు చోరీ అయ్యాయి. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10 ఇబ్రహీంనగర్‌లో నివసించే ఎస్.రాధాకృష్ణ ఫార్మసిస్ట్. భార్య మానస పుట్టింటికి వెళ్లే ముందు గత నెలలో బంగారు గొలుసు, ఉంగరాలను ఓ పర్సులో పెట్టి అల్మారాలో భద్రపరిచింది. అప్పటి నుంచి రాధాకృష్ణ ఇంట్లో ఒంటరిగానే ఉంటున్నాడు. గత నెల 26న భార్యను తీసుకువచ్చేందుకు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లాడు. ఈనెల ఒకటో తేదీన తిరిగి వచ్చేసరికి ఇం టి తాళం పగలగొట్టి ఉంది. అల్మారాలో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్విమ్మింగ్ పూళ్లలో క్లోరినేషన్ చేయాలి

ఖైరతాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా స్విమ్మింగ్ పూళ్లలో అవసరం మేరకు క్లోరినేషన్ చేయాలని, శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ క్రీడావిభాగం డిప్యూటీ డైరెక్టర్ రహీనాబేగం సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఖైరతాబాద్ జోన్‌లోని పలు క్రీడా కాంప్లెక్స్‌లతోపాటు విజయనగర్‌కాలనీ, అమీర్‌పేట తదితర స్విమ్మింగ్ పూళ్లను ఆమె పరిశీలించారు. కోచ్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

'హైదరాబాద్' రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మన్‌గా శ్రీనివాస్ యాదవ్



గడ్డం శ్రీనివాస్‌యాదవ్, షేక్ సలాం బిన్ అబ్దుల్లాలను సన్మానిస్తున్న పహిల్వాన్లు

గోషామహల్, మే 2 (ఆంధ్రజ్యోతి): రెజ్లింగ్ క్రీడాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హైదరాబాద్ డిస్ట్రిక్ట్ రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బషీర్‌బాగ్ ఫతేమైదాన్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో గడ్డం శ్రీనివస్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాల్లో రెజ్లింగ్ క్రీడాకారుల కోటాను నిషేధించారని, దాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌గా షేక్ సలాం బిన్ అబ్దుల్లా, జనరల్ సెక్రెటరీగా నశీర్ కౌలాకీ, ఉపాధ్యక్షులుగా శైలేంద్ర సింగ్, సి.కిరణ్ యాదవ్, కోశాధికారిగా ఖలీద్ భామస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా మహ్మద్ అస్లం, జాయింట్ సెక్రెటరీగా కె.లింగం, బార్కస్, బేగంబజార్‌కు చెందిన ప్రముఖ పహిల్వాన్ పాల్గొని చైర్మన్‌గా ఎన్నికైన గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను శాలువాతో సన్మానించారు.

సైనిక్‌పురి శుభారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎల్.వెంకట్రామ రెడ్డి స్మారక బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో సైనిక్‌పురి జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లే గ్రౌండ్ (వీపీజీ)లో ఈ పోటీలను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. తొలి మ్యాచ్‌లో సైనిక్‌పురి జట్టు 22-15, 36-33తో వీపీజీ టీమ్‌పై గెలిచింది. సైనిక్‌పురి ఆటగాడు మోనిష్ 16 పాయింట్లతో ఆ జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. ఈ పోటీల ప్రారంభోత్సవంలో రాష్ట్ర బాస్కెట్‌బాల్ అధ్యక్షుడు రావుల శ్రీధర్ రెడ్డి, టెక్నో పెయింట్స్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్‌గా అబ్దుల్లా యాఫై



పహాడిషరీఫ్, మే 2 (ఆంధ్రజ్యోతి): యువకులు కుస్తీ పోటీల్లో శిక్షణ తీసుకుంటే ఆరోగ్యాంగా ఉంటారని ప్రముఖ మల్లా యోధుడు షైక్ సాలం బిన్ అబ్దుల్లా యాఫై అన్నారు. శుక్రవారం ఎల్‌బీ స్టేడియంలో జరిగిన హైదరాబాద్ జిల్లా అమెచ్యూర్ రేజలింగ్ అసోసియేషన్ ఎన్నికల్లో జల్‌పల్లి మున్సిపాలిటీ ఎర్రకుంటకు చెందిన షైక్ సాలం బిన్ అబ్దుల్లా యాఫై వైస్ చైర్మన్‌గా ఎన్నికయారు. యువకులకు మంచి కోచ్‌లతో శిక్షణ ఇప్పించి కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబర్చేలా కృషి చేస్తానని, హైదరాబాద్‌లోని క్రీడాకారులు కూడా జాతీయ అంతర్జాతీయ, స్థాయిలో రాణించేలా కృషి చేస్తానన్నారు.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
గోవిందరావు : 9703618721, రాజ్ కుమార్: 9985921389
కె. అనిల్ కుమార్: 99854 03628

ఒక్కపూటలోనే కీమోథెరపీ

● క్యాన్సర్ బాధితుల పడిగాపులకు ఇక చెక్ ● ఉదయం చేరితే సాయంత్రం ఇంటికి
● రేడియో థెరపీలోనూ ఆధునిక చికిత్స ● కార్పొరేట్ స్థాయి వైద్యంపై ఎంఎన్‌జే దృష్టి

హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి కార్పొరేట్ ఆస్పత్రులతో పోటీ పడుతోంది. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా కొత్త పరికరాలను, ఆధునిక యంత్రాలను సమకూర్చుకుంటూ క్యాన్సర్ బాధితులకు మెరుగైన చికిత్సలు అందించడంపై దృష్టి సారించింది. క్లిష్టమైన క్యాన్సర్ రోగులకు ప్రత్యేక చికిత్సలు, ఆధునాతన సిటీస్కాన్, రోబోటిక్, పెట్ స్కాన్ వంటి ఆధునిక పరికరాలు సమకూర్చుకున్న ఎంఎన్‌జే ఆస్పత్రి తాజాగా మరికొన్ని యంత్రాలను సమకూర్చుకుని రోగులకు సత్వర సేవలు అందిస్తోంది. రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య, కీమోథెరపి, రేడియోథెరపి తీసుకునే బాధితులు రోజురోజుకు పెరిగిపోతున్నారు. వారికి మెరుగైన సేవలందించేందుకు ఆస్పత్రి నాలుగు ఆధునిక లీనరీ ఆక్సిలేటర్ యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రస్తుతమున్న యంత్రాలపై రోజుకు 120 మంది వరకు మాత్రమే చికిత్స చేస్తుండగా, కొత్త యంత్రాల ద్వారా 200 మందికి రేడియేషన్ థెరపీ ఇచ్చే సౌకర్యం కలిగింది. దీంతో ఎక్కువ మందికి తక్కువ సమయంలో థెరపీ ఇచ్చే అవకాశం ఏర్పడింది.



బ్రాకీ థెరపీ చికిత్స

క్యాన్సర్ బాధితులకు అంతర్గతంగా ఇచ్చే బ్రాకీ థెరపీని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకువచ్చింది. బ్రాకీ థెరపీ అనేది అంతర్గత రేడియేషన్ థెరపీ క్యాన్సర్ చికిత్స. ముఖ్యంగా గర్భాశయ క్యాన్సర్, పెద్దపేగు, కిడ్నీ, రెక్టాల్, ప్రొస్టేట్ క్యాన్సర్లలో బ్రాకీ థెరపీని చేస్తారు. రేడియో ధార్మిక వనరులను కణితి వద్ద క్యాప్సూల్స్ ఏర్పాటు చేసి అవసరమైన మోతాదులో రేడియేషన్‌ను అందిస్తారు. చుట్టపక్కల ఆరోగ్యకరమైన కణజాలాలకు నష్టం తగ్గిస్తారు.

గతంలో రోజుల తరబడి..

కీమోథెరపి ఒకసారి చేయించుకునేందుకు గతంలో మూడు, నాలుగు రోజుల పాటు ఆస్పత్రిలో అడ్మిట్ కావాల్సిన పరిస్థితి ఉండేది. ఒకరోజు అడ్మిషన్, మరోరోజు వైద్య పరీక్షలు, ఇంకోరోజు ఆరోగ్యశ్రీ నుంచి అప్రూవల్ చేయించుకోవడం.. ఇలా వీటిపై రోగులు దృష్టి పెట్టాల్సి వచ్చేంది. మరోవైపు క్యాన్సర్ తీవ్రతను ఆధారంగా చేసుకుని 6 నుంచి 8 సెషన్లలో కిమోథెరపీ ఇచ్చేవారు. దీంతో గ్రామాల నుంచి వచ్చే రోగులు, వారి సహాయకులు రోజుల తరబడి ఆస్పత్రిలో ఉంటూ, వంటావార్పులతో చికిత్సల కోసం ఎదురుచూసేవారు.

డే కేర్ సదుపాయం

ప్రస్తుతం కీమోథెరపి కోసం వచ్చిన రోగులు ఒక్కపూటలో అన్నీ చక్కబెట్టుకుని ఇంటికి వెళ్లే పరిస్థితిని వైద్యులు కల్పిస్తున్నారు. ఇందుకు ఆధునిక యంత్రాలు అందుబాటులో ఉండడమే కారణం. ప్రస్తుతం కీమోథెరపీ డే కేర్ సదుపాయం సైతం కల్పించారు. ఒకేరోజు అడ్మిషన్, వైద్యపరీక్షలు, ఫలితాలు, ఆరోగ్యశ్రీ అప్రూవల్ చేసి కీమోథెరపీ ఇస్తున్నారు. సాయంత్రం వరకు అన్ని పరీక్షలు పూర్తి చేసి ఇంటికి పంపిస్తున్నారు. ఇలా డే కేర్ చికిత్సలో 50 నుంచి 60 మందికి కీమోథెరపి ఇస్తున్నారు.

రోజుకు 1500 మంది ఓపీ



ఎంఎన్‌జే క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో రోగికి సత్వర, మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆధునిక సదుపాయాలు కల్పిస్తున్నాం. లేటెస్ట్ పరికరాలను తెప్పించి చికిత్సలు అందిస్తున్నాం. ఎక్కువ రోజులు ఆస్పత్రిలో ఉండకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. రోజుకు 1500 మంది ఓపీ ఉంటుంది. 650 మంది ఆస్పత్రి అడ్మిషన్ ఉంటుంది. ఎక్కువగా క్యాన్సర్ బాధితులు వస్తుండడంతో మెరుగైన చికిత్స అందించడానికి ఆధునిక యంత్రాలను సమకూర్చుకున్నాం. కొత్త యంత్రాల ద్వారా టార్గెట్ థెరపీ ఇస్తుండడంతో ఇతర అవయవాలు దెబ్బతినకుండా ఉంటుంది.

డాక్టర్ శ్రీనివాసులు, డైరెక్టర్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఇనిస్టిట్యూట్

చల్లని నీరు



మండుతున్న ఎండలకు దాహార్తిని తీర్చుకునేందుకు పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి దాహార్తిని తీర్చేందుకు ట్రాఫిక్ పోలీసులు నడుంకట్టారు. మదీన చౌరస్తా వద్ద పాదచారులకు ఇలా చల్లటి నీటిని ఇస్తూ దాహం తీరుస్తున్నారు.

ఫొటో: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో వేమూరి షైనీ



హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో వేమూరి షైనీ చోటు దక్కించుకుంది. గత డిసెంబరు 1వ తేదీన మణికొండలోని హాలెల్ సంగీత పాఠశాలలో షైనితో సహా 1,046మంది గంట పాటు నిర్విరామంగా కీబోర్డు వాయించారు. అనంతరం ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. వీడియోను గమనించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు ప్రదర్శన గురించి తెలుసుకొని, నిర్ధారించుకుని షైనికి సర్టిఫికెటును ప్రదానం చేశారు.

మెట్రో కాంబో టికెట్లు, కొత్తపాస్‌లపై ఆర్టీసీ దృష్టి

● ఆదాయం పెంచుకునే దిశగా ఆర్టీసీ చర్యలు

హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): డిపోల వారీగా బస్ టికెట్లతో వచ్చే ఆదాయం పెంచుకునే దిశగా గ్రేటర్ ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జనరల్ బస్‌పాస్ దారులు రూ.20 చెల్లించి మెట్రో కాంబో టికెట్‌తో గ్రేటర్‌పరిధిలో మెట్రోడీలక్స్ బస్సుల్లో ప్రయాణించే సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. మెట్రో డీలక్స్ బస్సుల్లో రద్దీ కొంతమేర తక్కువగా ఉంటుండటంతో శివారు ప్రాంతాల వారికి ఈ మెట్రో కాంబో టికెట్ ఉపయోగపడుతుందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇదే తరహాలో మరిన్ని కొత్త కాంబో టికెట్లు అందుబాటులోకి తెచ్చి రోజు వారి ఆదాయం పెంచుకునే అవకాశాలపై ఆర్టీసీ దృష్టిసారిస్తోంది. గ్రేటర్ ఆర్టీసీకి రోజు వారీగా రూ. 6 కోట్లు ఆదాయం వస్తుండగా, అందులో 3.5 కోట్లు మహాలక్ష్మీ జీరో టికెట్లతోను, రూ.2.5 కోట్లు టికెట్లతోను వస్తోంది.

ప్రఖ్యాత దర్శకులు, రంగస్థల నటుడు

ఉదయభాను మృతి



చిక్కడపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాత థియేటర్ నటుడిగా పేరుగాంచిన ప్రఖ్యాత దర్శకులు, నటులు, రచయిత ఉదయభాను గరికిపాటి(72) శుక్రవారం ఉదయం ముషీరాబాద్‌లో కన్నుమూశారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు, మనవడు ఉన్నారు. ఉదయభాను చాలా చిన్నవయస్సులోనే రంగస్థలంపై ఆసక్తి చూపించారు. 1989లో అతని థియేటర్ గ్రూప్ భూమిక ఏర్పడింది. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ థియేటర్ వ్యక్తిత్వాల సహకారంతో నాటకరంగంలో పలు ప్రయోగాలు చేశారు. తెలుగు, హిందీ భాషల్లో 70కిపైగా నాటకాలకు ఆయన దర్శకత్వం వహించారు. దర్శకత్వం వహిస్తూనే పలు నాటకాల్లోనూ నిబద్ధతతో నటించారు. ఇండియన్ రైల్వేస్‌లో అనేకమైన బహుమతులు, రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డులు అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు సీనియర్ ఫెలోషిప్ ఇచ్చి మరింత ప్రోత్సహించింది. ఆయన తన చివరి క్షణాల్లో కూడా రాబోయే థియేటర్ కార్యకలాపాలను ప్లాన్ చేసిన తర్వాతే వైద్యం తీసుకున్నారని కుటుంబసభ్యులు తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

నీట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

● వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి, మే 2(ఆంధ్రజ్యోతి): 4వ తేదీన జరగనున్న నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చీఫ్ సెక్రటరీ రామకృష్ణరావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ పరీక్ష కోసం జిల్లాలో 13 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 4,336 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారని వివరించారు. ప్రతీ పరీక్ష కేంద్రానికి తహసీల్దార్ డ్యూటీ మేజిస్ట్రేట్‌గా నియమించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీసీపీ కోటిరెడ్డి, డీఆర్వో హరిప్రియ, అధికారులు పాల్గొన్నారు.

బైపాస్‌కు ప్రత్యామ్నాయం టీసీఆర్‌ఏటీ

గుండె బాధితులకు అరుదైన సర్జరీ

హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): గుండె సమస్యతో వచ్చిన ఇద్దరు వ్యక్తులకు బైపాస్ సర్జరీకి ప్రత్యామ్నయంగా పల్స్ హార్ట్ ఆస్పత్రి వైద్యులు అరుదైన సర్జరీని నిర్వహించారు. టోటల్ ఎండోస్కోపిక్ కరోనరీ రివాస్కులరైజేషన్ వయా థొరాకోటమీ (టీసీఆర్‌ఏటీ) ప్రక్రియ నిర్వహించి బాధితులకు ప్రాణాపాయం తప్పించినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉప్పల్‌కు చెందిన శ్రీరాములు, మియాపూర్‌కు నివాసి శోభ గుండె సమస్యతో ఇటీవల మియాపూర్‌లోని పల్స్ హార్ట్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చారు. బాధితులకు మూడు రక్తనాళాలో బ్లాక్స్ ఉండడంతో సర్జరీ టీసీఆర్‌ఏటీ ప్రక్రియ చేయాలని నిర్ణయించారు. ఛాతీ ఎడమ వైపున ఒక చిన్న కోత (ఎడమ పూర్వ థొరాకోటమీ) ద్వారా, రొమ్ము ఎముకను తెరవకుండా, పూర్తి కరోనరీ రివాస్కులరైజేషన్‌ను ప్రక్రియలో చికిత్స చేసినట్లు చెప్పారు. సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎస్ ముఖర్జీ, సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ వంశీ కృష్ణ, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ మొవ్వా శ్రీనివాస్, కార్డియాక్ అనస్థీషియాలజిస్టు డాక్టర్ శశికాంత్ బృందం ఈ సంక్లిష్ట ప్రక్రియను పూర్తిచేశారు.



రోగులతో డాక్టర్ ఎంఎస్ఎస్ ముఖర్జీ

ఆర్బిట్రేషన్ అవార్డుల సవరణలో

కోర్టుల జోక్యం ఉండదు

మన్సూరాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తులు పరస్పర సమ్మతితో నియమించుకున్న ఆర్బిట్రేటర్ ఇచ్చిన అవార్డులను సవరించే అధికారం ఇకపై కోర్టులకు లేనట్టేనని ఎల్బీనగర్‌లోని అమిక మధ్యవర్తిత్వ కేంద్రం అధ్యక్షురాలు జ్యోతిరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్బిట్రేషన్ అవార్డులను కోర్టులు సవరించవచ్చా అనే ప్రశ్న చాలా కాలంగా సుప్రీంకోర్టులో ఉండగా ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించిన ధర్మాసనం వారి తీర్మానాలను పరిశీలించి సవరించొద్దంటూ ఆర్బిట్రేషన్ చట్టంలోని సెక్షన్-5కు సవరణ చేసినట్లు తెలిపారు. అవార్డుల్లో కొంత చట్టబద్ధం, మరికొంత చట్ట వ్యతిరేకంగా ఉన్నప్పుడు మాత్రమే ఆచీతూచీ కోర్టులు జోక్యం చేసుకోవాలే తప్ప.. న్యాయపరంగా ఉంటే ఎలాంటి జోక్యం తగదన్నట్లు ధర్మాసనం అభిప్రాయపడిందన్నారు.

రేపు గౌ మహా హారతి

1కె గౌ వాక్, గో రక్షక్ అవార్డులు..



గౌ మహాహారతి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మహంత్ ముఖేష్‌నాథ్, లక్ష్మి, వైభవ్ సూర్య తదితరులు

పంజాగుట్ట,మే 2(ఆంధ్రజ్యోతి): గోవుల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఆదివారం గౌ మహా హారతి కార్యక్రమాలు చేపడుతున్నట్లు విశ్వహిందూ మహాసంఘ్ జాతీయ కన్వీనర్ మహంత్ ముఖేష్‌నాథ్ జీ, జాతీయ కో - ఆర్డినేటర్ లక్ష్మీజీ అన్నారు. శుక్రవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 4వ తేదీ ఉదయం 6 గంటలకు నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ లలిత కళా తోరణం నుంచి 1కె గౌ వాక్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గో కథ, చండీహోమం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. గో రక్షకులకు అవార్డులను అందిస్తామని, రాత్రి 8 గంటలకు గౌ మహా హారతితో కార్యక్రమాలు ముగుస్తాయని వివరించారు. ఈ సమావేశంలో మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు వైభవ్ సూర్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమత, గ్లోబల్ హిందూ ఫెడరేషన్ వ్యవస్థాపకులు చంద్రశేఖర్ చౌహాన్, లవ్ ఫర్ కౌ అధ్యక్షుడు జస్మత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీ స్టేడియంలో త్యాగరాజ జయంతి

ఉత్సవాలకు సన్నాహాలు

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎల్బీ స్టేడియంలో ఈ నెల 4వ తేదీన త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాలు భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు అలేఖ్య పుంజాల తెలిపారు. శుక్రవారం కళాభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వేయి మందికి పైగా సంగీత కళాకారులు వేడుకలో పాల్గొంటారని తెలిపారు.



ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న వీసీ కిషన్‌కుమార్ రెడ్డి, మేనేజ్‌మెంట్ కాలేజీ ప్రిన్సిపాల్ సింధు, పరిశ్రమల నిపుణులు

జేఎన్‌టీయూలో ఘనంగా మేనేజ్‌మెంట్ ఫెస్ట్

హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. యూజీసీ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో వర్సిటీ వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అలాగే, పలువురు ఇండస్ట్రీ నిపుణులు ఫెస్ట్‌కు హాజరై తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ప్రస్తుత మార్కెట్ ధోరణులు, పరిశ్రమల్లో అవకాశాలు, లీడర్‌షిప్ నైపుణ్యాలపై విలువైన సూచనలు అందించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.సింధు, హెల్త్‌కేర్ ఇన్నేమైండ్స్, ప్రెసిడెంట్ రత్నాకర్, డెలాయిట్ ప్రతినిధి డా.త్రివిక్రమ్, మహిళా పారిశ్రామికవేత్త కవిత రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు.. 3 కేజీల గంజాయి పట్టివేత



పోలీసులకు చిక్కిన గంజాయి స్మగ్లర్స్. చిత్రంలో స్వాధీనం చేసుకున్న గంజాయి

హైదరాబాద్ సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు దాడులు నిర్వహించారు. గంజాయి తరలిస్తున్న ఇద్దరు స్మగ్లర్స్‌ను అరెస్టు చేశారు.వారి నుంచి 3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. జియాగూడలో సంజయ్‌సింగ్ అనే వ్యక్తి స్కూటీపై గంజాయిని తీసుకెళ్లి విక్రయిస్తుండగా ఎస్‌టీఎఫ్ 'ఏ' టీమ్ సభ్యులు దాడిచేసి పట్టుకున్నారు. అతని వద్ద 2.78 కేజీల గంజాయి, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అతనికి గంజాయి సరఫరా చేస్తున్న ధూల్‌పేటకు చెందిన ఠాకూర్ అశిష్‌సింగ్, లక్ష్మణ్‌సింగ్, నీరజ్ రాయ్‌పై కేసు నమోదు చేశారు. మరో కేసులో మూసాపేట్ జేపీ, భరత్‌నగర్ ప్రాంతాల్లో ఎస్‌టీఎఫ్ డి టీమ్ దాడులు నిర్వహించి ఈస్టు గోదావరి జిల్లాకు చెందిన గంజాయి స్మగ్లర్ కొంపల్లి యశ్వంత్ సాయిషణ్ముఖను పట్టుకున్నారు. అతని వద్ద 1.20 కేజీల గంజాయిని, బైక్, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీ టీమ్ ఎస్సై జ్యోతి తెలిపారు. అతన్ని బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

సకాలంలో వేతనాలు ఇవ్వాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఎన్‌ఐఆర్‌డీపీఆర్ ఉద్యోగులు

రాజేంద్రనగర్, మే2(ఆంధ్రజ్యోతి): సకాలంలో తమకు వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉద్యోగ విరమణ పొందిన పింఛనర్లు మౌన ప్రదర్శన నిర్వహించారు. ఏప్రిల్ నెలకు సంబంధించి రావాల్సిన వేతనాలు, పింఛన్ చెల్లించకపోవడంతో శుక్రవారం వారందరూ భోజన విరామ సమయంలో ఎన్ఐఆర్‌డీపీఆర్ కార్యాలయం ఎదుట నోటికి నల్ల రుమాళ్లు కట్టుకుని ప్లకార్డులు చేత పట్టుకుని నిరసన తెలిపారు. 2025 ఏప్రిల్ నుంచి భారత ప్రభుత్వం ఎన్ఐఆర్‌డీపీఆర్‌కు ఇవ్వాల్సిన గ్రాంట్‌ను నిలిపివేయడంతో ఈ సమస్య ఏర్పడిందని, సంస్థలో తగినంత పొదుపుతో పాటు కార్పస్ ఫండ్ నుంచి వడ్డీ ఆదాయం ఉన్నప్పటికీ సంస్థ డైరెక్టర్ జనరల్ ఉద్దేశ పూర్వకంగా జీతం, పింఛన్ విడుదల చేయడం లేదని వారు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం, గ్రామీణాభివృద్ధిశాఖ తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీటు కోసం ఘర్షణ



ధనుష్ గౌడ్

కేపీహెచ్‌బీకాలనీ, మే 2 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగేందుకు వెళ్లిన ఓ యువకుడు పర్మిట్ రూంలో సీట్ కోసం తలెత్తిన వివాదంతో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూసాపేట్‌లో నివాసం ఉండే కేశవ్, గాజులరామారంలో ఉండే ధనుష్ గౌడ్ (22) ఏప్రిల్ 5న కూకట్‌పల్లి మెయిన్‌రోడ్డులోని ఓ వైన్‌షాపులో మద్యం తాగారు. అక్కడ ఉన్న పర్మిట్ రూంలో కూర్చునేందుకు సీటుకోసం ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. కేశవ్ కోపంతో ధనుష్‌గౌడ్‌పై పిడిగుద్దులు గుద్దాడు. దీంతో స్పృహ కోల్పోయిన అతన్ని స్నేహితులు, కుటుంబ సభ్యులు నిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 1న మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు రాత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైన్ షాపులో సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కేశవ్‌ను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

కాంట్రాక్టర్ ఇంట్లో బయటపడిన

42 విద్యుత్ మీటర్లు

● స్వాధీనం చేసుకున్న పోలీసులు
● కేసు నమోదు



పోలీసులు స్వాధీనం చేసుకున్న విద్యుత్ మీటర్లు

రాయదుర్గం, మే2 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఇంట్లో అక్రమంగా దాచిన విద్యుత్‌శాఖకు చెందిన 42 కరెంటు మీటర్లు బయటపడ్డాయి. రాయదుర్గం పోలీసులు శుక్రవారం వాటిని స్వాధీ నం చేసుకుని కేసు నమో దు చేశారు. దీంతో విద్యుత్ శాఖలో మరోసారి డొల్లతనం బయటపడింది. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్. వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం విద్యుత్‌శాఖ ఇబ్రహీంబాగ్ సబ్‌డివిజన్‌కు చెందిన ఏడీ అంబేడ్కర్ తమ వద్ద ఉండాల్సిన విద్యుత్ మీటర్లలో కొన్ని చోరీకి గురయ్యాయని రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలో తమ వద్ద పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ చెన్నకేశవరెడ్డి వద్ద ఉండొచ్చన్న అనుమానం వ్యక్తం చేశాడు. గచ్చిబౌలి టెలికంనగర్‌లో ఉంటున్న చెన్నకేశవరెడ్డి ఇంటిని పోలీసులు తనిఖీ చేయగా 42 మీటర్లు బయటపడ్డాయి. వీటిని అక్రమంగా ఇంట్లో దాచి ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. మీటర్లను స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి Daily CLASSIFIEDS

JOBS

★ స్వాదు ఫుడ్స్ KPHB 5వ ఫేజ్, D-మార్ట్ రోడ్, తెలుగు పిండి వంటకాలు, మిఠాయి, పచ్చళ్ళు వండటానికి మగ మాస్టర్, హెల్పర్ కావలెను. Ph: 9701818521 AJH› 2078

PLOTS FOR SALE

★ Plots RERA, DTCP Jadcherla Bangalore Highway, Near SEZ IT Park, Amazon Warehouse, Airport Residential Area Ph: 9963186433 / 9491941756 AJH› 110

CHANGE OF NAME

★ I, THURPINTI ARCHANA W/O B NARAYANA REDDY R/o Plot No.46, Sunder Nagar, Near Community Hall, Ameerpet, Hyd›0

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ADVT

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
99859 21380, 99859 21386
97036 18806

చట్టాలను నిలదీసే హక్కు సుప్రీంకోర్టుకు ఉంది

● మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు వాటికి అనుకూలంగా చట్టాలు చేసుకుంటే వాటిని నిలదీసే హక్కు సుప్రీంకోర్టుకు ఉందని మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆ బాధ్యతను రాజ్యాంగమే సుప్రీంకోర్టుకు ఇచ్చిందన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో 'గవర్నర్లు- న్యాయవ్యవస్థ- రాజ్యాంగం' అన్న అంశంపై సదస్సు జరిగింది. వేదిక ప్రతినిధి ఉమామహేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగంలో ప్రభుత్వంపై దావాలు వేయడానికి పొందుపరిచిన ఆర్టికల్ 32పై దాడి జరుగుతోందని చెప్పారు. దానిని అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందరికీ ఒకే రీతిలో న్యాయం జరగాలని రాజ్యాంగం చెప్పిందని, కానీ పాలకులు తమకు అనుకూలంగా ఉండేలా మార్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని తమకు ఇష్టం వచ్చినట్లు మార్చుతూ హక్కులను హరింపచేస్తున్నారని పేర్కొన్నారు. చట్టసభల్లో చేసిన చట్టాలను సమీక్ష చేసే అధికారం సుప్రీంకోర్టుకు ఉందన్నారు. సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పాలకుల చర్యలతో మీడియా బలహీనంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో రకాల ఒత్తిడితో పాలకులు కట్టడి చేశారని అన్నారు. కొన్ని సందర్భాల్లో పాలకుల ఒత్తిళ్ల వల్ల కొన్ని తీర్పులు వారికి అనుగుణంగా వస్తున్నయనే భావన ప్రజల్లో ఉందని తెలిపారు. పత్రికా రంగాన్ని బెదిరించో కొనుగోలు చేసో తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని, ఇది ప్రజాస్వామ్య మనుగడకు తగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు ప్రసాద్, జాన్‌వెస్లీ, న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

బహిరంగ ప్రకటన

ICICI Bank నమోదిత కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్, చక్లీ సర్కిల్ సమీపాన, ఓల్డ్ పద్రా రోడ్, వడోదర - 390007 కార్పొరేట్ కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి - 400051

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") నుండి వారిచే వినియోగించబడిన బంగారు ఆభరణాలపై ఋణవసతి ("వసతి")గా పొందిన వారి బకాయి మొత్తములను చెల్లించవలసినదిగా దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు నోటీసులు జారీ చేయబడినవి. తమ బకాయిలను తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, తప్పనిసరి పరిస్థితిలో మే 14, 2025న తనఖా చేయబడిన బంగారు ఆభరణములకు మేము ఇ-వేలము నిర్వహించుచున్నాము. ముందస్తు సమాచారం లేకుండా ఖాతాను తొలగించు / ఇ-వేలము తేదీని మార్చు హక్కును ICICI బ్యాంక్ కలిగియున్నది. వేలము ఆన్‌లైన్ ద్వారా మ.12.30 గం. నుండి మ.3.30 గం.ల మధ్య https://gold.samil.inలో నిర్వహించబడును. పవివర నియమ నిబంధనల కొరకు దిగువ ఇచ్చిన వెబ్‌సైటు లాగిన్ అవ్వండి. ఒకవేళ ఋణగ్రహీత మరణించినచో న్యాయవారసులకు అన్ని నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: [illegible]	
279962002211	[illegible]
శాఖ పేరు: [illegible]	
092062016183	పి. [illegible] కుమార్
శాఖ పేరు: [illegible]	
068262009935	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్- ముసారాంబాగ్ రోడ్	
491362000082	వేముల శివ కుమార్
శాఖ పేరు: హైదరాబాద్- రామంతపూర్	
412262000996	విజయ కుమార్ ఎల్లాల
శాఖ పేరు: హైదరాబాద్- ఆర్టీసీ క్రాస్ రోడ్	
194262001867	విజయ్ రాఘవన్ అరి
శాఖ పేరు: హైదరాబాద్- సనత్ నగర్	
236162001568	కొత్తపల్లి ఆకాష్ మహేష్
శాఖ పేరు: హైదరాబాద్- సైనిక్ పురి	
232162001556	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్- విద్యానగర్	
568462000035	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్- బాలాపూర్ క్రాస్ రోడ్	
726962000819	[illegible] సింగ్

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: హైదరాబాద్- బేగంపేట	
018362012821	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్- మాదాపూర్	
004062029611	దుర్గేష్ కుమార్ మండల్
శాఖ పేరు: హైదరాబాద్- శేరిలింగంపల్లి	
131762003282	[illegible] యశ్వంత్ నాయుడు
శాఖ పేరు: హైదరాబాద్- సుచిత్ర క్రాస్ రోడ్స్	
384562002223	[illegible] సతీశ్వర్ రెడ్డి
శాఖ పేరు: ఇబ్రహీంపట్నం	
787462000158	షేక్ మహమ్మద్ రఫీ
787462000163	షేక్ మహమ్మద్ రఫీ
శాఖ పేరు: జనగాం	
070362017676	శివ కుమార్ [illegible]
శాఖ పేరు: [illegible]	
131862002426	చంద్రశేఖర్ రెడ్డి [illegible]
శాఖ పేరు: కూకట్‌పల్లి- నిజాంపేట	
180562003262	సందీప్ నరికొండ
శాఖ పేరు: [illegible]	
069062021694	[illegible]

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: [illegible]	
220062002161	[illegible]
శాఖ పేరు: [illegible]	
223262002209	బండారి ఎల్లస్వామి
శాఖ పేరు: రామచంద్రపురం- మెదక్	
279562002571	పి జగదీష్ పట్నాయక్
279562002573	పి జగదీష్ పట్నాయక్
శాఖ పేరు: సికింద్రాబాద్ సింధి కాలనీ	
333462001032	[illegible]
శాఖ పేరు: [illegible]	
020462006271	షేక్ మహమ్మద్ రఫీ
శాఖ పేరు: వికారాబాద్	
395862003742	[illegible]
395862003786	[illegible]
395862003819	[illegible] మహేష్ రెడ్డి
శాఖ పేరు: వరంగల్	
020162012976	[illegible]
శాఖ పేరు: బెంగళూరు- [illegible]	
233862001288	[illegible] సాయి వినోద్
శాఖ పేరు: [illegible]	
400162002505	[illegible]

తేది: 03.05.2025
ప్రదేశం: హైదరాబాద్, వికారాబాద్, రంగారెడ్డి, హనుమకొండ, జనగాం, మెదక్, పెద్దపల్లి, జగిత్యాల, జోగులాంబ (గద్వాల్), మేడ్చల్- మల్కాజిగిరి, సంగారెడ్డి, వరంగల్

సం/- అధీకృత అధికారి, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

దివ్య ఔషధం... పులిచింతాకు

చాంగేరి శాకమత్యుష్ణం కటురోచన పాచనమ్
కఫ వాతార్శః సంగ్రహణ్యాతిసారజిత్

చాంగేరి (ఇండియన్ సొరెల్)ని తెలుగులో పులిచింత మొక్కలని పిలుస్తారు. 'పులిచెడ్డ, పులిచెట్ట' అని కూడా అంటుంటారు. తెలుగు, తమిళ, కన్నడ ఉష్ణమండల ప్రాంతాల్లో విస్తారంగా పెరుగుతుంది. మూడాకుల పొత్తిగా ఉండే చిన్న పొద ఇది. మౌలికంగా ఇది ఔషధంగా పనికొచ్చే మొక్క. ఆహార పదార్థంగా వాడుకోవటమూ ఉంది.

పుల్లనిరుచి... జాఠరాగ్నివర్ధకం...

పుల్లని ఆకులే దీని ప్రత్యేకత. గోంగూర, చుక్కకూర, చింతచిగురుల్లాగే ఇవి కూడా పుల్లగా ఉంటాయి. ఎండించి దంచిన పొడిని ఆమ్చ్యూర్ లాగా వాడుకునేవారు. ఒకప్పుడు చింతపండు ఇప్పటిలాగా విపరీతంగా వాడేవారు కాదు. చింతపండువల్ల ఉప్పు, కారం కూడా అధికంగా కలపవలసి వస్తుంది. కాబట్టి చింతపండుని పరిమితంగా వాడేవారు. దానికి బదులుగా ఈ పులిచింత ఆకులు బాగా ఉపయోగపడేవి.

భోజన కుతూహలం



పులిచింతలో ఆక్జాలిక్ ఆమ్లం ఎక్కువ శాతంలో ఉంటుంది. అందుకని వేడి చేసే అవకాశం ఉంది. కాబట్టి, పరిమితంగా వాడుకోవాలి. గోంగూరని తిన్నట్టుగా తినకూడదు. పులుపు కోసం వంటకంలో మూడు నాలుగు ఆకులు వేసుకుంటే సరిపోతుంది. ఎక్కువగా తింటే మూత్రంలో వేడి పెరిగి మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే అవకాశం ఉంది.

ఇలాగూ తినవచ్చు...

ఆకుల్ని సన్నగా తరిగి మజ్జిగలో కలుపుకుని తాగితే అమీబియాసిస్ తగ్గుతుంది. నీళ్ల విరేచనాలు ఆగుతాయి. ఇరిటబుల్ బవుల్ సిండ్రోమ్‌తో బాధపడేవారికి ఉపయోగపడుతుంది. ఎండించి దంచిన పొడి అర చెంచా మోతాదులో, తేనెతో రంగరించి రోజూ తింటే కడుపులో నులిపురుగులు పోతాయి. ఈ ఆకులతో టీ కాచుకుని తాగితే జ్వరం తగ్గుతుంది.

- కొబ్బరి పచ్చడిలో పులిచింతాకులు నాలుగు కలిపి నూరితే కమ్మగా ఉంటుంది. చారు, సాంబారు, పులుసు, సూపుల్లో పులుపు కోసం ఈ ఆకుల రసాన్ని కలుపుకుంటే గుణవర్ధకంగా ఉంటుంది. కూరల్లో పప్పుల్లో పులుపు కోసం కొద్దిగా ఈ ఆకుల్ని వాడుకోవచ్చు.

వంటింటి ఔషధం...


చింతపండువల్ల శరీరంలో వాతం, కఫం పెరుగుతాయి. పులిచింత ఆకులు వాత కఫాల్ని నియంత్రిస్తాయి. వాపులు, నొప్పులు తగ్గుతాయి. జీర్ణకోశ వ్యాధుల్లో మేలు చేస్తుంది. విరేచనాలను తగ్గిస్తుంది. అమీబియాసిస్ లాంటి వ్యాధుల్లో ఔషధంగా పని చేస్తుంది. మలబద్ధకం వదిలించి, కాలవిరేచనం అయ్యేలా చేస్తుంది. కడుపులో నులిపురుగుల్ని వెళ్లగొడుతుంది. చింతపండుకు లేని ఈ ప్రయోజనాలు పులిచింతకి ఉన్నాయి కాబట్టి, ఇది వంటగదిలోకి చేరాల్సిన ఔషధం.

ఎన్నో ప్రయోజనాలు...

- ఈ ఆకులు జీర్ణశక్తికి తోడ్పడతాయి. ప్రసవించిన తరువాత బాలింతలకు గర్భాశయం పునరుద్ధరణ కోసం, వాతం తగ్గించటం కోసం ఈ ఆకులతో టీ కాచి ఇస్తే ఫలితం ఉంటుంది.
- సాత్మీకరణం అంటే సరిపడని పదార్థాల్ని తీసుకున్నప్పుడు కలిగే విష దోషాల్ని హరించే గుణం ఈ ఆకులకుంది. ఊపిరితిత్తుల సమస్యల మీద ఈ ఆకుల ప్రయోగం ఉంది. ముఖ్యంగా కఫాన్ని, జ్వరాన్ని, ఊపిరితిత్తుల్లో ఏర్పడే వాపుల్ని తగ్గిస్తుంది.
- జానపదుల వైద్యంలో పాము కాటు వేసిన గాయం మీద ఈ ఆకుల ముద్ద ఉంచి, కట్టు కడతారు. మొలల మీద ఈ ఆకు గుజ్జుని పట్టిస్తే బాధ తగ్గుంది. గాయల మీద లేపనంలా వేస్తే పుండు త్వరగా తగ్గుతుంది. రక్తస్రావం ఆగుతుంది.
- కడుపులో ఉబ్బరం, తిన్నది వంటబట్టకపోవటం, తరచూ విరేచనాలు, జిగురుతో కూడిన విరేచనాల్లాంటి సమస్యల మీద పని చేసేందుకు పులిచింతాకులతో తయారైన 'చాంగేరీ ఘృతం' అనే ఆయుర్వేద ఔషధం బాగా పని చేస్తుంది.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు



మనం సొరకాయతో కూర, పచ్చడి, పప్పు, పులుసు లాంటి ఎన్నో వంటలు చేస్తూ ఉంటాం. ఇవి కాక సొరకాయతో రుచికరమైన అల్పాహారాలు కూడా చేసుకోవచ్చు. అలాంటి రుచులు మీ కోసం...

సొరకాయతో... కమ్మని అల్పాహారం



• ఊతప్పం

కావాల్సిన పదార్థాలు

- సొరకాయ తురుం- రెండు కప్పులు, కేరట్ తురుం- అర కప్పు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, సన్నగా తరిగిన పచ్చి మిర్చి ముక్కలు- రెండు చెంచాలు, ఉడికించిన ఆలుగడ్డలు- రెండు, బియ్యం- ఒక కప్పు, అల్లం ముక్కలు- ఒక చెంచా, మిరియాలు- ఒక చెంచా, పెరుగు- పావు కప్పు, బేకింగ్ పౌడర్ లేదా బేకింగ్ సోడా- అర చెంచా, ఉప్పు- తగినంత, నువ్వులు- ఒక చెంచా, ఇంగువ- పావు చెంచా, జీలకర్ర- అరచెంచా, ఆవాలు- పావు చెంచా, ఎండు మిర్చి- రెండు, నూనె- తగినంత, కరివేపాకు- రెండు రెమ్మలు, కొత్తిమీర తరుగు- అర కప్పు

తయారీ విధానం

- ఒక గిన్నెలో బియ్యాన్ని తీసుకుని శుభ్రంగా కడిగి నిండా నీళ్లు పోసి గంటసేపు నానబెట్టాలి.
- మరో గిన్నెలో సొరకాయ తురుం, కేరట్ తురుం, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, ఒక చెంచా ఉప్పు వేసి బాగా కలిపి పది నిమిషాలు నాననివ్వాలి. తరవాత ఈ మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా చేతిలోకి తీసుకుంటూ మరో గిన్నెలోకి రసాన్ని గట్టిగా పిండాలి.
- మిక్సీలో ఉడికించిన ఆలుగడ్డల ముక్కలు, నానబెట్టిన బియ్యం, అల్లం ముక్కలు, మిరియాలు, సొరకాయ విశ్రమం నుంచి పిండిన రసం వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. పిండి గరిటె జారుగా ఉండాలి. అవసరమనిపిస్తే అర గ్లాసు నీళ్లు కలుపుకోవచ్చు. ఈ పిండిని వెడల్పాటి గిన్నెలోకి తీసుకుని బేకింగ్ సోడా లేదా బేకింగ్ పౌడర్ వేసి కలపాలి. అయిదు నిమిషాలు నాననివ్వాలి.
- స్టవ్ మీద చిన్న గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. తరవాత ఆవాలు, జీలకర్ర, ఇంగువ, ఎండు మిర్చి ముక్కలు, కరివేపాకు వేసి దోరగా వేపాలి. ఈ తాలింపును పిండిలో వేసి కలపాలి. తరవాత పిండిలో సొరకాయ-కేరట్ తురుముల మిశ్రమం, నువ్వులు, పెరుగు, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి.
- స్టవ్ మీద పెనం పెట్టి వేడి చేసి ఒక చెంచా నూనె రాయాలి. ఒక గరిటెడు పిండిని పెనం మధ్యలో వేయాలి. చుట్టూరా కొద్దిగా నూనె చిలకరించి మూతపెట్టి రెండు నిమిషాలు ఉంచాలి. తరవాత మూత తీసి ఊతప్పాన్ని రెండోవైపునకు తిప్పాలి. రెండు నిమిషాల తరవాత పళ్లెంలోకి తీయాలి. ఈ ఊతప్పాన్ని పెరుగు చట్నీతో తింటే రుచిగా ఉంటుంది.

జాగ్రత్తలు

- లేత సొరకాయ తురుం తీసుకుంటే ఊతప్పం రుచిగా ఉంటుంది
- పిండిని పెనం మీద వేసిన తరవాత దాన్ని గరిటెతో పరచకూడదు.
- చిన్న మంట మీదనే ఊతప్పాన్ని రెండు వైపాలా ఉడకనివ్వాలి.



• గారెలు

కావాల్సిన పదార్థాలు

- పెసరపప్పు- రెండు కప్పులు, సొరకాయ తురుం- ఒక కప్పు, బియ్యప్పిండి- అర కప్పు, అల్లం తురుం- మూడు చెంచాలు, పుదీనా తరుగు- ఒక చెంచా, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు, కరివేపాకు- ఒక రెమ్మ, పచ్చిమిర్చి- నాలుగు, జీలకర్ర- ఒక చెంచా, ఉల్లిపాయ- ఒకటి, ఉప్పు- తగినంత, నూనె- గారెలు వేగడానికి సరిపోయేంత

జాగ్రత్తలు

- సొరకాయలో నీరు ఉంటుంది కాబట్టి పిండి జారుగా కావచ్చు. అప్పుడు పిండిలో కొద్దిగా బొంబాయి రవ్వ కలిపితే గారెలు కరకరలాడుతూ వస్తాయి. నూనె పీల్చుకోవు.
- పిండిలో కొద్దిగా పాలకూర తరుగు కలిపితే గారెల రుచి పెరుగుతుంది.

తయారీ విధానం

- పెసరపప్పును ఒక గంటసేపు నీళ్లలో నానబెట్టాలి. సొరకాయ తురుమును చేత్తో తీసుకుని గిన్నెలోకి గట్టిగా రసాన్ని పిండాలి. మిక్సీలో నానబెట్టిన పెసరపప్పు, సొరకాయ రసం, పచ్చిమిర్చి ముక్కలు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పిండిని వెడల్పాటి గిన్నెలోకి తీసుకోవాలి. ఇందులో జీలకర్ర, కరివేపాకు తరుగు, పుదీనా తరుగు, కొత్తిమీర తరుగు, అల్లం తురుం, బియ్యప్పిండి, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. పిండి గట్టిగానే ఉండాలి.
- స్టవ్ మీద మూకుడు పెట్టి సగానికి పైగా నూనె పోసి వేడి చేయాలి. కొద్దిగా పిండిని తీసుకుని వేళ్ల మీద గారెలా చేసి మధ్యలో బొటనవేలితో రంధ్రం చేసి నూనెలోకి మెల్లగా జారవిడచాలి. ఇలా మొత్తం పిండితో గారెలు చేసి నూనెలో వేయించాలి. గారెలను రెండు వైపులా ఎర్రగా వేపి పళ్లెంలోకి తీయాలి. వీటిని వేడిగా తింటే కరకరలాడుతూ రుచిగా ఉంటాయి.
- ఈ పిండితో చిన్న పునుగులు, పకోడీలు, చెక్కలు కూడా చేసుకోవచ్చు. ఈ పిండిని మిక్సీలో వేసి, తగినన్ని నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేసి దానితో దోశలు వేసుకోవచ్చు.

• పరాఠా

కావాల్సిన పదార్థాలు


- సొరకాయ తురుం- రెండు కప్పులు, పచ్చి మిర్చి- నాలుగు, వెల్లుల్లి రెబ్బలు- ఏడు, చిన్న అల్లం ముక్కలు- రెండు, నువ్వులు- ఒక చెంచా, జీలకర్ర- ఒక చెంచా, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, జొన్న పిండి- ఒక కప్పు, బియ్యప్పిండి- అర కప్పు, గోధుమ పిండి- అర కప్పు, శనగపిండి- పావు కప్పు, నెయ్యి- తగినంత

జాగ్రత్తలు

- సొరకాయ పరాఠాని రెండు కప్పుల బియ్యప్పిండి లేదా జొన్న పిండి లేదా గోధుమ పిండితో కూడా తయారు చేసుకోవచ్చు. కానీ అన్నిరకాల పిండ్లు కలిపితేనే దాని రుచి అమోఘంగా ఉంటుంది.
- పరాఠాలు అదిమిన క్లాత్‌ను మధ్య మధ్యలో తడుపుతూ దానికి అంటిన పిండిని తొలగించాలి. లేని పక్షంలో పరాఠాలు క్లాత్‌కి అంటుకుపోతాయి.
- పరాఠాని మరీ సన్నగా లేదా మరీ లావుగా అదమకూడదు
- నెయ్యికి బదులు నూనె వాడుకోవచ్చు.

తయారీ విధానం

- మిక్సీలో పచ్చి మిర్చి ముక్కలు, అల్లం, వెల్లులి రెబ్బలు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.
- ఒక వెడల్పాటి గిన్నె తీసుకుని అందులో సొరకాయ తురుం, పచ్చిమిర్చి-అల్లం పేస్టు, నువ్వులు, జీలకర్ర, కొత్తిమీర తరుగు, ఉప్పు వేసి బాగా కలపాలి. తరవాత జొన్న పిండి, గోధుమ పిండి, బియ్యప్పిండి, శనగపిండి వేసి ముద్దలా కలపాలి. అవసరమనిపిస్తే ఒక చెంచా నీళ్లు చిలకరించి కలపాలి. ఈ ముద్ద మీద మూత పెట్టి పావు గంటసేపు నానబెట్టాలి.
- చేతి రుమాలు లేదా కాటన్ క్లాత్‌ను తడిపి నీళ్ల పిండి సిద్ధం చేసుకోవాలి. చేతిని నీళ్లతో తడుపుకుని కొద్దిగా పిండిని తీసుకుని గుండ్రని ముద్దలా చేసి తడి క్లాత్ మీద పెట్టి చేతితో పరాఠాలా అదమాలి.
- స్టవ్ మీద పెనం పెట్టి వేడిచేయాలి. ఒక చెంచా నెయ్యి రాయాలి. వేడెక్కిన పెనం మీద పరాఠా వేసి పై నుంచి క్లాత్‌ని తీయాలి. మూతపెట్టి రెండు నిమిషాలు ఉంచాలి. తరవాత పరాఠా మీద ఒక చెంచా నెయ్యి రాసి రెండో వైపునకు తిప్పి రెండు నిమిషాలు ఉంచాలి. రెండు వైపులా ఎర్రగా కాలిన తరవాత పళ్లెంలోకి తీసుకోవాలి. ఈ పరాఠాని వేడిగా తిన్నా చల్లారాక తిన్నా రుచిగానే ఉంటుంది.



- సొరకాయలో ఎ, బి, సి విటమిన్లతోపాటు పొటాషియం, ఐరన్ లాంటి మినరల్స్ అధికంగా ఉంటాయి. ఇది పూర్తిగా నీటితో నిండి ఉంటుంది కాబట్టి వేసవిలో ఏర్పడే నిర్జలీకరణ సమస్యలను నివారిస్తుంది. సొరకాయను తరచూ తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. గుండె, కాలేయం, మెదడు ఆరోగ్యంగా పనిచేస్తాయి. ఒత్తిడి, అలసట, నీరసం తగ్గుతాయి. దీనిలోని పీచు పదార్థాలు జీర్ణక్రియను మెరుగుపరచి మలబద్ధకాన్ని, ఊబకాయాన్ని నివారిస్తాయి. సొరకాయలోని పోషకాలు చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. దీంతో చర్మం బిగుతుగా కాంతివంతంగా ఉంటుంది.

న్యూస్ మేకర్

నిలదీసే 'ప్రజ్ఞ'

బ్యాంకు ఖాతా తెరిచే సందర్భంలో కనురెప్పలు ఆర్పలేక ఇబ్బందిపడిన ప్రజ్ఞ ప్రసూన్... తనలాంటి ముఖ వైకల్యం కలిగి ఉన్నవారికి కేవైసీ నిబంధనలను సవరించాలంటూ దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి... విజయం సాధించింది. యాసిడ్ బాధితురాలైన ఆమె... 'ఐ వోంట్ బ్లింక్' పేరుతో ఉద్యమాన్ని లేవనెత్తి... సుదీర్ఘ న్యాయ పోరాటం సాగించింది. ఆ పోరాటం వెనుక వ్యధాభరిత కథ ఇది.



జూలై, 2023లో యాసిడ్ దాడి బాధితురాలైన ప్రజ్ఞ ప్రసూన్ ఖాతా తెరవడం కోసం ఐసిఐసిఐ బ్యాంకుకి వెళ్లింది. కానీ 'లైవ్ ఫొటోగ్రాఫ్' కోసం కనురెప్పలు ఆర్పలేని కారణంగా డిజిటల్ కెవైసి ప్రక్రియ పూర్తి చేయలేకపోవడంతో ఆమె బ్యాంకులో ఖాతా తెరవలేకపోయింది. ఈ చేదు అనుభవంతో మనస్తాపం చెందిన ప్రజ్ఞ, సామాజిక మాధ్యమాల్లో 'ఐ వోంట్ బ్లింక్' అనే పేరుతో, ఉద్యమాన్ని లేవనెత్తింది. ఆ తర్వాత బ్యాంకు ఉద్యోగి, ప్రజ్ఞను సంప్రతించి, డిజిటల్ కెవైసి నుంచి మినహాయింపు ఇచ్చి, బ్యాంకు ఖాతా తెరవడంలో సహాయపడ్డారు. కానీ ప్రజ్ఞ అంతటితో సరిపెట్టుకోలేకపోయింది. తనలాంటి ముఖ వైకల్యం కలిగిన ఇతరులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు సంబంధించి న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని నిర్ణయించుకుంది. బ్యాంకు ఖాతా మొదలు, సిమ్ కార్డు కొనుగోలు వరకూ వేర్వేరు సందర్భాల్లో డిజిటల్ కెవైసి పొందడం తప్పనిసరి. కళ్లకు సంబంధించిన సమస్యలున్నవారు, అగ్ని ప్రమాదాలు, యాసిడ్ దాడులతో ముఖ వైకల్యం వల్ల కనురెప్పలను ఆర్పలేని వారి పట్ల కెవైసి నిబంధనలను సవరించాలని కోరుతూ ప్రజ్ఞ వేసిన పిటిషన్‌కు సానుకూలంగా స్పందించిన సుప్రీమ్‌కోర్టు... డిజిటల్ కెవైసి ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. అనీ, అర్హులైన వారికి ఆ ప్రక్రియను సులభతరం చేయాలనీ, అన్ని ప్రభుత్వ పోర్టల్స్, లెర్నింగ్ ప్లాట్‌ఫామ్స్, ఆర్థిక సాంకేతిక సేవలన్నీ అందరికీ అందుబాటులో ఉంచాలనీ తాజాగా సంచలనాత్మక తీర్పునిచ్చింది.



ఎవరీ ప్రజ్ఞ..?

జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో పుట్టిన ప్రజ్ఞ ప్రసూన్ సింగ్, ఫ్యాషన్ డిజైనర్. ఏప్రిల్ 15, 2006న ప్రజ్ఞ పెళ్లైంది. అదే నెల 30న ఆమె ఢిల్లీలో ప్రాంగణ నియామకానికి హాజరు కావాల్సి ఉంది. దాంతో పెళ్లైన 15 రోజులకే, బనారస్ నుంచి ఢిల్లీ రైలు ప్రయాణానికి సిద్ధపడిందామె. అది రాత్రి ప్రయాణం. అర్ధరాత్రి దాటిన తర్వాత, గాఢ నిద్రలో ఉన్న ప్రజ్ఞ ముఖం మీద ఒక యువకుడు యాసిడ్‌ను కుమ్మరించాడు. అతనెవరో కాదు. గతంలో ప్రజ్ఞ పెళ్లి ప్రతిపాదనను తిరస్కరించిన యువకుడే! తన ప్రతిపాదనను తిరస్కరించడంతో పగ పెంచుకున్న సదరు యువకుడు, ప్రజ్ఞ మీద ఆ ఘాతకానికి తెగబడ్డాడు. అలా ఊహించని పరిణామాన్ని ఎదుర్కొన్న ప్రజ్ఞ, తనకేం జరుగుతుందో అర్థం చేసుకునేలోపే జరగవలసిందంతా జరిగిపోయింది. తోటి ప్రయాణికుల సహాయంతో ఆస్పత్రికి చేరిన ఆమె ప్రాణాలు నిలిచినా, ముఖం గుర్తుపట్టలేనంతగా కాలిపోయింది. ఆ ప్రమాదంలో ఆమె ఒక కన్నును కోల్పోయింది. వైద్యులు శ్రమించి ఒక కంటిని కాపాడగలిగారు. రెండేళ్ల పాటు వరుస సర్జరీల తర్వాత ప్రజ్ఞ పూర్తిగా కోలుకుంది. యాసిడ్ దాడితో జీవితం ఎంతలా తలకిందులైపోతుందో స్వీయానుభవంతో తెలుసుకున్న ప్రజ్ఞ తనలా యాసిడ్ దాడికి గురైన వారికి తోడ్పాటును అందించాలని నిర్ణయించుకుంది. అలాంటి వారికి ఆర్థికంగా అండగా నిలవడం కోసం ఆమె 2013లో 'అతిజీవన్ ఫౌండేషన్'ను స్థాపించింది. యాసిడ్ దాడి బాధితులకు ఉచిత సర్జరీలు చేయడంతో పాటు, వృత్తి విద్యల్లో శిక్షణ అందించి, పునరావాసం కల్పించడం అతిజీవన్ స్వచ్ఛంద సంస్థ లక్ష్యం. ఇప్పటివరకూ ప్రజ్ఞ అతిజీవన్ ఫౌండేషన్ ద్వారా 250మంది యాసిడ్ బాధితులకు సహాయం అందించింది.

చికిత్స పొందుతున్న సమయంలో ఆస్పత్రిలో నాలాంటి వారిని కలిశాను. వారిలో కొందరికి ఎవరి తోడూ, ధైర్యం చెప్పేవాళ్లూ లేరనే విషయాన్ని గ్రహించాను. వారికి భరోసా కల్పించడం కోసం 'అతిజీవన్ ఫౌండేషన్'ను స్థాపించాను.

నారీ పురస్కారం

ప్రజ్ఞ, తన స్వీయానుభవం గురించి వివరిస్తూ... "చికిత్స పొందుతున్న సమయంలో ఆస్పత్రిలో నాలాంటి కొందర్ని కలిశాను. వారిలో కొందరికి ఎవరి తోడూ లేదనీ, దిశానిర్దేశం చేసేవాళ్లు, ధైర్యం చెప్పేవాళ్లూ లేరనే విషయాన్ని గ్రహించాను. వాళ్లతో మాట్లాడి వివరాలు తెలుసుకుని, వారికి భరోసా కల్పించడం కోసం అతి జీవన్ ఫౌండేషన్‌ను స్థాపించాను. ఈ సంస్థ ద్వారా యాసిడ్ దాడి బాధితులకు స్కిన్ గ్రాఫ్టింగ్, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సేవలను అందించి, ముఖాకృతిని సరి చేసి, ఆత్మవిశ్వాసాన్ని పెంచడం అతిజీవన్ లక్ష్యం. సాధికారత కల్పించడంవల్ల బాధితులందరూ స్వాభిమానంతో జీవించగలుగుతున్నారు. సమాజం, యాసిడ్ దాడికి గురైనవారిని బాధితులుగా పరిగణించకూడదు. వారిని ధీశాలులుగా భావించాలి" అంటూ చెప్పుకొచ్చింది ప్రజ్ఞ. ప్రజ్ఞ కృషికి ప్రభుత్వ గుర్తింపు దక్కింది. 2019లో భారత ప్రభుత్వం ఆమెను నారీ శక్తి పురస్కారంతో సత్కరించింది.

మేకప్

వేడుకల్లో వెలిగేలా...

పెళ్లిళ్ల సీజన్‌లోకి అడుగు పెట్టేశాం! మరి వేడుకల్లో వెలిగిపోవాలంటే అందుకోసం వేసుకునే మేకప్ కూడా వినూత్నంగా ఉండాలి. అదెలాగో తెలుసుకుందాం!

సన్‌స్క్రీన్ అవసరమే

మేకప్ ముందు మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్‌లను తప్పనిసరిగా పూసుకోవాలి. వీటితో వేడుకల్లో లైట్ల వెలుగుకు చర్మం పాడవకుండా ఉంటుంది. మేకప్ కూడా ఎక్కువ సమయం పాటు తాజాగా ఉంటుంది.

రెండు ఫౌండేషన్లు

కెమెరా ఫ్లాష్ వెలుగుకు ముఖం విపతిమీరి వెలిగిపోకుండా ఉండాలంటే, రెండు భిన్నమైన ఫౌండేషన్లు వేసుకోవాలి. ఇందుకోసం మ్యాట్, సాఫ్ట్ గ్లోయీ రకాలకు చెందిన ఫౌండేషన్లను కలిపి వేసుకోవాలి. జిడ్డు చర్మమైతే, నుదురు, ముక్కు, చుబుకం మీద మ్యాట్ ఫౌండేషన్, మిగతా ముఖమంతా డ్యూయీ ఫౌండేషన్ వేసుకోవాలి. తర్వాత లూజ్ పౌడర్ అద్దుకోవాలి.

బ్లష్ ముఖ్యం

పగటి వేళ వేడుకలకు హాజరయ్యేటప్పుడు ముదురు రంగు బ్లష్‌లకు బదులుగా.. సహజసిద్ధంగా కనిపించే న్యాచురల్ లేదా రోజీ బ్లష్ ఎంచుకోవాలి. బుగ్గలతో పాటు, కొద్దిగా ముక్కు, చుబుకం మీద కూడా లైట్‌గా బ్లష్‌ను అద్దుకోవాలి.

ఐ షాడో ఇలా...

ముఖం మొత్తంలో కళ్లూ, పెదవులే ఫోకల్ పాయింట్లు. కాబట్టి వాటి మీద ప్రత్యేక దృష్టి పెట్టాలి. పగలైనా, రాత్రైనా ముదురు రంగు షాడోలకు దూరంగా ఉండాలి. పేస్టెల్, సాఫ్ట్ మెటాలిక్ ఐ షాడోలు ఎంచుకోవాలి. ముడతలు పడకుండా ఉండేందుకు క్రీమీ షాడోలకు బదులు పౌడర్ ఐ షాడో ఎంచుకోవాలి. పౌడర్ ఐ షాడోలు మేకప్‌లో చక్కగా కలిసిపోయి, ఎక్కువసేపు ఉంటాయి.



లప్లీ లిప్‌స్టిక్

ఎరుపు, ప్లమ్, మెరూన్ రంగు లిప్‌స్టిక్స్ వేడుకలకు బాగుంటాయి. అలాగే ఐ షాడోకు మ్యాచ్‌అయ్యే లిప్‌స్టిక్ ఎంచుకోవాలి. గ్లిట్టర్, పేస్టెల్, మోనోటోన్ రంగు లిప్‌స్టిక్స్ పగటిపూట, మెటాలిక్, ముదురు రంగు షేడ్స్ రాత్రి వేడుకలకు మ్యాచ్ అవుతాయి.

విశాఖలో స్టూడియో భూముల వ్యవహారంపై..
సురేశ్ ప్రొడక్షన్స్‌కు సుప్రీంలో చుక్కెదురు

- ఏపీ ప్రభుత్వ షోకాజ్ నోటీసుపై జోక్యానికి నిరాకరణ
- మధ్యంతర ఉపశమనమూ ఇవ్వలేమని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ సురేశ్ ప్రొడక్షన్స్‌కు.. విశాఖ(ఏపీ)లోని రామానాయుడు స్టూడియో భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఆ భూములకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసుపై కలుగజేసుకోవాలని కోరుతూ సురేశ్ ప్రొడక్షన్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. మధ్యంతర ఉపశమనం కల్పించాలని కోరగా, అది కూడా కుదరదని స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ఉమ్మడి ఏపీలో అప్పటి టీడీపీ ప్రభుత్వం 2003 సెప్టెంబరులో విశాఖపట్నం బీచ్ రోడ్డులో రామానాయుడు స్టూడియోకు 34.44 ఎకరాలను కేటాయించగా.. అందులో 10 ఎకరాల్లో మాత్రమే స్టూడియో నిర్మాణాలు జరిగాయి. మిగతా భూమిలో 15.17 ఎకరాల్లో లే-అవుట్‌కు అనుమతి కోసం జీవీఎంసీకి దరఖాస్తు చేశారు. 2023 ఏప్రిల్‌లో ఇందుకు అనుమతి లభించింది. అయితే.. లే అవుట్ల పేరుతో అక్కడ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు 2024 జనవరి 3న సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఆ భూముల్ని స్టూడియో కోసమే వాడాలని పేర్కొంటూ స్థిరాస్తి వ్యాపారం చేయడంపై కోర్టు 2024 ఫిబ్రవరి 9న స్టే ఇచ్చింది. తాజాగా కూటమి ప్రభుత్వం.. 15.17 ఎకరాల భూమిని ఎందుకు వెనక్కి తీసుకోకూడదో తెలియజేయాలని కోరుతూ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ నోటీసును సురేశ్ ప్రొడక్షన్స్ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. అయితే.. షోకాజ్ నోటీసుపై కలగజేసుకోవడానికి ధర్మాసనం నిరాకరించింది. నోటీసు ఎక్కడ జారీ అయ్యిందో, అక్కడే తేల్చుకోవాలని సూచించింది. ఈ నేపథ్యంలో తమ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని సురేశ్ ప్రొడక్షన్స్ కోరగా, అందుకు ధర్మాసనం అనుమతి ఇచ్చింది.

రేవంత్‌రెడ్డి కేసుపై నివేదిక ఇవ్వండి: హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ట్రయల్ కోర్టులో ఏ దశలో ఉందనే విషయమై స్థాయీ నివేదిక దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. 2019లో నమోదైన కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టులో ఇప్పటికీ అభియోగాలు నమోదు కాలేదని తెలిపింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లి గ్రామం సర్వే నంబర్ 127లోని 31.5 ఎకరాలపై ఫిర్యాదుదారు పెద్దిరాజుకు, ఎనుముల రేవంత్‌రెడ్డి సోదరుల మధ్య వివాదం ఉంది. తమ సొసైటీకి చెందిన గదిని కూల్చివేశారని, తనను కులంపేరుతో దూషించారని పెద్దిరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కొండల్‌రెడ్డి, లక్ష్మయ్య, రేవంత్‌రెడ్డిలపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ 2020లో రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మౌషమీ భట్టాచార్య ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. విచారణ స్థితిని తెలియజేయాలని ట్రయల్ కోర్టును ఆదేశిస్తూ విచారణ జూన్ 13కు వాయిదా వేసింది.

గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో..
వంశీ బెయిల్ పిటిషన్ కొట్టివేత

అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత వల్లభనేని వంశీకి హైకోర్టు షాక్ ఇచ్చింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై మూకదాడి, కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్‌ను కులం పేరుతో దూషించారనే ఆరోపణలతో నమోదైన కేసులో ఆయన వేసిన బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వంశీకి బెయిల్ ఇచ్చేందుకు ట్రయల్ కోర్టు నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల తుది విచారణ జరిపిన న్యాయమూర్తి.. బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ శుక్రవారం నిర్ణయాన్ని వెల్లడించారు. 'కోర్టు ముందు ఉన్న వివరాలను పరిశీలిస్తే వంశీ అనుచరులు ఫిర్యాదుదారు సత్యవర్ధన్‌ను బెదిరించి, బలవంతంగా కోర్టుకు తీసుకెళ్లి కేసును ఉపసంహరించుకునేలా వాంగ్మూలం ఇప్పించినట్లు అర్థమవుతోంది. ఘటనలో పిటిషనర్ పాత్రపై ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి.' అని న్యాయమూర్తి పేర్కొన్నారు.

పాలకు పాలు, నీళ్లకు నీళ్లు.. వేరుచేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో తప్పులు జరిగాయంటూ దాఖలైన పలు పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం శుక్రవారం విచారణ కొనసాగించింది.

గ్రూప్-1 అంశంలో వ్యవస్థీకృతంగా తప్పు జరిగింది

తొలుత పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది రచనారెడ్డి వాదనలు వినిపించారు. "నోటిఫికేషన్‌లో పేర్కొనకుండానే మెయిన్స్ పరీక్షలకు కొత్తగా హాల్‌టికెట్లు జారీచేశారు. పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్న టీజీపీఎస్సీ.. మెయిన్స్ పరీక్షలు ఎంతమంది రాశారనే కచ్చితమైన సంఖ్యను ఇప్పటికీ చెప్పడం లేదు. బయోమెట్రిక్ తీసుకున్నప్పుడు అరగంటలో మొత్తం ఎంతమంది హాజరయ్యారో చెప్పేయొచ్చు. అలాంటిది మొదటిసారి చెప్పిన సంఖ్యకు, రెండోసారి చెప్పిన సంఖ్యకు వ్యత్యాసం ఎందుకుంది? ఎక్కువగా వచ్చినవారు ఎవరు? సీనియర్ ఫ్యాకల్టీతో మూడోసారి మూల్యాంకనం చేయించినట్లు చెబుతున్నారు. బార్‌కోడ్, ఆప్టికల్ మెషీన్ లేకుండా మూడో మూల్యాంకనం చేస్తే ఏం లాభం? అక్కడ అక్రమాలకు చాలా ఆస్కారం ఉంటుంది. కొన్ని సెంటర్ల నుంచి 10 నుంచి 12 శాతం మంది ఎంపికయ్యారు. అసలు పేపర్లు దిద్దే వారి మాధ్యమం ఏమిటి? తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషలకు సంబంధించి ఎంతమంది ఎవాల్యుయేటర్లు (మూల్యాంకనం చేసేవారు) ఉన్నారన్న వివరాలు లేవు. ఒక ప్రభుత్వ అధ్యాపకుడు ప్రైవేటు కోచింగ్ సెంటర్‌కు అనుబంధంగా ఉన్నారు. ఆయనతో పేపర్లు దిద్దించడం వల్ల పారదర్శకత ఎక్కడ ఉంటుంది? పేపర్లు దిద్దే అధ్యాపకుల పేర్లు బయట పెట్టడం మా ఉద్దేశం కాదు. మూల్యాంకనదారుల ఎంపికలో లోపాలు ఉన్నాయి. మొత్తం వ్యవస్థీకృతంగా తప్పు జరిగింది. తప్పు జరిగిందని చెప్తే.. దొంగ పత్రాలు, కేసులు పెడతాం అంటూ బెదిరిస్తున్నారు. టీజీపీఎస్సీ రాజ్యాంగ బద్ధ సంస్థ అని చెబుతున్నారు.. మరి గతంలో పేపర్ లీకేజీలు ఎందుకు జరిగాయి? పారదర్శకతను నిరూపించుకోవాల్సిన బాధ్యత టీజీపీఎస్సీపై ఉంది. ఓ అభ్యర్థికి రీకౌంటింగ్‌లో 60 మార్కులు తగ్గాయి. ఆ అభ్యర్థిని ప్రతివాదిగా చేర్చాం?" అని వివరించారు.

నకిలీ డాక్యుమెంట్లు.. కుట్రపూరిత దాడి..

టీజీపీఎస్సీ తరఫున న్యాయవాది పీఎస్ రాజశేఖర్ వాదించారు. "పిటిషనర్లలో దాదాపు అందరూ ప్రభుత్వ ఉద్యోగులు. వారు నిరుద్యోగులని చెప్పడానికి వీల్లేదు. రీకౌంటింగ్‌లో 60 మార్కులు తగ్గాయని చెబుతున్న పూజితారెడ్డి అనే అభ్యర్థి పిటిషనర్లలో లేరు. ఆమెకు సంబంధించినదిగా చెబుతూ నకిలీ మార్కుల డాక్యుమెంట్‌ను పిటిషనర్లు సమర్పించారు. ఇలాంటప్పుడు ఆర్టికల్ 226 కింద దఖలుపడిన విచక్షణాధికాన్ని హైకోర్టు ఉపయోగించకూడదు. గ్రూప్-1పై ఇదే తరహాలో దాఖలైన మరో పిటిషన్‌లో నకిలీ డాక్యుమెంట్ పెట్టారంటూ మరో ఏకసభ్య ధర్మాసనం జరిమానా వేసి, విచారణకు ఆదేశించింది. ఆ పిటిషన్ కొట్టివేసింది. ఆ పిటిషన్‌లోని ఓ అభ్యర్థి తాను ఎవరికీ కేసు ఇవ్వలేదని, వకాలత్‌పై సంతకం కూడా చేయలేదని, తనపై విచారణ చేపట్టవద్దని రిజిస్ట్రార్‌కు లేఖ కూడా రాశారు. అదే తరహాలో ఇక్కడ కూడా నకిలీ డాక్యుమెంట్ పెట్టారు. దీనిపై నిజనిర్ధారణ జరిగే వరకు కేసు మెరిట్స్‌లోకి కూడా వెళ్లకూడదు.." అని పేర్కొన్నారు. గ్రూప్-1 పరీక్షలపై కొందరు పనిగట్టుకొని చేస్తున్న కుట్రపూరితమైన దాడి ఇదని చెప్పారు. ధర్మాసనం అడిగిన అన్ని ఆధారాలు సమర్పించడానికి సిద్ధంగా ఉన్నామని.. వేసవి సెలవులకు ముందే ఈ వ్యవహారాన్ని తేల్చాలని డివిజన్ బెంచ్ పేర్కొన్నదని గుర్తు చేశారు.

సుదీర్ఘ విచారణ అనంతరం వాయిదా..

కోర్టు సమయం దాటిన తర్వాత కూడా దాదాపు రెండు గంటల పాటు జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు వాదనలు విన్నారు. ఇంకా వాదనలు వినిపించాల్సిన సీనియర్ న్యాయవాదులు ఉండటం, టీజీపీఎస్సీ సమాధానం ఇవ్వాల్సి ఉందని గుర్తు చేశారు. టీజీపీఎస్సీ దాఖలు చేసిన వెకేట్ స్టే పిటిషన్‌పై తీర్పు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. మార్కులు తగ్గాయని పేర్కొంటున్న అభ్యర్థి పూజితారెడ్డి సమాధాన పత్రాలు, టీజీపీఎస్సీ లాగ్ హిస్టరీ, ఇతర వివరాలను సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఆదేశించారు. నకిలీ పత్రాలు, మార్కుల మెమోలు సమర్పించినట్లు తేలితే పిటిషనర్లపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. వివరణ ఇవ్వాలంటూ పూజితారెడ్డికి కూడా నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను జూన్ 11కు వాయిదా వేశారు. నియామకపత్రాలు ఇవ్వరాదన్న మధ్యంతర ఉత్తర్వులను అప్పటివరకు పొడిగించారు.

నాపై విచారణ ఉపసంహరించండి
హైకోర్టు రిజిస్ట్రార్‌కు జరిమానా పడిన అభ్యర్థి షబ్నం ఆర్యా లేఖ

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించి హైకోర్టుకు తప్పుడు మార్కుల మెమో సమర్పించిన వ్యవహారంలో తనపై విచారణను ఉపసంహరించాలని గ్రూప్-1 అభ్యర్థి, సంగారెడ్డి జిల్లా లింగంపల్లి పంచాయతీ సెక్రెటరీ షబ్నం ఆర్యా హైకోర్టు రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. "నేను గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు రాశాను. పరీక్షలు పారదర్శకంగా జరగలేదంటూ కొందరు వాట్సాప్ గ్రూప్ సృష్టించి నన్ను జత చేశారు. ఆర్థికంగా మద్దతు కావాలని అడిగితే రూ.5 వేలు బదిలీ చేశాను. కానీ 18వ పిటిషనర్‌గా నా పేరుంది. నేను ఎవరికీ కేసు ఇవ్వలేదు. వకాలత్‌పై సంతకం పెట్టలేదు. విచారణ నుంచి నాపేరు తొలగించాలి" అని కోరారు.

క్వాంటమ్ వ్యాలీ..
అమరావతి

- దేశంలోనే తొలి టెక్ పార్క్ ఏర్పాటుకు కీలక ముందడుగు
- ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి అధునాతన టెక్నాలజీ కేంద్రంగా మారుతోంది. దేశంలోనే అత్యంత పెద్దదైన, అత్యాధునిక క్వాంటమ్ కంప్యూటర్ ఇక్కడి క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్‌లో ఏర్పాటు కానుంది. ఈ మేరకు శుక్రవారం ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో ఆయన సమక్షంలో టెక్ దిగ్గజాలు ఐబీఎం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఎల్ అండ్ టీకు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య అవగాహనా ఒప్పందం జరిగింది. దీంతో వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీన దేశంలోనే తొలి టెక్ పార్క్‌ను ప్రారంభించనున్నారు. టెక్ దిగ్గజాలతో ఒప్పందం మేరకు ఆ టెక్ పార్క్‌లో అత్యాధునిక 156 క్యూబిట్ హెరాన్ క్వాంటమ్ ప్రాసెసర్ కలిగిన అతిపెద్ద ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్ 2 జాతీయ స్థాయిలో తొలిసారిగా ఇక్కడ ఏర్పాటవుతుంది. దీనికి టీసీఎస్ సహకారం అందిస్తుంది. ఐబీఎం క్వాంటమ్ వైస్ ప్రెసిడెంట్ జే గాంబెట్టా, టీసీఎస్ సీటీవో హారిక్ విన్, టీసీఎల్ ప్రతినిధులు వి.రాజన్న, సీవీ శ్రీధర్ తదితరుల సమక్షంలో క్వాంటమ్ వ్యాలీ స్థాపన, పరిశోధనా కేంద్రం ఏర్పాటుపై సీఎం సమీక్షించారు. ఎంఓయూపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఐటీశాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సంతకం చేశారు. క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు ఒప్పందం చేసుకోవడం చరిత్రాత్మకం అని సీఎం చంద్రబాబు అన్నారు. దేశంలోనే టెక్నాలజీ రంగంలో ముందువరుసలో ఏపీ నిలుస్తుందన్నారు. జనవరి ఒకటో తేదీన క్వాంటమ్ వ్యాలీ ప్రారంభంతో ఏపీలో కొత్త శకం మొదలవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజధాని నగరం అమరావతి పునఃప్రారంభ రోజునే రాష్ట్ర ప్రగతికి దోహదపడే అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

ప్రభుత్వానిది గోబెల్స్ ప్రచారం

- వందేళ్ల దూరదృష్టితో కేసీఆర్ కాళేశ్వరం నిర్మించారు
- సాగునీటి రంగంలో తెలంగాణ పదేండ్ల ప్రస్థానం, కాళేశ్వరం ప్రాజెక్టు -విమర్శలు -వక్రీకరణలు-వివరణలు.. పుస్తకాల ఆవిష్కరణలో హరీశ్‌రావు



పుస్తకాల ఆవిష్కరణలో హరీశ్‌రావు, రచయిత శ్రీధర్ దేశ్‌పాండే తదితరులు

రవీంద్రభారతి, మే 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం గోబెల్స్ ప్రచారం చేస్తోందని, వందేళ్ల దూరదృష్టితో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ పేరు చరిత్రలో ఉండకూడదనే విధంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో శ్రీధర్ దేశ్‌పాండే రచించిన 'సాగునీటి రంగంలో తెలంగాణ పదేండ్ల ప్రస్థానం', 'కాళేశ్వరం ప్రాజెక్టు-విమర్శలు-వక్రీకరణలు-వివరణలు' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్‌రావు పుస్తకాలను ఆవిష్కరించి మాట్లాడారు. కీలకమైన సమయంలో శ్రీధర్ దేశ్‌పాండే అద్భుతమైన పుస్తకాల్ని తీసుకొచ్చారని అభినందించారు. అతితక్కువ నిధులతోనే పూర్తయిన ప్రాజెక్టు కాళేశ్వరం అని హరీశ్ ఈ సందర్భంగా అన్నారు. కేసీఆర్ సమగ్రంగా అధ్యయనం చేసిన తర్వాతే మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. కేసీఆర్ ఆలోచన, ఆచరణలతో నిల్వసామర్థ్యం, ఆయకట్టు పెరిగిందని అన్నారు. కాళేశ్వరం డీపీఆర్‌కు ఆరు వందల కోట్లు ఖర్చయిందని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో నీళ్ల ఆంధ్రాకు సాగనంపుతున్నారని ఆరోపించారు. తెలంగాణ నీళ్ల దోచుకోవడానికి ప్రయత్నించిన ఆదిత్యనాథ్ దాస్‌ను ప్రభుత్వం సలహాదారుడిగా పెట్టుకోవడం దురదృష్టకరమని హరీశ్ వాపోయారు. ఇక, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీధర్ దేశ్‌పాండే చరిత్రలో నిలిచిపోయే పుస్తకాలను రచించడం అభినందనీయం అన్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

'స్పిరిట్' తర్వాతే...



ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. అయితే మొదట 'యానిమల్'కు సీక్వెల్‌గా 'యానిమల్ పార్క్' ప్రారంభమవుతుందని, అందువల్ల 'స్పిరిట్' షూటింగ్ ఆలస్యం అవుతోందంటూ వార్తలు వెలువడ్డాయి. తాజాగా నిర్మాత భూషణ్ కుమార్ ఈ వార్తలను ఖండించారు. మరో రెండు, మూడు నెలల్లో 'స్పిరిట్' షూటింగ్ ప్రారంభం అవుతుందన్నారు. దీని తర్వాతే 'యానిమల్ పార్క్'ను రూపొందిస్తామని స్పష్టం చేశారు.

తూటాల వర్షంలో పువ్వేదో పూసేనా



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కింగ్ డమ్'. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ నెల 30న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం చిత్రబృందం తొలి గీతాన్ని విడుదల చేసింది. 'హృదయం లోపల' అంటూ సాగే ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ స్వరాలు సమకూర్చడంతో పాటు అనుమిత నదేశన్‌తో కలసి ఆలపించారు. కేకే సాహిత్యాన్ని అందించారు. అద్భుతమైన కథతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేలా ఈ సినిమా ఉండబోతోంది అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జోమోన్ టి. జాన్, గిరీష్ గంగాధరన్, ఎడిటర్: నవీన్ నూలి.

జూన్‌లో విడుదల



నూతన నటీనటులు ఆశిష్ గాంధీ, మానసా రాధాకృష్ణన్‌లు జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. కిరణ్ కిట్టి, లక్ష్మీ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. సోనుధి ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై ఆర్‌యూ రెడ్డి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. నిర్మాత మాట్లాడుతూ 'ఈ సినిమాలో గోపీ సుందర్ స్వరపరిచిన ఆరుపాటలు ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయి. త్వరలో టైటిల్‌ను ప్రకటించి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తాం, జూన్‌లో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. 'మనసుకు హత్తుకునే భావోద్వేగాలున్న కథ ఇది. వాణిజ్య అంశాలకి, సామాజిక అంశాలను కలిపి తెరకెక్కించాం' అని దర్శకులు తెలిపారు.

మన వాళ్లకు శక్తిమంతులైన హీరోలు కావాలి!



భారతీయ ప్రేక్షకులు శక్తిమంతులైన హీరోలను చూడటానికి ఇష్టపడతారని హీరో నాగార్జున అభిప్రాయపడ్డారు. ముంబైలో జరుగుతున్న వేవ్స్ సమావేశంలో శుక్రవారం జరిగిన ఒక చర్చలో ఆయన పాల్గొన్నారు. "మన దేశంలో చాలా మంది ప్రజలకు రోజువారీ జీవితంలో చాలా ఒత్తిడి ఉంటుంది. సినిమాలను చూస్తే వారికి ఆ ఒత్తిడి పోతుంది. అందుకే వారు సినిమాల్లో మ్యాజిక్ కోరుకుంటారు. ఒక హీరో 20 మందిని ఎలా కొట్టగలుగుతాడని కొందరు అడుగుతారు. హాలీవుడ్‌లో మార్వెల్‌లాంటి సినిమాల్లో కూడా అదే చేస్తారు. కానీ వాళ్లకు సూపర్ పవర్స్ ఉన్నట్లు చూపిస్తారు. మన హీరోలకు అలాంటి ప్రత్యేక శక్తులు ఉండవు. ఒక సామాన్యుడు అసామాన్యంగా ప్రవర్తిస్తే మన ప్రేక్షకులకు నచ్చుతుంది.." అని నాగార్జున వ్యాఖ్యానించారు. 'పుష్ప-2' లాంటి సినిమాలకు దేశవ్యాప్తంగా ఆదరణ లభించటానికి ఇదే కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. "'పుష్ప' తెలుగులో కన్నా హిందీలో ఎక్కువ వసూళ్లు సాధించింది. తెలుగులో 'పుష్ప'లాంటి సినిమాలు ఇంతకు ముందూ వచ్చాయి. కానీ బిహార్, ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లలో 'పుష్ప'లోని పుష్పరాజ్,, 'కేజీఎఫ్'లో రాకీ.. 'బాహుబలి'లో ప్రభాస్ లాంటి హీరోలను చూడాలనుకుంటున్నారు.. అందుకే ఈ సినిమాలు అక్కడ పెద్ద హిట్ అయ్యాయి" అని ఆయన పేర్కొన్నారు. మాతృభాష పట్ల అభిమానం.. సొంత సంస్కృతి పట్ల మమకారం ఉన్న దర్శకుల చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తారన్నారు. "బాహుబలి సినిమాలో ప్రతి ఫ్రేమ్‌ను రాజమౌళి- తెలుగు సినిమాలాగే తీసారు. దానిని ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఆదరించారు. కథను మంచిగా చెప్పగలిగితే - అందరూ ఆదరిస్తారు" అని నాగార్జున పేర్కొన్నారు. తాను తన సినిమాలు తెలుగులో హిట్ కావాలని కోరుకుంటానని.. తెలుగులో హిట్ అయితే ఇతర భాషల్లో కూడా తప్పనిసరిగా హిట్ అవుతాయని అభిప్రాయపడ్డారు. ప్రముఖ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్, తమిళ నటి ఖుష్బు సుందర్, హీరో కార్తీలు కూడా ఈ చర్చలో పాల్గొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా మనకు గుర్తింపు వచ్చింది!



సినిమా- సాఫ్ట్ పవర్ అనే అంశంపై శుక్రవారం వేవ్స్ అంతర్జాతీయ సమావేశంలో జరిగిన చర్చలో - హీరో విజయ్ దేవరకొండ, బాలీవుడ్ నటి కరీనాకపూర్, హిందీ దర్శకుడు కరణ్ జోహార్ పాల్గొన్నారు. భారతీయ సినిమాలను, కథలను ప్రపంచవ్యాప్తంగా అందరూ గుర్తిస్తున్నారని విజయ్ దేవరకొండ పేర్కొన్నారు. "కశ్మీర్.. ముస్సోరీ వంటి ప్రాంతాలకు వెళ్తే అక్కడ చాలా మంది గుర్తుపడుతున్నారు. పదేళ్ల క్రితం దక్షిణాది నటులను ఎక్కువగా గుర్తుపట్టేవారు కాదు. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. వారు మమల్ని గుర్తుపడుతున్నారంటే దానికి కారణం సినిమా మాత్రమే! " అని విజయ్ అభిప్రాయపడ్డారు. తనకు చిన్నతనం నుంచి అమెరికా గురించి తెలుసునని.. అమెరికాలో ఉన్న 10 ప్రధాన నగరాలు కూడా తెలుసునని.. దానికి కారణం సినిమాలేనని విజయ్ పేర్కొన్నారు. దక్షిణాది, ఉత్తరాదికి చెందిన స్టార్స్ కలిసి పనిచేస్తే భారీ సినిమాలు వస్తాయన్నారు. "షారుక్ ఖాన్ సినిమా రూ. వెయ్యి కోట్లు కలెక్ట్ చేసింది.. అల్లు అర్జున్ 'పుష్ప' రూ. వెయ్యి కోట్లు కలెక్ట్ చేసింది.. ఇలాంటి ఇద్దరు స్టార్స్ కలిస్తే ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.." అన్నారు. ఆగస్టు నెలలో జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ నటించిన 'వార్ 2' సినిమా విడుదల అవుతోందని.. ఉత్తరాది, దక్షిణాది హీరోలు కలిస్తే ఎలా ఉంటుందనే విషయానికి ఇదొక ఉదాహరణగా నిలుస్తుందని కరణ్ జోహార్ పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా భారతీయ సినిమాలకు ఆదరణ పెరిగిందని.. రాజమౌళి లాంటి దర్శకుల సామర్థ్యాన్ని ప్రపంచమంతా గుర్తిస్తోందని కరణ్‌జోహార్ పేర్కొన్నారు. "ప్రస్తుతం దక్షిణాది.. ఉత్తరాది సినిమాలనేవి ఏమి లేదు. భారతీయ సినిమా మాత్రమే ఉంది. దీనిని అందరూ గుర్తించాలి. అందరూ కలిసినప్పుడే మన భారతీయ సినిమాలను ముందుకు తీసుకువెళ్లగలుగుతాం" అన్నారు. భారతీయ సినిమాలకు ప్రపంచవ్యాప్తంగా ఎప్పటి నుంచో గుర్తింపు ఉందని కరీనా కపూర్ పేర్కొన్నారు. "లండన్‌లో ఒక సారి ట్యాక్సీలో వెళ్తున్నా. ఆ ట్యాక్సీ డ్రైవర్ మా తాతగారు రాజ్‌కపూర్ సినిమాలోని - 'మేరా జూతా హై జపానీ..' పాట హిందీలో పాడి వినిపించాడు. నాకు చాలా గర్వంగా అనిపించింది.." అని ఆమె తన అనుభవాన్ని వివరించారు. ప్రముఖ దర్శకుడు స్పీల్‌బర్గ్ కూడా మన హిందీ సినిమాలు చూస్తారని కరీనా కపూర్ పేర్కొన్నారు.

వినోదం పంచేలా...



నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా మురళీ మనోహర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. డా.సంధ్య గోలి సమర్పణలో వెను సద్ది, అమర్ బుర్రా, జయకాంత్(బాబీ) నిర్మిస్తున్నారు. ఈ సినిమా పోస్టర్‌ని మేకర్స్ శుక్రవారం రిలీజ్ చేశారు. ఈ చిత్రం ఆద్యంతం హాస్యభరితంగా ఉండబోతున్నట్లు పోస్టర్ చూస్తే తెలుస్తోంది. విభిన్నంగా తీర్చిదిద్దిన క్యారెక్టర్లను హైదరాబాద్ నగర బ్యాక్‌డ్రాప్‌లో స్టైలిష్‌గా ప్రెజెంట్ చేశారు.

వేవ్స్ అద్భుతం
- శ్రీలీల



వేవ్స్ సదస్సులో కథానాయిక శ్రీలీల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం నాకు ఎంతగానో నచ్చింది. వినోదరంగంలో పెట్టుబడులు పెట్టాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించిన తీరు ఆలోచింపజేసింది. నిర్వాహకులు కార్యక్రమాన్ని చాలా అద్భుతంగా నిర్వహిస్తున్నారు' అని ఆమె పేర్కొన్నారు.

థ్రిల్లర్ కథాంశంతో



'స్త్రీ 2' చిత్రం బ్లాక్‌బస్టర్ అవ్వడంతో బాలీవుడ్‌లో శ్రద్ధాకపూర్ దశ తిరిగింది. ఆ విజయంతో ఒక్కసారిగా ఆమె డిమాండ్ ఉన్న కథానాయికగా మారారు. హిందీ పరిశ్రమలోని అగ్ర నిర్మాణ సంస్థల నుంచి శ్రద్ధకు ఆఫర్లు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఆమె మాత్రం ఆచితూచి సినిమాలను ఎంపిక చేసుకుంటున్నారు. ముఖ్యంగా హీరోయిన్ ఓరియంటెడ్ సినిమాలకే శ్రద్ధాకపూర్ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏక్తాకపూర్ నిర్మాతగా తెరకెక్కుతోన్న చిత్రంలో నటించేందుకు శ్రద్ధా అంగీకరించారనీ, ఇందుకోసం రూ. 17 కోట్లు పారితోషికంగా అందుకోంటున్నారని బాలీవుడ్ టాక్. థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి 'తుంబాడ్' ఫేమ్ రహి అనిల్ బర్వే దర్శకత్వం వహించనున్నారట. ఈ ఏడాది ద్వితీయార్థంలో సెట్స్‌పైకి వెళ్లనుందని తెలుస్తోంది. శ్రద్ధాకపూర్ కెరీర్‌లో ఇప్పటివరకూ ఆమె అందుకున్న అత్యధిక పారితోషికం ఇదే అవుతుంది.

కామెడీ ఎంటర్‌టైనర్



ఇప్పటివరకూ పలు హాస్యపాత్రల్లో ప్రేక్షకులను మెప్పిస్తూ వచ్చిన ప్రవీణ్ ప్రధాన పాత్రధారిగా తెరకెక్కుతోన్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. త్వరలో ప్రేక్షుల ముందుకు రానున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను శుక్రవారం యూనిట్ విడుదల చేసింది. చేతిలో గరిటెతో తీక్షణమైన చూపులతో కనిపిస్తున్న ప్రవీణ్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంతో ఎస్.జే శివ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మిస్తున్నారు. వైవాహర్ష, కృష్ణ భగవాన్, షైనింగ్ ఫణి కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో అన్ని వర్గాలను అలరించే అంశాలున్నాయి. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు మా సినిమా నచ్చుతుంది' అన్నారు. నటుడిగా ప్రవీణ్‌లోని కొత్తకోణాన్ని ఈ చిత్రంలో చూడబోతున్నారని నిర్మాతలు తెలిపారు. సంగీతం: వికాస్ బాడిస, సినిమాటోగ్రఫీ: బాల సరస్వతి

ఇక అమెరికాలో మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లే..!



న్యూఢిల్లీ: అమెరికా మార్కెట్లో ఇకపై మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లే ఎక్కువగా దర్శనమివ్వనున్నాయి. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అమెరికాలో విక్రయించే ఐఫోన్లలో అధిక వాటా భారత్ నుంచి దిగుమతి చేసుకోనున్నట్లు యాపిల్ సీఈఓ టిమ్‌కుక్ వెల్లడించారు. అమెరికాలో విక్రయించే అధిక శాతం ఐప్యాడ్, మ్యాక్, యాపిల్ వాచ్, ఎయిర్‌పాడ్స్‌ను వియత్నాం ప్లాంట్ల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇతర మార్కెట్లలో విక్రయించే ఐఫోన్లను మాత్రం చైనా నుంచి సమీకరించనున్నట్లు ఈ మార్చితో ముగిసిన రెండో త్రైమాసిక ఫలితాల విడుదల అనంతరం అనలిస్ట్ కాల్ కాన్ఫరెన్స్‌లో ఆయన స్పష్టం చేశారు. ట్రంప్ సుంకాల అనిశ్చితి నేపథ్యంలో యాపిల్ ఈ నిర్ణయం తీసుకుంది. సుంకాలతో జూన్ క్వార్టర్‌లో 90 కోట్ల డాలర్ల (రూ.7,650 కోట్లు) మేర భారం పడవచ్చని కంపెనీ అంచనా వేసింది. యాపిల్ అక్టోబరు నుంచి తదుపరి సెప్టెంబరు వరకు ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుంది. ఎస్ అండ్ పీ గ్లోబల్ అధ్యయన నివేదిక ప్రకారం.. యాపిల్ గత ఏడాది అమెరికా మార్కెట్లో 7.59 కోట్ల ఐఫోన్లను విక్రయించింది. భారత్‌లో తయారవుతున్న యాపిల్ ఐఫోన్లలో అధిక శాతం అమెరికాకే ఎగుమతవుతున్నాయి. ఈ ఫిబ్రవరి 28తో ముగిసిన మూడు నెలల్లో మన ఐఫోన్ల ఎగుమతుల్లో అమెరికా వాటా 81.9 శాతంగా ఉంది. మార్చిలో ఇది 97.6 శాతానికి పెరిగింది.

అదానీ గ్రీన్ షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్

గౌతమ్ అదానీ బంధువు ప్రణవ్ అదానీ దోషి:సెబీ



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ సంస్థ.. అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లలో 2021 మే నెలలో జరిగిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ దోషులెవరో సెబీ నిగ్గు తేల్చింది. ఈ మొత్తం తతంగంలో అదానీ గ్రూప్ ప్రధాన ప్రమోటర్ గౌతమ్ అదానీ దగ్గరి బంధువు ప్రణవ్ అదానీ ప్రధాన పాత్రదారి అని సెబీ దర్యాప్తులో తేలింది. అదానీ గ్రీన్ ఎనర్జీ.. ఎస్‌బీ ఎనర్జీ హోల్డింగ్స్ అనే సంస్థను 350 కోట్ల డాలర్లకు కొనబోతోందన్న కీలక విషయాన్ని ప్రణవ్ అదానీ తన బావ మరిది కునాల్ షాకు రెండు మూడు రోజుల ముందే చేరవేశాడు. దాంతో కునాల్ అతడి సోదరుడు నృపుల్.. అదానీ గ్రీన్‌ఎనర్జీ షేర్లలో ట్రేడింగ్ చేసి రూ.90 లక్షల మేర వెనకేశారని సెబీ దర్యాప్తు తేల్చింది. ప్రణవ్ అదానీ కాల్ రికార్డులు, కునాల్, నృపుల్ ట్రేడింగ్ ఆధారంగా సెబీ ఈ నిర్ణయానికి వచ్చింది. గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ కుమారుడే ప్రణవ్.

సెటిల్‌మెంట్ కోసం యత్నాలు: ప్రణవ్ అదానీ అనేక అదానీ గ్రూప్ కంపెనీల బోర్డుల్లో సభ్యుడు కూడా. సెబీ దర్యాప్తులో దొరికిపోవడంతో ఇప్పుడు చడీచప్పుడు లేకుండా ఆ కేసు సెటిల్ చేసుకునేందుకు సెబీతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. సెబీ నిబంధనల ప్రకారం ఇన్‌సైడర్ ట్రేడింగ్ కేసుల్లో దోషులుగా తేలిన వ్యక్తులు తమ నేరాన్ని ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా సెబీ విధించే జరిమానా చెల్లించి ఆ కేసులను సెటిల్ చేసుకోవచ్చు. అయితే కునాల్ సోదరులు మాత్రం ఈ విషయంలో ఇంకా సెబీతో సెటిల్‌మెంట్‌కు ముందుకు రాలేదు. ప్రమోటర్ల మద్దతుతో అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరుగుతోందని ఎప్పటి నుంచో ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎట్టకేలకు ఆ ఆరోపణల్లో ఒకటి నిజమని సెబీ తేల్చింది.

అపోలో డిఫెన్స్ చేతికి ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్

డీల్ విలువ రూ.107 కోట్లు


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కార్పొరేట్ ప్రపంచంలో మరో టేకోవర్ చోటు చేసుకుంది. హిందుజా గ్రూప్ కంపెనీ ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్‌ను అపోలో మైక్రోసిస్టమ్స్ అనుబంధ సంస్థ అపోలో డిఫెన్స్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏడీఐపీఎల్) రూ.107 కోట్లకు కొనుగోలు చేసింది. దీనికి సంబంధించి శుక్రవారం రెండు సంస్థల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. అవసరమైన అన్ని అనుమతులు లభిస్తే రెండు మూడు నెలల్లో ఈ కొనుగోలు పూర్తవుతుందని అపోలో మైక్రోసిస్టమ్స్ తెలిపింది. ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్.. గనులు, వివిధ పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించే పేలుడు పదార్థాల తయారీలో ఉంది. రక్షణ రంగానికి అవసరమైన పేలుడు, మందుగుండు సామాగ్రి తయారీలో ఉన్న అపోలో డిఫెన్స్‌కు ఈ కొనుగోలు ఎంతగానో తోడ్పడుతుందని భావిస్తున్నారు.

ఐటీ శాఖ నుంచి 'ఐటీఆర్-3'

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను (ఐటీ) శాఖ 2025-26 పన్ను మదింపు సంవత్సరానికి (అసెస్‌మెంట్ ఇయర్) సంబంధించి ఐటీఆర్-3 ఫామ్‌ను విడుదల చేసింది. వ్యాపార లేదా వృత్తిపరమైన ఆదాయం ఉన్న వ్యక్తులు, అవిభక్త హిందూ కుటుంబాలు (హెచ్‌యూఎఫ్) ఈ ఫామ్ ద్వారా తమ ఆదాయ, పెట్టుబడులు, ఖర్చులు, లాభాల వివరాలు వెల్లడించాలి. ఈసారి ఐటీఆర్-3 ద్వారా వెల్లడించాల్సిన ఆస్తుల విలువను ప్రస్తుత రూ.50 లక్షల నుంచి రూ.కోటికి పెంచారు. దీంతో మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులపై పెద్ద భారం తగ్గింది. ఈ ఫామ్ ద్వారా రియల్ ఎస్టేట్‌లో మూలధన లాభాలు ఏమైనా ఉంటే అవి గత ఏడాది జూలై 23 తర్వాత వచ్చాయా? లేక అంతకు ముందే వచ్చాయా? అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలి. ఈ లాభాలపై ఇండెక్సేషన్ వద్దనుకుంటే 12.5 శాతం, కావాలనుకుంటే 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

మీ ఫోన్ రిపేర్ సాధ్యమేనా..!

రిపేరబిలిటీ ఇండెక్స్ తీసుకురానున్న ప్రభుత్వం



త్వరలో మార్గదర్శకాల జారీ

న్యూఢిల్లీ: కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ త్వరలో కీలక నిర్ణయం తీసుకోబోతోంది. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లకు రిపేరబిలిటీ సూచీ (ఇండెక్స్)ని తప్పనిసరి చేయబోతోంది. దీని ప్రకారం వీటిని తయారు చేసి అమ్మే కంపెనీలు ఇక తప్పనిసరిగా రేటింగ్ రూపంలో వాటి రిపేరబిలిటీ ఇండెక్స్‌ను సూచించాలి. ఇది ప్రస్తుతం ఇంధన సామర్థ్యానికి సంబంధించి ఏసీలు, బల్బులు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లకు అమలు చేస్తున్న రేటింగ్స్ రూపంలో ఉంటుంది. తాము కొన్న స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, కంప్యూటర్లు, ఇతర కీలక ఎలక్ట్రానిక్ పరికరాలకు సరైన రిపేర్ సదుపాయాలు లభించడం లేదని వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కేంద్ర ప్రభుత్వం ఈ చర్య తీసుకోబోతోంది. దీంతో వినియోగదారులు ఈ వస్తువులను కొనే ముందే ఈ ఇండెక్స్ ఆధారంగా సరైన నిర్ణయాలు తీసుకుంటారని భావిస్తున్నారు.

ఇప్పటికే నివేదిక సమర్పణ

దీనికి సంబంధించి కేంద్ర వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి భారత్ ఖేరా నేతృత్వంలోని నిపుణుల కమిటీ ఇప్పటికే ఒక నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం త్వరలోనే రిపేరబిలిటీ ఇండెక్స్‌కు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేస్తుందని మంత్రిత్వ శాఖ కార్యదర్శి నిధి ఖరే చెప్పారు. ముందు స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లకు ఈ సూచీని అమలు చేసి తర్వాత ల్యాప్‌టాప్‌లు, డెస్క్ టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికాలన్నిటికి విస్తరిస్తారని ఆమె తెలిపారు. ఆయా వస్తువులకు సంబంధించిన రిపేరబిలిటీ ఇండెక్స్‌ను ప్రతి కంపెనీ తన విక్రయ కేంద్రం, ప్యాకింగ్, వెబ్‌సైట్ల ద్వారా తెలియజేయాల్సి ఉంటుంది.

రేటింగ్ ఇలా

ఎలక్ట్రానిక్ పరికరాల్లోని కీలక విడిభాగాలైన డిస్‌ప్లే స్క్రీన్లు, బ్యాటరీలు, కెమెరా అసెంబ్లీలు, చార్జింగ్ పోర్టులు, స్పీకర్లను రిపేర్ చేయడానికి ఉన్న అవకాశం, అందుబాటులో ఉండే విడిభాగాలు, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ విధానాల ఆధారంగా ఈ రిపేరబిలిటీ ఇండెక్స్ రేటింగ్స్ ఉంటాయి. ఏదైనా ఒక సర్వీస్ సంతృప్తికరంగా ఉంటే ఐదు పాయింట్లు, మధ్యస్థంగా ఉంటే మూడు పాయింట్లు ఇస్తారని భారత్ ఖేరా తెలిపారు. అమెరికా, ఈయూ, ఫ్రాన్స్‌తో సహా అనేక దేశాలు ఇప్పటికే ఈ రిపేరబిలిటీ ఇండెక్స్ విధానాన్ని అమలు చేస్తున్నాయి. ఇప్పుడు భారత్ కూడా ఈ విధానానికి సిద్ధమవుతోంది. దీంతో కంపెనీలు తమ ఉత్పత్తుల విషయంలో మరింత బాధ్యతాయుతంగా ఉంటాయని భావిస్తున్నారు.

ఇంట్రాడేలో 81,000 పైకి సెన్సెక్స్

చివరికి 260 పాయింట్ల లాభంతో 80,501 వద్ద ముగిసిన సూచీ

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు శుక్రవారం స్వల్పంగా లాభపడ్డాయి. ట్రేడింగ్ తొలి గంటలో సెన్సెక్స్ 935 పాయింట్లు ఎగబాకి 81,177.93 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై ఆశలు, ఏప్రిల్ నెల జీఎస్‌టీ వసూళ్లు సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయికి చేరడం, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు కొనసాగడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు ఇందుకు దోహదపడ్డాయి. అయితే, ఈక్విటీ మదుపరులు మళ్లీ లాభాల స్వీకరణకు దిగడంతో సూచీ ప్రారంభ లాభాలను నిలుపుకోలేకపోయింది. చివరికి 259.75 పాయింట్ల వృద్ధితో 80,501.99 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ప్రారంభ ట్రేడింగ్‌లో ఒక శాతానికి పైగా పెరిగి 24,589 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసినప్పటికీ, ఆఖరికి 12.50 పాయింట్ల స్వల్ప లాభంతో 24,346.70 వద్ద ముగిసింది.

అవాంటెల్ రూ.80 కోట్ల సమీకరణ: రైట్స్ ఇష్యూ ద్వారా రూ.80.90 కోట్లు సమీకరించనున్నట్లు హైదరాబాద్, వైజాగ్ కేంద్రాలుగా కార్యకలాపాలు సాగిస్తున్న అవాంటెల్ లిమిటెడ్ ప్రకటించింది. రక్షణ, సమాచార రంగాలకు సాంకేతిక పరిష్కారాలందించే ఈ కంపెనీ.. రైట్స్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను తెలుగు రాష్ట్రాల్లోని తన తయారీ యూనిట్లు, మౌలిక వసతుల విస్తరణ కోసం వినియోగించనుంది.

నిఫ్టీ వేవ్స్ ఇండెక్స్ ప్రారంభం: మీడియా, వినోదం, గేమింగ్ రంగానికి చెందిన 43 లిస్టెడ్ కంపెనీలతో కూడిన నిఫ్టీ వేవ్స్ ఇండెక్స్‌ను ప్రారంభిస్తున్నట్లు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) శుక్రవారం ప్రకటించింది. వేవ్స్ 2025 సదస్సులో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఈ సూచీని ప్రారంభించారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	445	విజయవాడ	470
వరంగల్	447	గోదావరి	450
చిత్తూరు	523	విశాఖపట్నం	450
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	విజయవాడ	132
వరంగల్	130	గుంటూరు	130
కరీంనగర్	130	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	102
కర్నూలు	130	నెల్లూరు	107
విశాఖపట్నం	131	అనంతపురం	107
గోదావరి	132		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,510 ▼	87,550 ▼	1.09.000 ▲
విజయవాడ	97,000 ▲	91,200 ▲	96,500 ▲
విశాఖపట్నం	96,710 ▲	87,550 ▼	1.09.000 ▲
రాజమండ్రి	95,510 ▼	87,550 ▼	96,500 ▼
ప్రొద్దుటూరు	95,600 ▼	87,950 ▼	97,100 ▲
ముంబై	93,954 ▼	86,062 ▼	94,125 ▲

10 నెలల గరిష్ఠానికి తయారీ రంగం

దేశీయ తయారీ రంగం వృద్ధి రేటు ఏప్రిల్‌లో 10 నెలల గరిష్ఠ స్థాయికి చేరింది. శక్తివంతమైన ఆర్డర్లతో హెచ్‌ఎస్‌బీసీ తయారీ రంగ సూచీ (పీఎంఐ) 58.2 పాయింట్లుగా నమోదైంది. మార్చిలో ఇది 58.1 పాయింట్లుంది. గత ఏడాది జూన్ తర్వాత నమోదైన వేగవంతమైన వృద్ధి ఇదే. విదేశాల నుంచి వచ్చిన కొత్త ఆర్డర్లు కూడా 14 సంవత్సరాల గరిష్ఠ స్థాయికి చేరాయని పేర్కొంటూ ఆఫ్రికా, ఆసియా, యూరప్, పశ్చిమాసియా, అమెరికా ఇందుకు అండగా నిలిచినట్టు తెలిపింది. వ్యాపారాల్లో సానుకూలతతో కంపెనీలు కొత్త సిబ్బందిని కూడా నియమించుకున్నట్లు పీఎంఐ వెల్లడించింది.

విక్రేతలకు రిఫరల్ ఫీజు ఎత్తివేత

అమెజాన్ ఇండియా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): చిన్న వ్యాపారులకు మరింత తోడ్పాటునందించేందుకు గాను రిఫరల్ ఫీజును ఎత్తివేసినట్లు అమెజాన్ ఇండియా ప్రకటించింది. రూ.300లోపు ఉన్న అన్ని ఉత్పత్తులకు ఇది వర్తిస్తుందని అమెజాన్ ఇండియా డైరెక్టర్ సేల్స్ గౌరవ్ భట్నాగర్ తెలిపారు. 135 ఉత్పత్తుల కేటగిరీలోని వాటికి ఈ జీరో రిఫరల్ ఫీజు అమలవుతుందన్నారు. దీని ద్వారా కొనుగోలుదారులకు మరింత తక్కువ ధరకే ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయన్నారు. అపారెల్స్ ఫ్యాషన్ జువెలరీ, కిరాణా సహా పలు ఉత్పత్తులు ఈ కేటగిరిలో ఉన్నాయని భట్నాగర్ తెలిపారు. ఏప్రిల్ 7 నుంచి ఇది అమల్లోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో అమెజాన్ ద్వారా పలు ఉత్పత్తులు విక్రయిస్తున్న 50 వేలకు పైగా విక్రేతలకు ఇది ఎంతగానో లబ్ధి చేకూరుస్తుందన్నారు. హైదరాబాద్ సహా సమీప నగరాల్లోని విక్రేతలు అమెజాన్ ప్లాట్‌ఫామ్ ద్వారా హోమ్ అండ్ కిచెన్, ఫర్నీచర్, స్పోర్ట్స్ ఉత్పత్తులను విక్రయిస్తున్నారని తెలిపారు.

భూషణ్ స్టీల్ టేకోవర్‌కు సుప్రీం బ్రేక్

న్యూఢిల్లీ: దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా భూషణ్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్ (బీపీఎస్ఎల్)ను టేకోవర్ చేసేందుకు జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సమర్పించిన రూ.19,700 కోట్ల ప్రణాళికను సుప్రీంకోర్టు తిరస్కరించింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ బిడ్ చెల్లదని, దివాలా స్మృతి చట్ట నియమావళికి వ్యతిరేకమని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. అంతేకాదు, బీపీఎస్ఎల్ లిక్విడేషన్ (కంపెనీ ఆస్తులను వేలం వేసి విక్రయించడం)కు కోర్టు ఆదేశించింది.

15 నుంచి ఆడి కార్ల ధర పెంపు

న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి ఇండియా తన వాహనాల ధరలను పెంచనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. భారత్‌లో విక్రయిస్తున్న అన్ని మోడళ్ల ధరలను గరిష్ఠంగా 2 శాతం పెంచుతున్నట్లు పేర్కొంది. పెరిగిన ధరలు ఈ నెల 15 నుంచి అమల్లోకి వస్తాయని ఆడి తెలిపింది.

స్పోర్ట్స్

ఉత్తమ ఫుట్‌బాల్ క్రీడాకారిణి సౌమ్య



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) వార్షిక అవార్డుల్లో నిజామాబాద్ అమ్మాయి గుగులోతు సౌమ్యకు ఉత్తమ క్రీడాకారిణి పురస్కారం లభించింది. ఈ ఘనత సాధించిన తొలి తెలంగాణ క్రీడాకారిణి సౌమ్యనే కావడం విశేషం. శుక్రవారం భువనేశ్వర్‌లో జరిగిన 2024 ఏఐఎఫ్ఎఫ్ వార్షిక అవార్డుల ప్రదానోత్సవంలో సౌమ్య ఈ పురస్కారాన్ని అందుకుంది. ఐడబ్ల్యూఎల్‌లో ఈస్ట్ బెంగాల్ జట్టు తరఫున తొమ్మిది గోల్స్‌తో టాప్ స్ట్రయికర్‌గా నిలిచిన సౌమ్య.. గతేడాది జరిగిన అంతర్జాతీయ పోటీల్లో టీమిండియా విజయాల్లో కీలకపాత్ర పోషించినందుకుగాను ఈ అవార్డు వరించింది. పురుషుల విభాగంలో సుభాషిష్ బోస్ ఉత్తమ ప్లేయర్ అవార్డు అందుకున్నాడు.

షూటర్ ముఖేష్‌కు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు యువ షూటర్ నేలవల్లి ముఖేష్ పసిడి పతకం కొల్లగొట్టాడు. శుక్రవారం భోపాల్‌లో జరిగిన ఈ పోటీల్లోని 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో ముఖేష్ 600కు గానూ 586 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. సమీర్ (హరియాణా) రజతం, సాహిల్ చౌధరి (మధ్యప్రదేశ్) కాంస్య పతకాలు దక్కించుకున్నారు.

ట్రాన్స్‌జెండర్లకు చోటు లేదు

ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు నిర్ణయం

లండన్: మహిళలు, బాలికల క్రికెట్ నుంచి ట్రాన్స్‌జెండర్లను పూర్తిగా నిషేధించనున్నట్టు..ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) శుక్రవారం వెల్లడించింది. గత నెలలో యూకే సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. కాగా..మహిళల ఫుట్‌బాల్‌లో ట్రాన్స్‌జెండర్లు ఆడడాన్ని నిషేధిస్తూ ఇంగ్లండ్, స్కాట్లాండ్ ఫుట్‌బాల్ సంఘం నిర్ణయం తీసుకున్న 24 గంటలలోనే ఈసీబీ కూడా అదే బాటలో పయనించడం గమనార్హం.

శ్రీశాంత్‌పై మూడేళ్ల సస్పెన్షన్

కేరళ క్రికెట్ సంఘం నిర్ణయం



తిరువనంతపురం: చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొన్న భారత జట్టునుంచి సంజూ శాంసన్‌ను తొలగించడానికి సంబంధించి నిరాధార ఆరోపణలు చేసిన మాజీ పేసర్ శ్రీశాంత్‌పై కేరళ క్రికెట్ సంఘం (కేసీఏ) కొరడా ఝుళిపించింది. అతడిని మూడు సంవత్సరాలు సస్పెండ్ చేస్తున్నట్టు శుక్రవారం ప్రకటించింది. ఈమేరకు గతనెల 30న కొచ్చిలో జరిగిన కేసీఏ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కేరళ క్రికెట్ లీగ్‌లో కొల్లం ఏరీస్‌కు శ్రీశాంత్ సహ యజమానిగా ఉన్నాడు.

వివాదం ఏమిటంటే..: విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీకి కేరళ జట్టులో సంజూని కేసీఏ ఎంపిక చేయలేదని..దరిమిలా అతడు చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడని ఓ మలయాళ టీవీ చానెల్ చర్చలో శ్రీశాంత్ ఆరోపించాడు. దాంతో శ్రీశాంత్‌కు కేసీఏ నోటీసు జారీ చేసింది. అయితే శాంసన్‌కు మద్దతు ఇచ్చినందుకు కాకుండా కేసీఏ పరువుకు భంగం కలిగేలా వ్యాఖ్యానించినందునే శ్రీశాంత్‌కు నోటీసు ఇచ్చినట్టు సంఘం పేర్కొంది. అలాగే సంజూ ఎంపికకు సంబంధించి అసోసియేషన్‌పై నిరాధార ఆరోపణలు చేసిన అతడి తండ్రి విశ్వనాథ్‌తోపాటు మరో ఇద్దరిపై నష్టపరిహారం కోసం చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు కూడా కేసీఏ తెలిపింది.

రైజర్స్ కథ ముగిసినట్టే..

- ఏడో ఓటమితో ప్లేఆఫ్స్ సంక్లిష్టం
- 38 రన్స్ తేడాతో గుజరాత్ విజయం
- గిల్, బట్లర్ హాఫ్‌సెంచరీలు ● పోరాడిన అభిషేక్



గిల్ (76)

1 టీ20ల్లో వేగంగా (54 ఇన్నింగ్స్) 2 వేల పరుగులు పూర్తి చేసిన తొలి భారత బ్యాటర్‌గా సుదర్శన్. ఓవరాల్‌గా మార్ష్ (53) తర్వాత రెండో స్థానంలో నిలిచాడు.

3 ఐపీఎల్‌లో తక్కువ బంతుల్లోనే (2677) 4 వేల రన్స్ పూర్తి చేసిన మూడో బ్యాటర్‌గా బట్లర్. గేల్ (2653), డివిల్లీర్స్ (2658) ముందున్నారు.

అహ్మదాబాద్: ప్లేఆఫ్స్ బెర్త్‌పై ఆశలను పెట్టుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు గట్టి ఝలక్ తగిలింది. మిగిలిన ఐదు మ్యాచ్‌లను కచ్చితంగా గెలవాల్సిన వేళ.. శుక్రవారం గుజరాత్ టైటాన్స్ చేతిలో 38 పరుగుల తేడాతో చిత్తయ్యింది. దీంతో ఏడు ఓటముల కారణంగా ఆరు పాయింట్లతో ఉన్న కమిన్స్ సేన సాంకేతికంగా రేసులో ఉన్నా.. నాకౌట్ చేరడం దాదాపు అసాధ్యమే. అటు సొంతగడ్డపై ఆల్‌రౌండ్‌షో కనబర్చిన గిల్ బృందం 14 పాయింట్లతో రెండో స్థానానికి ఎగబాకింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 224 పరుగులు చేసింది. గిల్ (38 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 76), బట్లర్ (37 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 64), సుదర్శన్ (23 బంతుల్లో 9 ఫోర్లతో 48) రాణించారు. ఉనాద్కట్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 186 పరుగులు చేసి ఓడింది. అభిషేక్ (41 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 74), క్లాసెన్ (23) మాత్రమే ఆకట్టుకున్నారు. ప్రసిద్ధ్, సిరాజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ప్రసిద్ధ్ నిలిచాడు.

అభిషేక్ ఒక్కడే..: భారీ ఛేదనలో రైజర్స్ స్థాయికి తగ్గట్టుగా ఆడలేకపోయింది. ఓపెనర్ అభిషేక్ మినహా మరే బ్యాటర్ ఆకట్టుకోలేదు. పేసర్ ప్రసిద్ధ్ షార్ట్ పిచ్ బంతులతో ఇబ్బందిపెట్టగా, స్పిన్నర్ రషీద్ మాత్రం ధారాళంగా పరుగులిచ్చుకున్నాడు. అభిషేక్ మెరుపులకు తొలి నాలుగు ఓవర్లలో జట్టు 45 పరుగులతో మెరుగ్గానే కనిపించింది. కానీ ఆ తర్వాత టైటాన్స్ బౌలర్లు కట్టడి చేయడంతో పవర్‌ప్లేలో 57 పరుగులకే పరిమితమైంది. అటు మరో ఓపెనర్ హెడ్ (20) ఐదో ఓవర్‌లో రషీద్ అద్భుత క్యాచ్‌తో వెనుదిరిగాడు. కాసేపటికే ఇషాన్ (13)ను పేసర్ కొట్జీ అవుట్ చేయగా మధ్య ఓవర్లలో రైజర్స్ మరింతగా ఇబ్బందిపడింది. అభిషేక్‌కు జతగా క్లాసెన్ క్రీజులో ఉన్నా పరుగులు రావడం కష్టమైంది. అభిషేక్ 28 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. అటు చేయాల్సిన రన్‌రేట్ పెరుగుతుండడంతో భారీ షాట్‌కు వెళ్లిన అభిషేక్.. సిరాజ్ సూపర్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. ఆ వెంటనే క్లాసెన్‌ను ప్రసిద్ధ్ అవుట్ చేయడంతో రైజర్స్ ఆశలు వదులుకుంది. దీనికి తోడు 17వ ఓవర్‌లో అనికేత్ (3), కమిందు (0)లను సిరాజ్ వరుస బంతుల్లో వెనక్కిపంపాడు. ఆఖర్లో నితీశ్ (21 నాటౌట్), కమిన్స్ (19 నాటౌట్) మెరుపులు ఓటమి అంతరాన్ని తగ్గించాయి.

చెలరేగిన టాపార్డర్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌కు ఎప్పటిలాగే టాపార్డర్ నుంచి సహకారం లభించింది. ఓపెనర్ గిల్ సిక్సర్‌తో తొలి ఓవర్‌లోనే 11 పరుగులు సాధించిన టైటాన్స్.. మూడో ఓవర్‌లో సుదర్శన్ ఐదు ఫోర్లతో 20 పరుగులు అందుకుంది. అనంతరం గిల్ 4,4,6తో కమిన్స్ 17 రన్స్ సమర్పించుకున్నాడు. హర్షల్ ఓవర్‌లోనూ సుదర్శన్ నాలుగు ఫోర్లతో 18 రన్స్ రాబట్టాడు. దీంతో గుజరాత్ జట్టు పవర్‌ప్లేలో 82 పరుగులతో తమ అత్యధిక స్కోరును పూర్తి చేసింది. అనంతరం జోరు మీదున్న సుదర్శన్‌ను స్పిన్నర్ జీషన్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు గిల్ మాత్రం షమి ఓవర్‌లో 4,4తో 25 బంతుల్లోనే హ్యాట్రిక్ హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. అయితే 13వ ఓవర్‌లో తను రనౌట్ కావడంతో రెండో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. 17వ ఓవర్‌లో 6,4తో బట్లర్ 31 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. తర్వాతి ఓవర్‌లోనే స్కోరు 200 దాటినా, ఆఖరి రెండు ఓవర్లలో టైటాన్స్ తడబడి బట్లర్, సుందర్, తెవాటియా (6), రషీద్ (0)ల వికెట్లను కోల్పోయింది. అయినా ఈ 12 బంతుల్లో 21 పరుగులతో పర్వాలేదనిపించింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ముంబై	11	7	4	0	14	1.274
గుజరాత్	10	7	3	0	14	0.867
బెంగళూరు	10	7	3	0	14	0.521
పంజాబ్	10	6	3	1	13	0.199
ఢిల్లీ	10	6	4	0	12	0.362
లఖ్‌నవూ	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	10	4	5	1	9	0.271
రాజస్థాన్	11	3	8	0	6	-0.780
హైదరాబాద్	10	3	7	0	6	-1.192
చెన్నై	10	2	8	0	4	-1.211

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

నేటి మ్యాచ్

చెన్నై x బెంగళూరు — రా.7.30 నుంచి — వేదిక: బెంగళూరు

స్కోరుబోర్డు

గుజరాత్: సుదర్శన్ (సి) క్లాసెన్ (బి) జీషన్ 48; గిల్ (రనౌట్) 76; బట్లర్ (సి) అభిషేక్ (బి) కమిన్స్ 64; సుందర్ (సి) నితీశ్ (బి) ఉనాద్కట్ 21; షారుక్ (నాటౌట్) 6; తెవాటియా (సి) అనికేత్ (బి) ఉనాద్కట్ 6; రషీద్ (సి అండ్ బి) ఉనాద్కట్ 0; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 20 ఓవర్లలో 224/6. వికెట్ల పతనం:** 1-87, 2-149, 3-206, 4-218, 5-224, 6-224; **బౌలింగ్:** షమి 3-0-48-0; ఉనాద్కట్ 4-0-35-3; కమిన్స్ 4-0-40-1; హర్షల్ 3-0-41-0; జీషన్ 4-0-42-1; కమిందు 2-0-18-0.

హైదరాబాద్: హెడ్ (సి) రషీద్ (బి) ప్రసిద్ధ్ 20, అభిషేక్ (సి) సిరాజ్ (బి) ఇషాంత్ 74, ఇషాన్ (సి) ప్రసిద్ధ్ (బి) కొట్జీ 13, క్లాసెన్ (సి) బట్లర్ (బి) ప్రసిద్ధ్ 23, అనికేత్ (సి) షారుఖ్ (బి) సిరాజ్ 3, నితీష్ కుమార్ (నాటౌట్) 21, మెండిస్ (సి) బట్లర్ (బి) సిరాజ్ 0, కమిన్స్ (నాటౌట్) 19, **ఎక్స్‌ట్రాలు 13, మొత్తం: 20 ఓవర్లలో 186/6; వికెట్లపతనం:** 1-49, 2-82, 3-139, 4-141, 5-145, 6-145, **బౌలింగ్:** సిరాజ్ 4-0-33-2, ఇషాంత్ శర్మ 3.2-0-35-1, ప్రసిద్ధ్ కృష్ణ 4-0-19-2, కొట్జీ 4-0-36-1, సుందర్ 1-0-6-0, రషీద్ 3-0-50-0, సాయి కిషోర్ 0.4-0-1-0.

గిల్ అవుటా? నాటౌటా?

గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రనౌట్ వివాదాస్పదంగా మారింది. 13వ ఓవర్‌లో బట్లర్ షార్ట్ ఫైన్ లెగ్ వైపు ఆడి సింగిల్‌కు వెళ్లాడు. అయితే గిల్ నాన్‌స్ట్రయిక్ ఎండ్ నుంచి క్రీజులోకి వచ్చే లోపే హర్షల్ త్రోతో కీపర్ క్లాసెన్ వికెట్లను గిరాటేశాడు. కానీ రీప్లేలో మాత్రం వికెట్లను బంతితో కాకుండా గ్లౌస్‌తో పడగొట్టినట్టు అనిపించింది. చాలాసార్లు పరిశీలించాక చివరికి థర్డ్ అంపైర్ అవుట్‌గా ప్రకటించాడు. దీంతో అసంతృప్తిగా మైదానం వీడిన గిల్ డకౌట్ దగ్గర 'సరిగ్గా చూడడం రాదా' అన్నట్టుగా తన కళ్లను చూపెడుతూ టీవీ అంపైర్‌తో వాదనకు దిగడం కనిపించింది.

బౌలింగ్‌లో బ్రాడ్‌మన్

బుమ్రాపై గిల్లీ ప్రశంస



న్యూఢిల్లీ: భారత స్టార్ పేసర్ బుమ్రాను బౌలింగ్‌లో బ్రాడ్‌మన్‌గా అభివర్ణించవచ్చని ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ గిల్‌క్రిస్ట్ కొనియాడాడు. ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ బ్యాటర్‌గా సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్‌ను క్రీడా పండితులు పేర్కొంటారు. గాయం నుంచి కోలుకున్న బుమ్రా రాకతో ముంబై ఇండియన్స్ వరుస విజయాలతో దూసుకెళ్తోంది. రాజస్థాన్‌పై తన చివరి మూడు ఓవర్లలో తను కేవలం ఐదు పరుగులే ఇచ్చాడు. 'బుమ్రాను ఏ ఫార్మాట్‌లోనైనా ఉత్తమ బౌలర్‌గా చెప్పవచ్చు. పిచ్ ఎలాంటిదైనా మైదానంలో అతడి ప్రదర్శన చూస్తే బ్రాడ్‌మన్ గుర్తుకురాక మానదు. అందుకే అతడిని బౌలింగ్‌లో బ్రాడ్‌మన్‌గా చెప్పవచ్చు' అని గిల్లీ అన్నాడు.

ఆసియా జిమ్నాస్టిక్స్‌కు నిషిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సీనియర్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ ఆల్‌రౌండ్ విభాగంలో హైదరాబాద్ అమ్మాయి నిషిక అగర్వాల్ రజతంతో మెరిసింది. ఈ పతకంతో ఆసియా జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌కు కూడా నిషిక అర్హత సాధించింది. శుక్రవారం పుణెలో జరిగిన ఈ పోటీల్లో నిషిక 43.750 స్కోరుతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆసియా చాంపియన్‌షిప్ వచ్చే నెల 12 నుంచి 15వ తేదీ మధ్య కొరియాలో జరగనుంది.

శ్రీలంక విజయం

కొలంబో: మహిళల ముక్కోణపు టోర్నీలో ఆతిథ్య శ్రీలంకకు తొలి విజయం దక్కింది. శుక్రవారం దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో లంక 5 వికెట్ల తేడాతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 9 వికెట్లకు 235 పరుగులు చేసింది. డెరెక్సెన్ (61), లారా గూడాల్ (46) రాణించారు. మల్కి మడారాకు నాలుగు, విహంగకు మూడు వికెట్లు దక్కాయి. ఛేదనలో లంక జట్టు 46.3 ఓవర్లలో 237/5 స్కోరుతో నెగ్గింది. హర్షిత (77), కవిష (61) అర్ధసెంచరీలు సాధించారు.



తెరుచుకున్న కేదార్‌నాథ్ ఆలయం

కేదార్‌నాథ్, మే 2: ఛార్‌ధామ్ యాత్రలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు శుక్రవారం ఉదయం 7గంటలకు తెరుచుకున్నాయి. వివిధ దేశాల నుంచి తెప్పించిన 108 క్వింటాళ్ల వివిధ రకాల పూలతో ఆలయాన్ని అందంగా అలంకరించారు. శుక్రవారం ఉత్తరాఖండ్ సీఎం ధామీతో పాటు 12వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఛార్‌ధామ్ యాత్రలో భాగమైన గంగోత్రి, యమునోత్రి ఆలయాలు గత నెల 30న తెరుచుకోగా.. బద్రినాథ్ ఆలయ ద్వారాలు ఈ నెల 4 నుంచి తెరుచుకోనున్నాయి.

పొలంలో 453కిలోల బాంబు..నిర్వీర్యం చేసిన ఆర్మీ

అహల్యానగర్, మే 2: మహారాష్ట్రలోని ఓ పొలంలో 453 కిలోల భారీ బాంబు బయటపడింది. పేలే అవకాశం చాలా ఎక్కువగా ఉన్న ఆ బాంబును ఆర్మీ సిబ్బంది నిర్వీర్యం చెయ్యడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ బాంబు పేలి ఉంటే.. కిలోమీటరు పరిధిలోని ఇళ్లు, భవనాలన్నీ ధ్వంసమయ్యేవి. నాలుగు కిలోమీటర్ల మేర భూమి అదిరిపోయేది. అహల్యానగర్ జిల్లా వర్వాండి గ్రామంలోని తన పొలంలో పైపులు పగిలిపోగా రాజేందర్ అనే రైతు మార్చి 28న మరమ్మతులు చేపట్టాడు. ఇందులో భాగంగా భూమిని తవ్వగా బాంబు కనిపించింది. అయితే, బాంబును నిర్వీర్యం చేయడానికి అధికారిక అనుమతులు రావడానికి నెలరోజుల సమయం పట్టింది. ఈ నెలరోజులు బాంబు ఉన్న ప్రాంతంలోని ప్రజలను వేరే చోటికి తరలించారు.

ఎమ్మెల్యే పదవికి కర్ణాటక మంత్రి రాజీనామా

» యత్నాళ్‌పై పోటీకి సిద్ధమని శివానంద పాటిల్ ప్రకటన

బెంగళూరు, మే 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ విసిరిన సవాల్‌ను కర్ణాటక మంత్రి శివానంద పాటిల్ స్వీకరించారు. ఎమ్మెల్యే పదవికి శుక్రవారం రాజీనామా చేసి, యత్నాళ్‌పై పోటీకి సిద్ధమని ప్రకటించారు. మహ్మద్ ప్రవక్త పైగంబర్ గురించి బసనగౌడ పాటిల్ యత్నాళ్ చేసిన వ్యాఖ్యలను ఇటీవల శివానంద పాటిల్ తప్పుబట్టారు. దీనిపై రెండు రోజుల క్రితం యత్నాళ్ స్పందించారు. శివానంద పాటిల్..'పాటిల్' సామాజికవర్గానికి చెందిన వారు కాదని, రాజకీయ లబ్ధికోసమే పెట్టుకున్నారని ఆరోపించారు. దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి శుక్రవారంలోగా రాజీనామా చేసి, తనపై పోటీకి రావాలని సవాల్ విసిరారు.

ఉక్రెయిన్‌తో అమెరికా ఖనిజాల ఒప్పందం

వాషింగ్టన్, మే 2: ఉక్రెయిన్‌తో అమెరికా ఖనిజాల ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ఉక్రెయిన్‌లోని అరుదైన ఖనిజ సంపదను అమెరికా దక్కించుకోనుంది. ఒప్పందంలో ఇంధనం, సహజవాయువులు, హైడ్రోకార్బన్లు కూడా ఉన్నాయి. ఉక్రెయిన్‌లోని టైటానియం, యురేనియం, లిథియం, గ్రాఫైట్, మాంగనీస్ ద్వారా అమెరికాకు భారీగా ఆదాయం దక్కనుంది. అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఈ ఒప్పందంపై గట్టిగా పట్టుబట్టిన ట్రంప్ ఇక ఉక్రెయిన్-రష్యా శాంతి చర్చల విషయాన్ని పెద్దగా పట్టించుకోకపోవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. తాజా ఒప్పందం నేపథ్యంలో ఉక్రెయిన్‌కు అమెరికా నిరంతరం సైనిక సాయాన్ని కొనసాగించే అవకాశం ఏర్పడింది.

రిజర్వేషన్లపై 50% పరిమితిని తొలగించండి

(మొదటి పేజీ తరువాయి)

వెనుకబాటు తనాన్ని నిర్ధారించి రిజర్వేషన్లు ప్రకటించేందుకు వీలుగా రాజ్యాంగంలోని 15(5) అధికరణను సవరిస్తారో లేదో చెప్పాలని కోరింది. ఆర్థికంగా వెనుకబాటు తనాన్ని కూడా నిర్ణయించి పదిశాతం రిజర్వేషన్ కల్పించేందుకు 103వ రాజ్యాంగ సవరణను ఏ విధంగా అమలు చేస్తారో తెలియజేయాలని డిమాండ్ చేసింది. బిహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు మాత్రమే కులగణన జరిపిస్తామని ప్రకటించారని, నిజానికి ఆ విషయంలో మోదీ సర్కారుకు చిత్తశుద్ధి లేదని కాంగ్రెస్ నేతలు విమర్శించారు.



శుక్రవారం సీడబ్ల్యూసీ సమావేశంలో రాహుల్, ఖర్గే, సోనియా

గతంలో మా డిమాండ్‌ను వ్యతిరేకించారు..

కులగణనను డిమాండ్ చేసిన వారిని మోదీ గతంలో అర్బన్ నక్సల్స్‌గా అభివర్ణించారని, ఆర్ఎస్ఎస్ కూడా కులగణనను వ్యతిరేకించిందని సీడబ్ల్యూసీ గుర్తు చేసింది. కుల గణన ఎప్పుడు జరిపిస్తారో, ఎలా జరిపిస్తారో చెప్పకుండా రాజకీయ ప్రయోజనం పొందేందుకు ఉట్టి ప్రకటనలు చేయడంతో సరిపోదని పేర్కొంది. కులగణనను శాస్త్రీయంగా జరిపించాలని రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా డిమాండ్ చేశారని, తెలంగాణలో అన్నమాట ప్రకారం శాస్త్రీయంగా కులగణన జరిపించారని, ఈ విషయంపై వివిధ సామాజిక వర్గాల్లో చైతన్యం ఏర్పడుతుందని తెలిసినందువల్లే మోదీ సర్కారు దిగి వచ్చిందని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఒక రకంగా రాహుల్‌గాంధీ వల్లే మోదీ ప్రభుత్వం ఒత్తిడికి గురై కులగణనను జరిపించేందుకు దిగి వచ్చిందని వర్కింగ్ కమిటీలో నేతలు పేర్కొన్నారు. ఈ విషయంపై దేశవ్యాప్తంగా ప్రజల్లోకి వెళ్లి తెలియజేయాలని, వివిధ రంగాల్లో వెనుకబాటుతనాన్ని శాస్త్రీయంగా నిర్ధారించి వెనుకబడిన వర్గాలకు వారి వాటా వారికి లభించేంత వరకు కాంగ్రెస్ విశ్రమించకూడదని సీడబ్ల్యూసీ పిలుపునిచ్చింది. కాగా, సీడబ్ల్యూసీ భేటీలో సభ్యులకు తెలంగాణలో జరిపిన కులగణనకు సంబంధించి నివేదికలను అందజేశారు.

పహల్గాం దాడిపై చర్యలకు నిర్దిష్ట వ్యూహమేదీ?

పహల్గాం సంఘటనపై కూడా సుదీర్ఘంగా చర్చించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ.. ఇప్పటి వరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోకుండా ఎందుకు మౌనం పాటిస్తోందని ప్రశ్నించింది. ఇంకెంతకాలం వేచి చూస్తారని సమావేశంలో ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో ప్రభుత్వానికి పూర్తిగా మద్దతు ప్రకటించిందని, కానీ, ఇంతవరకు తమ రణనీతి ఏమిటో ప్రభుత్వం వెల్లడించలేదని పేర్కొంది. దేశ ఐక్యత, సమగ్రతకు ఏ సవాళ్లు ఎదురైనా వాటిపై పోరాడేందుకు తాము కలిసికట్టుగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ మరోసారి స్పష్టం చేసింది. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొంది. భారత్‌పైకి ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ దేశ సమగ్రతను, ఐక్యతను దెబ్బతీసేందుకు యత్నిస్తున్న పాక్ పట్ల కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వ్యూహంతో ధృడమైన చర్యలు తీసుకోవాలని, అంతర్జాతీయంగా పాకిస్థాన్‌ను ఒంటరిని చేసేలా సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించింది. భారత్ మొత్తం ఒక్కటిగా ఉందని, ఎవరూ విడదీయలేరనే సందేశాన్ని పాక్‌కు ఇవ్వాలని పేర్కొంది. ప్రతిపక్షం మొత్తం ప్రభుత్వం వెంటే ఉంటామని ప్రకటించినా ఇప్పటివరకు ప్రభుత్వం వద్ద నిర్దిష్ట వ్యూహమేదీ కనిపించడం లేదని ఏఐసీసీ చీఫ్ ఖర్గే అన్నారు. వర్కింగ్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు వంశీచందర్ రెడ్డి, కొప్పుల రాజు, రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, పళ్లం రాజు తెలుగు రాష్ట్రాల నుంచి పాల్గొన్నారు.

లోకం తీరు



21 ఏళ్లు.. 12 పెళ్లిళ్లు

వివాహమైన వెంటనే నగలు, నగదుతో పరార్

యూపీలో 'దొంగ పెళ్లి కూతురు' అరెస్టు

లఖ్‌నవూ, మే 2: గుజరాత్‌కు వెళ్తే ఆమె పేరు కాజల్, హరియాణాలో ఉంటే సీమా, బిహార్‌లో నేహా, ఉత్తరప్రదేశ్‌లో అయితే ఆమె పేరు స్వీటీ. అసలు పేరు మాత్రం గుల్షానా రియాజ్ ఖాన్. వయసు 21 ఏళ్లు. ఇప్పటికే 12 సార్లు పెళ్లిళ్లు చేసుకుంది. అందర్నీ మోసగించి ఉడాయించింది. అసలు భర్త రియాజ్ ఖాన్ ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్‌లో టైలర్‌గా పనిచేస్తున్నాడు. ఈ దొంగ పెళ్లిళ్ల వ్యవహారం అతడికి పూర్తిగా తెలుసు. ప్రతి పెళ్లికి 5% సొమ్మును కమీషన్‌గా కూడా తీసుకుంటున్నాడు. హడావిడిగా పెళ్లి సంబంధం కుదుర్చుకోవడం, ఘనంగా వివాహం చేసుకోవడం, పెళ్లి తంతు ముగిసిన కొద్ది గంటల్లోనే కిడ్నాప్ నాటకమాడి నగలు, నగదుతో పరారు కావడం ఆమెకు నిత్యకృత్యం. ఆ 'దొంగ పెళ్లి కూతురు' (డాకూ దుల్హన్) ఎట్టకేలకు గురువారం అంబేడ్కర్ జిల్లాలోని కసదాహ గ్రామంలో పోలీసులకు చిక్కింది. ఆమెతో పాటు ముఠాలోని మరో 8మందిని అరెస్టు చేశారు. ఈ ముఠాలో గుల్షనాతోపాటు అయిదుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. పలు రాష్ట్రాల్లో దొంగ పెళ్లిళ్ల రాకెట్‌ను ఆ ముఠా చాలా వ్యూహాత్మకంగా నిర్వహించింది. వివాహ వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాల ద్వారా ఎంతగా ప్రయత్నించినా కుమారులకు పెళ్లి చేయలేకపోతున్న కుటుంబాలను మొదట గుర్తించేది. మహిళలు వెళ్లి మాటలు కలిపి ఆ కుటుంబాల నమ్మకం పొందేవారు. గుల్షనాను సంబంధించిన నకిలీ పత్రాలు చూపించి సంబంధాన్ని ఓకే చేసుకునేవారు. సంబంధం కుదిర్చినందుకు 'సెటిల్‌మెంట్ అమౌంట్' కూడా మాట్లాడుకునేవారు. హడావిడిగా పెళ్లి ఏర్పాట్లు చేయించే వారు. పెళ్లి తంతు ముగియగానే మగవారు బైకులుపై వచ్చి ఆమెను 'కిడ్నాప్' చేసే వారు. నగదు, నగలు దక్కించుకునేవారు.

వేదికపై మోదీతో థరూర్

ఇక చాలామందికి నిద్ర లేని రాత్రులేనని 'ఇండీ' కూటమిని ఉద్దేశించి ప్రధాని విసుర్లు

తిరువనంతపురం, మే 2: తిరువనంతపురంలో విజింజమ్ పోర్టును ప్రధాని మోదీ శుక్రవారం లాంఛనంగా జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రధాని మోదీతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ వేదికను పంచుకొన్నారు. కేరళ సీఎం విజయన్ కూడా వేదికపై ఉన్నారు. ఈ నేపథ్యంలో సభలో మోదీ ప్రసంగిస్తూ.. థరూర్ తనతో వేదికపై ఉండడం చూసి చాలా మంది ఇండియా కూటమి నాయకులకు నిద్ర లేని రాత్రిళ్లు తప్పవని ఎద్దేవా చేశారు. హిందీలో ఆయన మాట్లాడిన మాటలను కచ్చితంగా అనువదించలేక అనువాదకుడు ఇబ్బందిపడ్డారు.



ప్రధాని వెంటనే స్పందిస్తూ.. సందేశం చేరాల్సిన వారికి చేరిపోయిందని చమత్కరించారు. థరూర్ అప్పుడప్పుడూ కాంగ్రెస్ వైఖరికి విరుద్ధంగా విజయన్ ప్రభుత్వ కార్యక్రమాలను, మోదీ ప్రభుత్వ విధానాలను ప్రశంసించడం.. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు, అధిష్ఠానం ఆయనపై అసంతృప్తిగా ఉండడం తెలిసిందే.

నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌లకు నోటీసులు

న్యూఢిల్లీ, మే 2: నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు శుక్రవారం ఇక్కడి ప్రత్యేక కోర్టు నోటీసులు పంపించింది. నేషనల్ హెరాల్డ్‌కు చెందిన స్థిరాస్తుల బదలాయింపులో మనీలాండరింగ్ జరిగిందని ఆరోపిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వారిపై కేసు నమోదు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే..నిందితులకు వాదన వినిపించే హక్కు ఉందని పేర్కొంటూ నోటీసులు జారీ చేశారు. ఏ దశలోనయినా వినిపించే హక్కు కలిగించడం న్యాయమైన విచారణకు ఊపిరిపోస్తుందని వ్యాఖ్యానించారు. తదుపరి విచారణను ఈ నెల ఎనిమిదో తేదీకి వాయిదా వేశారు. మూతపడిన నేషనల్ హెరాల్డ్ పత్రిక ఆస్తుల బదలాయింపులో కాంగ్రెస్ నాయకులు క్రిమినల్ కుట్రకు, ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ బీజేపీ నాయకుడు సుబ్రహ్మణ్యస్వామి 2014లో ప్రయివేటు క్రిమినల్ కంప్లయింట్ దాఖలు చేశారు. 2021 నుంచి ఈడీ దీనిపై దర్యాప్తు చేస్తోంది.



రోడ్డుపై ఫైటర్ జెట్ల ల్యాండింగ్, టేకాఫ్

» గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాయుసేన విన్యాసాలు

న్యూఢిల్లీ, మే 2: భారత్-పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఉత్తరప్రదేశ్‌లోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై యుద్ధ విమానాల టేకాఫ్, ల్యాండింగ్ సామర్థ్యాన్ని భారత వాయుసేన పరిశీలించింది. యుద్ధం లేదా, జాతీయ అత్యవసర పరిస్థితుల్లో యుద్ధ విమానాలు, ఫైటర్ జెట్లు రహదారిపై టేకాఫ్, ల్యాండింగ్ అయ్యేందుకు వీలుగా యూపీలోని షాజహాన్‌పూర్ జిల్లాలో గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై 3.5 కిలోమీటర్ల పొడవైన ఎయిర్‌స్ట్రిప్‌ను నిర్మించారు. అత్యాధునిక లైటింగ్, నావిగేషన్ వ్యవస్థలు ఉన్న దీనిపై పగలు, రాత్రి ఎప్పుడైనా యుద్ధ విమానాలను ల్యాండింగ్, టేకాఫ్ చేయవచ్చు. ఇలా ఉదయం-రాత్రి ల్యాండింగ్, టేకాఫ్ చేసే వీలున్న హైవే ఎయిర్‌స్ట్రిప్ భారత్‌లో ఇదే మొదటిది. అలాగే.. ఉత్తరప్రదేశ్‌లోని హైవేలపై నిర్మించిన ఎయిర్‌స్ట్రిప్‌ల్లో ఇది నాలుగోది. గతంలో ఆగ్రా-లఖ్‌నవూ ఎక్స్‌ప్రెస్‌వే, పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వే, బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్‌వేలపై కూడా రన్‌వేలు నిర్మించారు. తాజాగా గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై జలాలాబాద్ వద్ద నిర్మించిన రన్‌వేను శుక్రవారం ప్రారంభించిన వాయుసేన ఉదయం, రాత్రి వేళ రెండు దశల్లో దీన్ని పరిశీలించింది. ఈ క్రమంలో చేపట్టిన విన్యాసాల్లో రాఫెల్, సుఖోయ్-30 ఎంకేఐ, మిరాజ్-2000, మిగ్-29, జాగ్వార్, సీ-130జే సూపర్ హెర్క్యులస్, ఏఎన్-32 యుద్ధ విమానం, ఎంఐ-17 వీ5 హెలికాప్టర్లు పాల్గొన్నాయి.

ఆయుధ కర్మాగారాల సిబ్బంది సెలవుల రద్దు

న్యూఢిల్లీ, మే 2: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా ఉన్న 41 ఆయుధ కర్మాగారాలు, 7 ఆయుధ డిపోల్లో సిబ్బందికి సెలవులు రద్దు చేసింది. దేశ భద్రతా చర్యల్లో భాగంగా ఈ అత్యవసర ఆదేశాలు తక్షణమే అమలు చేయాలని సూచించింది. ఉద్యోగులంతా తప్పనిసరిగా విధులకు హాజరుకావాలని ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. మరోవైపు అన్ని కర్మాగారాలు, డిపోల్లో రానున్న నెలలకు సరిపడా ఆయుధ నిల్వలున్నాయని, అవసరమైతే ఉత్పత్తి పెంచడానికి సిద్ధంగా ఉన్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. సరిహద్దులకు సరిపడా ఆయుధాలను తరలించినట్లు తెలిపాయి.

పత్రాలను పరిశీలించాకే నిర్ణయం తీసుకోండి

పాక్‌లో పుట్టి శ్రీనగర్‌లో స్థిరపడ్డ కుటుంబానికి సుప్రీం ఊరట

న్యూఢిల్లీ, మే 2: భారత్‌ను వీడాల్సిన ఓ పాకిస్థానీ కుటుంబానికి సుప్రీంకోర్టు ఊరట కల్పించింది. బెంగళూరులో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న అహ్మద్ తారిక్ భట్, ఆయన కుటుంబ సభ్యులు ఆరుగురిని దేశం విడిచి వెళ్లాలని అధికారులు ఆదేశించారు. భట్ బెంగళూరులో ఉంటుండగా.. ఆయన కుటుంబం జమ్మూకశ్మీరులోని శ్రీనగర్‌లో ఉంటోంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత కేంద్ర ప్రభుత్వం పాకిస్థానీల వీసాలు రద్దు చేసిన సంగతి తెలిసిందే. దీంతో శ్రీనగర్‌కు చెందిన భట్ కుటుంబం కూడా పాకిస్థాన్ వెళ్లిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో భట్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్‌కే సింగ్ ధర్మాసనం శుక్రవారం వాదనలు విన్నది. తమవద్ద భారత ప్రభుత్వం ఇచ్చిన ఆధార్, పాన్, ఓటర్ ఐడీతో పాటు పాస్‌పోర్టు ఉన్నాయని భట్ సుప్రీంకోర్టుకు తెలిపారు. స్పందించిన ధర్మాసనం.. "ఈ కుటుంబాన్ని పాక్ పంపించే అంశంలో అధికారులు నిర్ణయం తీసుకునే ముందు వారు చూపుతున్న పత్రాలను తనిఖీ చేయాలి" అని ఆదేశించింది. అధికారుల నిర్ణయంతో సంతృప్తి చెందకపోతే పిటిషనర్లు జమ్మూకశ్మీర్ హైకోర్టును ఆశ్రయించవచ్చని సూచించింది.

10రోజులు..10లక్షల సైబర్ దాడులు

(మొదటి పేజీ తరువాయి)

నగ్రోటా, సుంజువన్ ఆర్మీ పబ్లిక్ స్కూళ్లపై, విశ్రాంత సైనికుల హెల్త్‌కేర్ సర్వీసెస్ వెబ్‌సైట్లపై సైబర్ దాడులు జరిగాయి. జమ్మూ మున్సిపల్ కార్పొరేషన్ వెబ్‌సైట్‌ను కూడా హ్యాక్ చేసి కీలకమైన సమాచారాన్ని తస్కరించినట్టు సమాచారం. కాగా, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు చెందిన యూట్యూబ్ చానల్‌ను భారత్‌లో నిషేధిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇంతకుముందే పాక్ ప్రధాన టీవీ చానళ్లు, మీడియా సంస్థలకు చెందిన 16 యూట్యూబ్ చానళ్లనూ నిలిపివేసింది.

పాక్ ఉగ్రవాద చరిత్రలో రహస్యమేమీ లేదు: బిలావల్

న్యూఢిల్లీ, మే 2: పాకిస్థాన్ ఉగ్రవాద చరిత్ర అంత రహస్యమేమీ కాదని.. ఏనాటి నుంచో దశలు, దశలుగా కొనసాగుతూ వస్తోందని ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో అంగీకరించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "మొదటి ఆఫ్ఘన్ యుద్ధం సమయంలో ముజాహిదీన్‌లకు ఆర్థికంగా, నైతికంగా తోడ్పాటు ఇచ్చాం. పశ్చిమ దేశాలతో కలసి ఆ పనిచేశాం. తర్వాత దశలు దశలుగా అది కొనసాగింది. దానితో ఇబ్బందిపడ్డాం. ఇటీవలి కాలంలో పరిస్థితిలో మార్పు వచ్చింది. అది మా దేశ చరిత్రలో దురదృష్టకర భాగం. కానీ మేం దాని నుంచి పాఠాలు నేర్చుకున్నాం." అని పేర్కొన్నారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో భుట్టో వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

అటారీ-వాఘా సరిహద్దును మరోసారి తెరిచిన పాక్

శ్రీనగర్, మే 2: అటారీ-వాఘా సరిహద్దును బుధవారం మూసేసిన పాకిస్థాన్ శుక్రవారం మరోసారి తెరిచింది. భారత్ నుంచి పాకిస్థాన్ వెళ్లిపోయేందుకు చెక్‌పోస్ట్ వద్ద వేచి ఉన్న తమ జాతీయులను తిరిగి అనుమతిస్తోంది. మొత్తం 71 మంది పాక్ జాతీయులు చెక్‌పోస్ట్ వద్ద ఎదురుచూస్తున్నారు. భారత్ విధించిన గడువు ఏప్రిల్ 30 నాటికి మొత్తం 911 మంది పాకిస్థానీలు భారత్ వీడారు. అయితే భారత్ ఆ గడువును నిరవధికంగా పొడిగించింది.

మూడు సంస్థల.. ముష్కర దాడే!

» పహల్గాం ఘటన వెనుక లష్కరేతో పాటు పాక్ ఆర్మీ, ఐఎస్ఐ హస్తం

» ప్రాథమిక దర్యాప్తులో తేల్చిన ఎన్ఐఏ!



యూపీలోని గంగా ఎక్స్‌ప్రెస్ హైవేపై శుక్రవారం భారత సైనికుల విన్యాసాలు

న్యూఢిల్లీ, మే 2: పహల్గాం ఉగ్రదాడి ఘటనపై దర్యాప్తు చేపట్టిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ).. లష్కరే తాయిబా ఉగ్రవాద సంస్థతోపాటు పాక్ ఆర్మీ, ఆ దేశ నిఘా సంస్థ ఐఎస్ఐల హస్తం ఉన్నట్టుగా తేల్చింది. పాక్ ఆర్మీ, ఐఎస్ఐల ఆదేశాల మేరకే.. లష్కరే తాయిబా సంస్థ ప్రధాన కార్యాలయంలోనే ఈ దాడికి ప్రణాళిక రచించినట్టు అంచనా వేసింది. ఎన్ఐఏ ప్రాథమిక దర్యాప్తు నివేదికలో ఈ వివరాలను పొందుపర్చినట్టు తెలిసింది. రక్షణ శాఖ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ ఆంగ్ల మీడియా సంస్థలు ఈ వివరాలను వెల్లడించాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా.. ఉగ్రవాదులకు స్థానికంగా సహకారం అందించిన పలువురిని ఎన్ఐఏ అదుపులోకి తీసుకుని ప్రశ్నించింది. ఈ క్రమంలోనే పహల్గాం ఉగ్రదాడిలో కీలకంగా వ్యవహరించిన ఇద్దరు పాకిస్థాన్ ఉగ్రవాదులు హష్మి మూసా (అలియాస్ సులేమాన్), అలీభాయ్ (అలియాస్ తల్హా భాయ్).. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద నేతలతో సంప్రదింపులు జరిపినట్టుగా గుర్తించింది.

ఘటనా స్థలం త్రీడీ మ్యాపింగ్..

ఉగ్రదాడి జరిగిన బైసరన్ ప్రాంతంలో అత్యాధునిక సాంకేతికత ఆధారంగా ఎన్ఐఏ పరిశీలన జరిపింది. మొత్తంగా 40 తూటా కాట్రిడ్జ్‌లను గుర్తించి, ఫోరెన్సిక్ రసాయన విశ్లేషణకు పంపింది. లైడార్ పరిజ్ఞానం, డ్రోన్ల వీడియోలు, శాటిలైట్ చిత్రాల సాయంతో ఘటనా స్థలం మొత్తాన్ని త్రీడీ మ్యాపింగ్ చేసి.. ఉగ్రవాదులు రాక, దాడి, తిరిగి పారిపోయిన అంశాలపై ఆధారాలను సిద్ధం చేసింది. అదే సమయంలో ఘటనకు ముందు, తర్వాత బైసరన్, పరిసర ప్రాంతాల్లో శాటిలైట్ ఫోన్ల వినియోగం వివరాలను సేకరించింది. మొత్తం మూడు శాటిలైట్ ఫోన్లు వినియోగించినట్టు గుర్తించగా, ఇప్పటివరకు అందులో రెండింటి సిగ్నళ్లను గుర్తించి, విశ్లేషించింది. పహల్గాం ఘటనకు సంబంధించి ఎన్ఐఏ, ఇతర భద్రతా సంస్థలు కలిసి కుప్వారా, పుల్వామా, సపోర్, అనంత్‌నాగ్, బారాముల్లా తదితర జిలాల్లో విస్తృతంగా తనిఖీలు చేసి, 2,800 మందికిపైగా ప్రశ్నించినట్టు తెలిసింది. ఇందులో 150 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని లోతుగా విచారిస్తున్నట్టు సమాచారం. మరోవైపు దాడి చేసి పారిపోయిన ఉగ్రవాదుల కోసం వేట కొనసాగుతోంది. వారు దట్టమైన అడవుల్లో దాక్కున్నారని భద్రతా బలగాలు తెలిపాయి.

రెండు నెలలకు సరిపడా.. ఆహారం నిల్వ చేసుకోండి

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) ప్రజలు రెండు నెలలకు సరిపడా ఆహార పదార్థాలను నిల్వ చేసుకోవాలని అక్కడి ప్రభుత్వం సూచించింది. 'పహల్గాం' నేపథ్యంలో భారత్ ఏ క్షణమైనా దాడికి దిగవచ్చనే ఆందోళనతో ఈ పిలుపునిచ్చింది. పీఓకే ప్రధాని చౌదరి అన్వరుల్ హక్ శుక్రవారం స్థానిక అసెంబ్లీలో ఈ విషయాన్ని వెల్లడించినట్టు అరబ్ న్యూస్ వార్తాసంస్థ తెలిపింది. ముఖ్యంగా నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంట ఉన్న 13 నియోజకవర్గాల ప్రజలకు ఇప్పటికే ఈ సూచన చేసినట్టుగా అన్వరుల్ చెప్పారని.. ఆహారం, మందులు, ఇతర అవసరాల కోసం వంద కోట్ల పాక్ రూపాయలతో అత్యవసర నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారని వెల్లడించింది.

ఆర్థిక దిగ్బంధనంలో పాక్!

» ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో పాకిస్థాన్‌ను తిరిగి చేర్చేలా భారత్ యత్నాలు

న్యూఢిల్లీ, మే 2: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ లక్ష్యంగా పలు కఠిన చర్యలు తీసుకుంటున్న కేంద్రప్రభుత్వం.. ఆర్థిక పరమైన దిగ్బంధనం దిశగానూ అడుగులు వేస్తోంది. ముఖ్యంగా, సీమాంతర ఉగ్రవాదానికి ఆ దేశం ఎంతమాత్రమూ మద్దతివ్వకుండా ఉండేలా.. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ద్వారా ఆంక్షలు విధింపజేయాలని యోచిస్తోంది. దీంట్లోభాగంగా.. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) లోని ఇతర సభ్యదేశాలతో సంప్రదింపులు జరపాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. పాక్‌ను తిరిగి ఎఫ్ఏటీఎఫ్ 'గ్రే లిస్టు'లో పెట్టేలా భారత్ పావులు కదుపుతోంది. ఈ ప్రయత్నాలు ఫలిస్తే.. పాకిస్థాన్ ఆర్థిక కార్యకలాపాలపై నిఘా పెరుగుతుంది. ఫలితంగా ఆ దేశానికి విదేశీ పెట్టుబడులు తగ్గుతాయి. ఎఫ్ఏటీఎఫ్ ప్లీనరీ ఏటా మూడుసార్లు (ఫిబ్రవరి, జూన్, అక్టోబరులో) సమావేశమవుతుంది. వచ్చే జూన్‌లో జరిగే ప్లీనరీలో పాక్‌ను గ్రే లిస్టులో పెట్టే ప్రతిపాదనను భారత్.. సభ్యదేశాల ముందు ఉంచనుంది. మరోవైపు, పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ ఇవ్వనున్న రూ.59,000 కోట్ల ఆర్థిక ప్యాకేజీపైనా గట్టిగా స్పందించాలని కేంద్రం భావిస్తోంది. ఈ భారీ ప్యాకేజీ ఉగ్రసంస్థల కార్యకలాపాలకు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందని, కాబట్టి, ఆ సాయాన్ని నిలిపివేయాలని ఐఎంఎఫ్‌ను కోరే అవకాశం ఉంది.

'పహల్గాం'పై అమెరికా డబుల్ గేమ్!

న్యూఢిల్లీ, మే 2: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో గత నెలలో జరిగిన ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో అమెరికా వ్యవహరిస్తున్న తీరు విస్మయం కలిగిస్తోంది. ఒకవైపు భారత్‌కు అన్ని విధాలా మద్దతు ప్రకటిస్తున్నామని చెబుతూనే.. మరోవైపు అధ్యక్షుడు ట్రంప్ సహా ఇతర నేతలు చేస్తున్న వ్యాఖ్యలు డబుల్ గేమ్‌ను తలపిస్తున్నాయని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత్, పాకిస్థాన్‌లు సంయమనం పాటించాలని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇంటెలిజెన్స్ చీఫ్ తుల్సి గబ్బార్డ్ మాత్రం ఉగ్రవాదుల ఏరివేతలో భారత్‌కు పూర్తి మద్దతుగా నిలుస్తామని చెబుతున్నారు. వాస్తవానికి ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు ట్రంప్ 2.0 ప్రభుత్వం బలమైన సంకేతాలు పంపిస్తుందని భావించినా.. ప్రస్తుతం అనుసరిస్తున్న తటస్థ వైఖరి రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశం అయిందని నిపుణులు చెబుతున్నారు. కశ్మీర్ వివాదానికి సంబంధించి మధ్యవర్తిత్వం చేస్తానని తన తొలి పాలనలో ప్రకటించిన ట్రంప్.. "కశ్మీర్ విషయాన్ని ఆ రెండు దేశాలే ఏదో ఒక మార్గంలో పరిష్కరించుకుంటాయి. నాకు భారత్, పాకిస్థాన్‌లు రెండూ దగ్గరే. వారే ఏదో ఒక మార్గం ఎంచుకుంటారు." అని గత వారం వ్యాఖ్యానించారు. భద్రతా సంబంధిత మినహాయింపుల్లో భాగంగా ఇటీవల 5.3 బిలియన్ డాలర్లను మంజూరు చేశారు. అదేవిధంగా ఎఫ్-16 యుద్ధ విమానాల నిర్వహణ కోసం 400 మిలియన్ డాలర్లకు ఆమోదం తెలిపారు. చిత్రం ఏంటంటే.. తన తొలిపాలనలో పాకిస్థాన్‌పై ట్రంప్ తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. ఉగ్రవాదులకు ఆ దేశం స్వర్గధామంగా మారిందని సంచలన వ్యాఖ్యలు చేయడంతోపాటు 1.3 బిలియన్ డాలర్ల భద్రతా సాయాన్ని నిలుపుదల చేశారు.

భారత్‌కు సంయమన మంత్రం

పహల్గాం ఉగ్రదాడిపై స్పందించిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్.. సంయమనం పాటించాలని సూచించారు. నిజానికి పహల్గాం ఉగ్రదాడి జరిగి, 26 మంది మృతి చెందిన సమయంలో ఆయన కుటుంబంతో సహా భారత్‌లోనే ఉన్నారు. అయినప్పటికీ ఆయన భారత్ సంయమనం పాటించాలని చెప్పడం గమనార్హం. ఇదేసమయంలో "పాక్ తన బాధ్యత మేరకు నడుచుకోవాలి." అని ఊరుకున్నారు. కాగా, భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రికతత నేపథ్యంలో పరిస్థితులపై చర్చించడానికి ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి త్వరలో సమావేశం కానుంది.

భారత్ యుద్ధాన్ని నివారించాలి: వాన్స్

పహల్గాం దాడికి ప్రతీకారంగా యుద్ధానికి దిగాలని భావిస్తే.. భారత్ దానిని నివారించాలని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్యానించారు. ఫాక్స్ న్యూస్‌తో ఆయన మాట్లాడుతూ.. ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చర్యలు తీసుకున్నప్పటికీ.. అది విస్తృత సంఘర్షణలకు దారితీయని భావిస్తున్నట్టు తెలిపారు. "పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులను గుర్తించే క్రమంలో భారత్‌కు ఆ దేశం సహకరించాలి. ఈ విషయంలో పాక్ సహకరిస్తుందనే ఆశిస్తున్నాం" అని వాన్స్ అన్నారు.

సింగరేణిని కాపాడుకోవాలి: భట్టి


కారుణ్య ఉద్యోగం పొందిన వ్యక్తికి పత్రం అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): "పోటీ మార్కెట్లో ఇతరులను తట్టుకొని సింగరేణి నిలవాల్సిన పరిస్థితి ఉంది. దీనికోసం సింగరేణి కార్మికులు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటూ పూర్తి పనిగంటలు విధులు నిర్వర్తిస్తూ సంస్థను కాపాడుకోవాలి. భవిష్యత్తు తరాలకు దీన్ని ఒక వారసత్వంగా అందించాలి" అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ఆయన సింగరేణిలో కారుణ్య నియామకాల వయో పరిమితిని 35ఏళ్ల నుంచి 40ఏళ్లకు పెంచడం వల్ల లబ్ధి పొందిన 21 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుణ్య ఉద్యోగాల్లో గరిష్ఠ వయో పరిమితిని 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచాలని కార్మికులు, కార్మిక సంఘాలు కోరగా.. తక్షణమే మానవతా దృక్పథంతో స్పందించి అంగీకారం తెలిపామన్నారు.

నేతన్నలకూ రుణమాఫీ: తుమ్మల



యాదాద్రి/ఖమ్మం, మే 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు రుణమాఫీ చేసినట్లుగానే, నేతన్నలకు కూడా రుణమాఫీ చేస్తామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. చేనేత వర్గాల సమస్యలపై క్యాబినెట్‌లో చర్చించి, త్వరలోనే విధివిధానాలు ఖరారు చేయనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో చేనేత సదస్సులో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో రూ.8.50 కోట్లతో నిర్మించనున్న అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్ పనులకు, రూ.50లక్షలతో నిర్మిస్తున్న టేబుల్ టెన్నిస్ ఇండోర్ హాల్ భవన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నా, ఎన్ని అవాంతరాలు ఎదురైనా రైతులు, నేతన్నల సంక్షేమాన్ని విస్మరించేది లేదని చెప్పారు.

మళ్లీ సీడబ్ల్యూసీకి 'పాలమూరు' డీపీఆర్

» అధికారులకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశం



హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)కు మళ్లీ పంపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మైనర్ ఇరిగేషన్‌లో మిగిలిన 45 టీఎంసీలు, బచావత్ ట్రిబ్యునల్ వెసులుబాటులో దక్కిన 45 టీఎంసీలు కలిపి 90 టీఎంసీలతో డీపీఆర్‌ను ఈనెల 6 లేదా 7వ తేదీన దాఖలు చేయాలని భావిస్తోంది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జలసౌధలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అనుమతులపై ఆరా తీశారు. ఇందుకు స్పందించిన అధికారులు మైనర్ ఇరిగేషన్‌లో 45 టీఎంసీలు ఏ విధంగా మిగిలాయనే దానిపై లెక్కలు సక్రమంగా లేవని, పోలవరం ప్రాజెక్టు వల్ల దక్కిన 45 టీఎంసీలపై ఉమ్మడి ఏపీకే అధికారాలు ఉన్నాయని, ట్రిబ్యునల్ తేల్చేదాకా ఈ నీటిపై ఏ రాష్ట్రానికి అధికారాలు రావని సీడబ్ల్యూసీ డీపీఆర్‌ను వెనక్కి పంపిందని తెలిపారు. సీడబ్ల్యూసీ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని మైనర్ ఇరిగేషన్‌లో 45 టీఎంసీల నీటిపొదుపుపై శాస్త్రీయంగా లెక్కలు తీశామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును ఏపీ అవసరాల కోసం కడుతున్నందున.. సాగర్ ఎగువన తెలంగాణ మాత్రమే ఉందని, ఈ లెక్కన 45 టీఎంసీలపై పూర్తి అధికారం తెలంగాణకే ఉందని అధికారులు వెల్లడించారు. దాంతో 90 టీఎంసీలతో డీపీఆర్‌ను దాఖలు చేసి, అనుమతులు సాధించాలని మంత్రి ఆదేశించారు.

టీజీఎండీసీ ఎండీగా సుశీల్ కొనసాగింపు

» తమకు పదోన్నతి రావడం లేదంటున్న జీఎంలు

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్(వీసీ అండ్ ఎండీ)గా రిటైర్డు అధికారి బీఆర్‌వీ సుశీల్‌కుమార్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి సుశీల్‌కుమార్ గనులు, భూగర్భ వనరుల శాఖ సంచాలకులుగా 2024 ఆగస్టు 31న రిటైర్ అయ్యారు. ఆయన్ను టీజీఎండీసీ ఎండీగా అదే సంవత్సరం అక్టోబరులో ప్రభుత్వం నియమించింది. సీఎస్ ఉత్తర్వుల నేపథ్యంలో ఆయన్ను కొన్ని రోజుల పాటు పోస్టు నుంచి తొలగించారు. అనంతరం తిరిగి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయమై ఖనిజాభివృద్ధి సంస్థలో చర్చ సాగుతోంది. టీజీఎండీసీలో మొత్తం ఐదు జనరల్ మేనేజర్ పోస్టులున్నాయి. ఇందులో సీనియర్ జీఎం ఎండీగా పదోన్నతి పొందే అవకాశం ఉంది. కానీ.. సుశీల్‌కుమార్‌ను కొనసాగిస్తుండడంతో తమకు పదోన్నతి అవకాశం రావడం లేదని వారు వాపోతున్నారు.

హైడ్రా పోలీస్‌స్టేషన్.. 8న ప్రారంభించనున్న సీఎం

హైదరాబాద్ సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) పోలీస్‌స్టేషన్ సిద్ధమైంది. బుద్ధభవన్‌లోని బీ బ్లాక్‌లో ఏర్పాటుచేసిన పోలీస్‌స్టేషన్‌ను 8న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఏసీపీ స్థాయి అధికారి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఉండే స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది ఉంటారు.

న్యాయవాదుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

» సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం: శ్రీధర్ బాబు



హైదరాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. న్యాయవాదుల భద్రత కోసం ఇటీవలే 'ప్రొటెక్షన్ యాక్ట్'ను చట్టం చేశామని.. త్వరలోనే దాన్ని అమల్లోకి తెస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన అడ్వొకేట్స్ సొసైటీ రజతోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. న్యాయవాదుల సంక్షేమం కోసం మరో రూ.100కోట్లు కేటాయించే విషయమై సీఎంను కోరనున్నట్లు తెలిపారు. అనారోగ్యం పాలైన, చనిపోయిన లాయర్ల కుటుంబాలకు న్యాయవాదుల సొసైటీ అండగా నిలుస్తుండటాన్ని ప్రశంసించారు. తాను కొన్ని అనివార్య పరిస్థితుల్లో రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందని లేకపోతే హైకోర్టులో అడ్వొకేట్‌గా ప్రాక్టీసు చేస్తుండేవాడినన్నారు. ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి న్యాయవాదుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. అంతకుముందు ఆయన ఎమ్మెల్యేలతో కలిసి సొసైటీ సిల్వర్ జూబ్లీ సావనీర్‌ను ఆవిష్కరించారు.

ఏపీ భవన్‌కు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఏపీ భవన్‌కు శుక్రవారం రాత్రి బాంబు బెదిరింపు వచ్చింది. భవన్‌లోని ఆడిటోరియంలో బాంబు పెట్టామంటూ గుర్తు తెలియని దుండగుడు ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్‌కు మెయిల్ చేశాడు. శుక్రవారం రాత్రి 8.30 గంటలకు ఏపీ భవన్‌లోని అంబేడ్కర్ ఆడిటోరియంలో 'పూలే' జీవితకథ ఆధారంగా నిర్మించిన సినిమాను ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా ఈ మెయిల్ వచ్చింది. ఆ సమయంలో కమిషనర్ ముంబైలో ఉన్నారు. వెంటనే భవన్ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో భవన్‌లో భద్రతా విధులు నిర్వర్తిస్తున్న తెలుగు రాష్ట్రాల పోలీసులు, ఢిల్లీ పోలీసులతో కలిసి గంటకుపైగా తనిఖీలు నిర్వహించారు. అక్కడ బాంబు ఏమీ లేదని తేల్చారు.

అండగా నిలుస్తా..



ఊ(మొదటిపేజీ తరువాయి)

జీడీపీని అమరావతి ఎక్కడికి తీసుకెళుతుందో ఊహించగలనని ప్రధాని అన్నారు. ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అమరావతి, ఏపీ అభివృద్ధికి భుజం కలిపి నడుస్తానని భరోసా ఇచ్చారు. ప్రధాని ప్రసంగంలోని ముఖ్యాంశాలు... ఆయన మాటల్లోనే!

భవిష్యత్ నగరం...

ఆంధ్రప్రదేశ్ ప్రజలారా... అమరావతి ఇంద్రలోకపు రాజధాని. ఇప్పుడు... అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధాని. ఇది యాదృచ్ఛికం కాదు. స్వర్ణాంధ్ర నిర్మాణానికి శుభ సంకేతం. అమరావతి పుణ్యభూమిపై నిలబడిన ఈ క్షణం నాకు భవిష్యత్ నగరం కనిపిస్తోంది. ఒక కొత్త అమరావతి, ఒక కొత్త ఆంధ్రప్రదేశ్ కనిపిస్తున్నాయి. ఒక వైపు బౌద్ధవారసత్వ శాంతి.. మరోవైపు వికసిత్ భారత్‌ను నిర్మించుకునే శక్తి అమరావతిలో ఉన్నాయి. ఇప్పుడు దాదాపు రూ.60వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఇవి కేవలం కాంక్రీట్ నిర్మాణాలు కావు. ఏపీ ప్రజల ఆకాంక్షలు, వికసిత్ భారత్ ఆశలకు బలమైన పునాదులు. భగవాన్ వీర భద్రస్వామి, అమర లింగేశ్వరుడు, తిరుపతి బాలాజీ పాదాలకు ప్రణవిల్లుతూ... ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలియచేస్తున్నా. 2015లో ప్రజా రాజధాని అమరావతికి శంకుస్థాపన చేసే అవకాశం నాకు లభించింది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం అమరావతికి మద్దతు ఇచ్చింది. మౌలిక సదుపాయాల కల్పనకు అన్ని చర్యలు తీసుకున్నాం. చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత... దుష్ట గ్రహాలు తొలగి పోయాయి. అభివృద్ధి పనుల్లో వేగం పుంజుకుంది. నాడు ఎన్టీఆర్ వికసిత ఆంధ్రప్రదేశ్ గురించి కలగన్నారు. ఇప్పుడు దానిని సాకారం చేయాలి. ఆంధ్రప్రదేశ్‌ను, అమరావతిని వికసిత్ భారత్‌కు గ్రోత్ ఇంజిన్‌లా మార్చాలి. చంద్రబాబు గారు, బ్రదర్ పవన్ కల్యాణ్ ఇది మనము చేయాలి. ఇది మనమే చేయాలి! పదేళ్లలో భారతదేశంలో భౌతిక, సాంకేతిక, సామాజిక మౌలిక సదుపాయాలు ఎంతగానో పెరిగాయి. దాని ఫలాలు ఆంధ్రప్రదేశ్‌కూ లభిస్తున్నాయి. నేడు రాష్ట్రానికి వేల కోట్ల విలువైన రైల్వే రహదారి ప్రాజెక్టులు లభించాయి. ఇప్పుడు చేపట్టిన ప్రాజెక్టుల వల్ల ఆంధ్రప్రదేశ్‌లో వేలాదిమంది యువతకు ఉపాధి లభిస్తుంది.

పది రెట్లు పెరిగిన 'రైల్వే నిధులు'

ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందిన దేశాలన్నీ రైల్వేకు ప్రాధాన్యం ఇచ్చినవే. గత పదేళ్లలో మేమూ రైల్వే అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చాం. ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం రికార్డుస్థాయిలో నిధులు కేటాయించింది. 2009-14 మధ్య తెలంగాణతో కలిసి ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వే ప్రాజెక్టులకు కేవలం రూ.900 కోట్లు ఇచ్చారు. ఇప్పుడు... నవ్యాంధ్రకు మాత్రమే రైల్వే బడ్జెట్ 9వేల కోట్లు దాటింది. కేంద్రం ఇచ్చిన నిధులతో ఏపీలో రైల్వే వందశాతం విద్యుదీకరణ జరిగిపోయింది. రాష్ట్రానికి 8 వందేభారత్ రైళ్లు వచ్చాయి. 'అమృత్ భారత్' రైలు కూడా వస్తుంది..

రైతులకు అండగా ఎన్డీయే

'వికసిత్ భారత్'కు పేదలు, రైతులు, యువకులు, మహిళలు... నాలుగు స్తంభాలని ఎర్రకోటపై నుంచి ఉద్ఘాటించాను. రైతులకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. పదేళ్లలో ఎరువుల కోసం 12 లక్షల కోట్ల భారం భరించాం. పంటల బీమా కింద ఏపీ రైతులకే రూ.5500 కోట్లు పరిహారం చెల్లించాం. పీఎం కిసాన్ నిధి సమ్మాన్ ద్వారా రాష్ట్ర రైతుల ఖాతాల్లో 17,500 కోట్లు జమ చేశాం. ప్రతి ఎకరాకూ నీరు అందాలన్నదే మా లక్ష్యం. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వేగం పుంజుకుంది. ఈ ప్రాజెక్టు వేగంగా పూర్తయ్యేలా కేంద్రం పూర్తి మద్దతు ఇస్తుంది. దేశాన్ని అంతరిక్ష శక్తిగా మార్చడంలో దశాబ్దాలుగా ఏపీ కీలక పాత్ర పోషిస్తోంది. శ్రీహరికోట నుంచి నింగికెగిసే ప్రతి రాకెట్ కోట్లాదిమంది భారతీయులను గర్వపడేలా చేస్తుంది. ఇప్పుడు... దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేసే కొత్త సంస్థ ఏపీలో ఏర్పాటవుతోంది. అదే... నాగాయలంక మిసైల్ టెస్టింగ్ రేంజ్! 'నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్'... దుర్గామాతలాగా దేశ రక్షణకు కొత్త శక్తినిస్తుంది.

విశాఖలో ఏకతా మాల్

ఇప్పుడు భారతదేశ శక్తి... ఆయుధాల్లో మాత్రమే లేదు. మన ఐక్యతలో కూడా ఉంది. ఇదే భావనతో... దేశవ్యాప్తంగా 'ఏకతా మాల్స్' ఏర్పాటు చేస్తున్నాం. విశాఖలో ఒకటి నిర్మిస్తున్నాం. దేశవ్యాప్తంగా ఉన్న హస్తకళాకారుల ఉత్పత్తులు ఒకే చోట అందుబాటులోకి వస్తాయి. 'జూన్ 21'ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించి ఈ ఏడాదికి పదేళ్లు అవుతోంది. ఈ అంశాన్ని చంద్రబాబు ప్రస్తావించారు. ఈ ఏడాది ప్రధాన కార్యక్రమాన్ని ఏపీలో నిర్వహించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆ రోజు నేను విశాఖపట్నం వస్తాను. మీ అందరితో కలిసి యోగా చేస్తాను. ఈసారి జూన్ 21వ తేదీన ప్రపంచమంతా ఏపీ వైపు చూస్తుంది.

> నాడు చంద్రబాబును చూసి
> ## టెక్నాలజీ నేర్చుకున్నా..
>
> 
>
> టెక్నాలజీలో చాలా ముందున్నానని చంద్రబాబు నన్ను ప్రశంసించారు. కానీ.. నేను ఒక రహస్యం చెబుతాను. నేను గుజరాత్ సీఎం అయిన కొత్తలో.. అప్పటికే చంద్రబాబు హైదరాబాద్‌లో కూర్చుని చేస్తున్న పనులన్నీ నిశితంగా పరిశీలించే వాడిని. మా అధికారులతో కూడా అధ్యయనం చేయించాను. టెక్నాలజీ విషయంలో చంద్రబాబు నుంచి చాలా నేర్చుకున్నాను. అప్పుడు నేర్చుకున్నవే ఇప్పుడు అమలు చేస్తున్నాను.
>
> - ప్రధాని మోదీ

మనం చేయాలి... మనమే చేయాలి!

అచ్చ తెలుగులో ప్రధాని 'అండ'

'అందరికీ నమస్కారాలు' అని తెలుగులో మొదలుపెట్టి... ఆ తర్వాత ప్రసంగాన్ని హిందీలో కొనసాగించడం మామూలే! కానీ... శుక్రవారం ప్రధాని మోదీ ఇందుకు భిన్నంగా వ్యవహరించారు. తెలుగులో మొదలుపెట్టి.. మధ్యలోనూ పలుమార్లు తెలుగులో మాట్లాడారు. తెలుగు మాటలతోనే తన ప్రసంగాన్ని ముగించారు. "తల్లి దుర్గా భవానీ కొలువైన ఈ పుణ్యభూమిపై మీ అందరినీ కలవడం ఆనందంగా ఉంది" అంటూ మోదీ ప్రసంగాన్ని ప్రారంభించారు. "అమరావతి ఒక నగరం కాదు... అమరావతి ఒక శక్తి. ఆంధ్రప్రదేశ్‌ను ఆధునిక ప్రదేశ్‌గా మార్చే శక్తి. ఆంధ్రప్రదేశ్‌ను అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి"... అని తెలుగులో ఉద్ఘాటించారు. ఏపీని, అమరావతిని 'వికసిత్ భారత్'కు గ్రోత్ ఇంజిన్‌లా మార్చాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. "చంద్రబాబు గారు, బ్రదర్ పవన్ కల్యాణ్ ఇది మనము చేయాలి. ఇది మనమే చేయాలి"... అని తెలుగులో నొక్కి వక్కాణించారు.





అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమంలో తన జేబులో నుంచి చిప్స్ చాక్లెట్‌ను తీసి పవన్‌కు ఇస్తున్న ప్రధాని మోదీ; సభకు హాజరైన ప్రజలు

అవకాశాల 'రాజధాని'!

» ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లక్కర్లేదు

» జవాబుదారీగా ఉంటాం: పవన్ కల్యాణ్



అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): "రాజధాని అమరావతి ప్రపంచస్థాయి, సర్వశ్రేష్ఠ రాజధానిగా నిలుస్తుంది. కేవలం ఆర్కిటెక్చర్, కాంక్రీట్ జంగిల్‌లా కాకుండా... జవాబుదారీతనానికి, న్యాయానికి, ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని మోదీ కలిసి అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతారు. మన యువత ఉద్యోగాల కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లాంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా... అమరావతే అవకాశాల రాజధానిగా నిలుస్తుంది"... అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు, జగన్ హయాంలో వారు ఎదుర్కొన్న కష్టాలను ప్రస్తావిస్తూ ఉద్వేగంగా ప్రసంగించారు.

ఈ దశలో రక్షణ కల్పించలేం

» మద్యం స్కాం కేసులో ధనుంజయరెడ్డి, బాలాజీ గోవిందప్ప, కృష్ణమోహన్‌రెడ్డికి హైకోర్టు స్పష్టీకరణ

» ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ 7కి వాయిదా

అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో అప్పటి సీఎం జగన్ కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పలకు అరెస్టు నుంచి రక్షణ కల్పించేందుకు ఏపీ హైకోర్టు నిరాకరించింది. వివరాలు సమర్పించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమయం కోరుతున్న నేపథ్యంలో ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వలేమని స్పష్టం చేసింది. విచారణను 7వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. మద్యం కుంభకోణం కేసులో నిందితులుగా ఉన్న రాజ్ కసిరెడ్డి, చాణక్యల రిమాండ్ రిపోర్టుల్లో తమ పాత్ర గురించి ప్రస్తావించారని.. తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప హైకోర్టును ఆశ్రయించారు. సీఐడీ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. వ్యాజ్యాలు మొదటిసారి విచారణకు వచ్చాయన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ధనుంజయరెడ్డి తరఫు న్యాయవాది వికాస్‌సింగ్ స్పందిస్తూ.. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ ఈ రోజే ఉత్తర్వులిచ్చి తీరాలన్నారు. ఇరుపక్షాల వాదనలు నమోదు చేసిన న్యాయమూర్తి.. కేసు వివరాలు సమర్పించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమయం కోరుతున్నందున ఈ దశలో రక్షణ కల్పిస్తూ ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేమని తేల్చిచెప్పారు. తదుపరి విచారణను ఈ నెల 7కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

ఆత్మగౌరవ ప్రతీక అమరావతి

ఇది కేవలం రాజధాని నగరమే కాదు.. ఐదుకోట్లమంది ప్రజల సెంటిమెంట్

» అమరావతి పనుల పునఃప్రారంభంలో ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): "అమరావతి కేవలం ఒక రాజధాని నగరమే కాదు. అది ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల సెంటిమెంట్. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికి, ఆశలకు, ఆకాంక్షలకు ప్రతిరూపం." అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. పేర్కొన్నారు. అమరావతి పనులు పునఃప్రారంభించుకుంటున్న ఈ రోజు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో శాశ్వతంగా లిఖించదగ్గ రోజుగా గుర్తుండిపోతుందని సీఎం వ్యాఖ్యానించారు. "2014లో రాజధాని లేని పరిస్థితుల్లో పాలన ప్రారంభించుకున్నాం. 29వేల పైచిలుకు మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రాజధాని కోసం 34 వేల ఎకరాలు ఇచ్చారు. వారి త్యాగాలు ప్రపంచానికి ఆదర్శం. కానీ వారి త్యాగాలను గత వైసీపీ ప్రభుత్వం అపహాస్యం చేసింది. రాజధాని రైతులు ఎన్నో బాధలు పడ్డారు. కానీ వెనకడుగు వేయలేదు. ఇలాంటి ఉద్యమాన్ని నా జీవితంలో చూడలేదు.. ఇకపై చూస్తానని కూడా అనుకోవడం లేదు.' అని చంద్రబాబు పేర్కొన్నారు. చంద్రబాబు ప్రసంగం ఆయన మాటల్లోనే..

హెల్త్, ఎడ్యుకేషన్ హబ్‌గా అమరావతి

"విధ్వంస పాలన ముగిసి 2024 ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చింది. అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంది. కానీ ఆర్థికపరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. వెంటిలేటర్‌పై ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ఎలా బయటకు తీసుకురావాలన్న ఆలోచనలో ఉన్నప్పుడు కేంద్రం, వ్యక్తిగతంగా మోదీ ముందుకొచ్చి ఆపన్నహస్తం అందించారు. కేంద్రం సహకారంతో 10 నెలల్లో అమరావతిని గాడినపెట్టాం. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం. ఈ రోజు వర్షం వస్తుందని అనుకున్నాం. మోదీ రావడంతో వర్షం కూడా వెనక్కి తగ్గింది. మంచి సంకల్పం ఉంటే ప్రకృతి కూడా సహకరిస్తుందనడానికి ఇదే నిదర్శనం. ప్రపంచస్థాయి సంస్థల ఏర్పాటుతో అమరావతి హెల్త్, ఎడ్యుకేషన్ హబ్‌గా ఉండబోతోంది."

జపాన్ మియావాకీ ఆదర్శం..

"రాజధానిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. రాష్ట్రంలో ప్రతి పౌరుడూ 'నా రాజధాని అమరావతి' అని గర్వంగా చెప్పుకొనేలా రాజధాని నిర్మాణం చేస్తాం. రాజధానిలో 30 శాతం పచ్చదనం ఉండేలా ప్రణాళికలు రూపొందించాం. నవ నగరాలు.. భూగర్భంలోనే విద్యుత్తు ఇతరత్రా పైపులు వెళ్లేలా డిజైన్ చేశాం. ఐదు లక్షల మంది విద్యార్థులు అమరావతిలో చదువుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రధాని మోదీ ఇదే కోరారు. రాజధానిలో మంచి విద్యాసంస్థలను ఏర్పాటు చేసి భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దండి అని సూచన చేశారు. దాన్ని ఆచరణలో పెడుతున్నాం. ఇప్పటికే చాలా విద్యాసంస్థలు వచ్చాయి. త్వరలో బిట్స్ పిలానీ, ఎక్స్ఎల్ఆర్ఐ బిజినెస్ స్కూల్, గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్, రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నాం. జపాన్ మియావాకీని ఆదర్శంగా తీసుకుని రాజధానిని ఆహ్లాదంగా తీర్చిదిద్దుతాం. ఈ రోజు రూ.49వేల కోట్ల విలువైన పనులను ప్రారంభించుకోవడంతో పాటు మరో రూ.8 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసుకున్నాం. ప్రధాని చేతుల మీదుగానే మళ్లీ మూడేళ్ల తర్వాత ఈ పనులు ప్రారంభోత్సవాలు చేయిద్దాం."

అభివృద్ధి వికేంద్రీకరణే లక్ష్యం

రాష్ట్రంలోని 26 జిల్లాలనూ అభివృద్ధి చేస్తాం. 2027 నాటికి కేంద్రం సహకారంతో పోలవరాన్ని పూర్తిచేస్తాం. నదుల అనుసంధానం చేస్తాం. విశాఖను నాలెడ్జ్, ఫైనాన్షియల్ కేపిటల్‌గా చేస్తాం. భోగాపురం విమానాశ్రయం పూర్తిచేయడంతోపాటు విశాఖపట్నం స్టీల్ ఫ్యాక్టరీని బలోపేతం చేస్తాం. ఇప్పటికే కేంద్రం రూ.11,440 కోట్ల ఆర్థికసాయం చేసింది. విశాఖకు రైల్వే జోన్ కేటాయించింది. వెనకబడిన రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటు చేస్తాం. రామాయపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ వస్తుంది.

మోదీ మొహంలో బాధ కనిపించింది


ఆహ్లాదంగా ఉండే ఆయన గంభీరంగా కనిపించారు

పహల్గాం ఉగ్రదాడిని సభలో ప్రస్తావించిన బాబు

అమరావతి పునఃప్రారంభ సభలో పహల్గాం ఉగ్రదాడి అంశాన్ని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. "గతంలో ఎప్పుడు మోదీని కలిసినా ఆహ్లాదంగా ఉండేవారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత మోదీని కలిసినప్పుడు ఆయన మొహంలో బాధ చూశాను. అమరావతి పనుల పునఃప్రారంభోత్సవానికి ఆహ్వానించడానికి వెళ్లినప్పుడు ఆయన చాలా గంభీరంగా కనిపించారు. ఉగ్రదాడిలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్న ఆవేదన మోదీలో కనిపించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల తరపున చెబుతున్నాను. ఉగ్రవాదాన్ని అణచివేయడానికి ప్రధాని మోదీ తీసుకునే ప్రతి చర్యకూ మద్దతుగా ఉంటాం." అని స్పష్టం చేశారు.

టెక్నాలజీ అంటేనే మోదీ

సమర్థుడైన నాయకుడు ఉంటే ఏ సంస్థ అయినా దూసుకెళుతుంది. దేశానికి సరైన సమయంలో లభించిన సరైన నాయకుడు మోదీ. మోదీ అధికారంలోకి వచ్చిన 2014లో ప్రపంచ ఆర్థికవ్యవస్థలో మన దేశానిది 10వ స్థానం. 11 ఏళ్లలో మోదీ దాన్ని 5వ స్థానంలోకి తీసుకొచ్చారు. ఇది నేను చెప్పే లెక్క కాదు అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్) సంస్థ గణాంకాలివి. ఈ ఏడాది జపాన్‌ను అధిగమించి 4వ స్థానానికి వస్తామని, 2027 నాటికి జర్మనీని అధిగమించి 3వ స్థానానికి వస్తామని ఐఎంఎఫ్ గణాంకాలు చెబుతున్నాయి. మోదీ కలలు కంటున్న వికసిత్ భారత్‌తో మన దేశం మొదటి రెండు స్థానాల్లో నిలవడానికి ఎంతో దూరం లేదు. టెక్నాలజీ అంటే మోదీ. ఆయన జన్‌ధన్ ఖాతాలు, యూపీఐ ద్వారా నగదు రహిత లావాదేవీలు వంటి ఎన్నో వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. ఇటీవలే జాతీయ క్వాంటమ్ మిషన్‌ను ప్రారంభించారు. ఆయన స్ఫూర్తితో అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా తీర్చిదిద్దుతాం.

దోస్త్ నోటిఫికేషన్ జారీ

» నేటి నుంచి డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీలు, వాటి అనుబంధ డిగ్రీ కాలేజీల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ అడ్మిషన్ల (దోస్త్) నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్- దోస్త్ కన్వీనర్ బాలకిష్టారెడ్డి, కళాశాల విద్య కమిషనర్ ఎ.శ్రీదేవసేన శుక్రవారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో విడుదల చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్య శిక్షణ మండలి (టీఎస్‌బీటిఈట్), జేఎన్‌టీయూల్లోని కోర్సుల్లో చేరదలిచిన విద్యార్థులు.. జ్టిఞ://ఛీ౯టఛిజఞజౌౌఠి.జీ౬ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తొలివిడత అడ్మిషన్ల కోసం రూ.200 చెల్లించి ఈ నెల 3-20 తేదీల మధ్య దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 10 నుంచి 22 వరకూ సంబంధిత కాలేజీల్లో కోర్సుల కోసం వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలి. దివ్యాంగులకు 21న, ఎన్‌సీసీ/ స్పోర్ట్స్ కోటా విద్యార్థులకు 22న సర్టిఫికెట్ల ధ్రువీకరణ ఉంటుంది. 29న సీట్లు కేటాయిస్తారు. రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజుతో ఈ నెల 30 నుంచి జూన్ ఆరో తేదీ వరకూ రెండో విడత అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకుంటే వచ్చే నెల 13న సీట్లు కేటాయిస్తారు. అదే రోజు మూడో విడత అడ్మిషన్లకు రూ.400 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. తొలి, రెండో, మూడో విడత సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 24-28 తేదీల మధ్య సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. జూన్ 30వ తేదీ నుంచి డిగ్రీ తొలి సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయి.

నాన్న, ఇద్దరు కుమార్తెలు.. ముగ్గురూ జడ్జిలే


న్యాయాధికారిగా ఎంపికైన నిఖిషా

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): న్యాయాధికారి అయిన తండ్రిని స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఇద్దరు కుమార్తెలు కూడా న్యాయాధికారులు అయ్యారు. హైదరాబాద్ సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జి కే ఖుషా కుమార్తెల్లో ఒకరైన భావన.. ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లోని 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్నారు. ఆయన మరో కుమార్తె నిఖిషా.. ఇటీవల న్యాయాధికారి అయ్యారు. బీటెక్ చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే న్యాయ విద్యను అభ్యసించిన నిఖిషా.. 2022లో జరిగిన జ్యుడీషియల్ సర్వీసెస్ పరీక్షల్లో తొలి ప్రయత్నంలో విఫలమయ్యారు. ఆ సమయంలో ఆమె గర్భిణి కాగా.. కవల పిల్లలను ప్రసవించిన నిఖిషా తిరిగి పరీక్షలకు సన్నద్ధమయ్యారు. 2024లో జరిగిన ప్రిలిమ్స్, ఆ ఏడాది నవంబరులో జరిగిన మెయిన్స్ పరీక్షల్లో, 2025 ఏప్రిల్‌లో జరిగిన ఇంటర్వ్యూలో విజయం సాధించారు. జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. కుమార్తెలిద్దరూ న్యాయాధికారులు కావడంతో తండ్రి కే ఖుషా ఆనందంలో ఉన్నారు.

కంచ గచ్చిబౌలి భూములపై సీఎస్ తొలి సమీక్ష

» వివాదానికి సంబంధించి వివిధ అంశాలపై చర్చ

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన రామకృష్ణారావు.. కంచ గచ్చిబౌలి భూముల అంశంపై తొలి సమీక్ష నిర్వహించారు. ఆ భూముల అంశానికి అనుబంధంగా ఉన్న అన్ని శాఖల ముఖ్య అధికారులతో సచివాలయంలో శుక్రవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా హెచ్‌సీయూకి కేటాయించిన భూములు, ప్రభుత్వ భూములకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూముల విషయంలో సుప్రీంకోర్టు లేవనెత్తిన పలు విషయాలపైనా చర్చించారు. ఈ విషయంలో సుప్రీంకోర్టుకు కచ్చితమైన సమాధానాలను నివేదించాలని ఆయన అధికారులకు సూచించారు. ఇక, ఈ భూముల వివాదం నేపథ్యంలో 7న ఢిల్లీలో జరగనున్న కేంద్ర సాధికారిత కమిటీ సమావేశంలో సమర్పించాల్సిన నివేదికలపైనా చర్చించినట్లు తెలిసింది.

నా సమస్య పరిష్కరించకపోతే చనిపోతా

» ఉద్యోగ సంఘాల నేతలకు ఓ తహసీల్దార్ లేఖ

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): "ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డికి, రాష్ట్రస్థాయి అధికారులకు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు పేరు పేరునా నమస్కారం.. ఏడాది నుంచి నా వినతిని పరిశీలించమని అడుగుతున్నాను.. ఎన్ని పర్యాయాలు ప్రాధేయపడినా నా గోడు వినడం లేదు.. ఏ ఒక్కరికి నా మీద దయ లేదా... నా చావుతో అయినా తోటి తహసీల్దార్లకు న్యాయం జరుగుతుందని అనుకుంటున్నాను.. రెండు రోజుల వరకు వేచి ఉంటాను..అయినా నా బదిలీ కాని పక్షంలో చనిపోతాను." అంటూ.. బి.మల్లికార్జునరావు అనే తహసీల్దారు ఉద్యోగ సంఘాల నాయకులకు లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. తన తల్లికి 95 ఏళ్లని, ఎనిమిదేళ్లుగా మంచానికే పరిమితమయ్యారని తెలిపారు. ఒక్కడినే కుమారుడు అయినందున ఆమెను తానే చూసుకోవాలని ఆయన లేఖలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తనను బదిలీ చేశారని..తిరిగి వెనక్కి పంపాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఒక వేళ బదిలీ జరక్కపోతే చనిపోవడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.

ఏసీబీ కస్టడీకి హరిరామ్

హైదరాబాద్ /సైదాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న కాళేశ్వరం మాజీ ఈఎన్‌సీ భూక్యా హరిరామ్‌ను ఏసీబీ అధికారులు శుక్రవారం తమ కస్టడీలోకి తీసుకున్నారు. గత నెల 26న ఆయన్ను అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. తర్వాత ఆయన్ను విచారించేందుకు తమకు అప్పగించాలని ఏసీబీ అధికారులు కస్టడీ పిటిషన్ దాఖలుచేయడంతో హరిరామ్‌కు న్యాయమూర్తి 5 రోజుల ఏసీబీ కస్టడీ విధించారు. దీంతో ఆయనను ఏసీబీ అధికారులు ఈ నెల 6వతేదీ వరకూ విచారిస్తారు.

ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావుకు ఎదురుదెబ్బ

» ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. పరారీలో ఉన్న వ్యక్తిని అరెస్టు చేయవద్దని ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది. తనను అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇరికించారని, అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఉత్తర్వులు జారీ చేయాలంటూ ప్రభాకర్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జే శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న. ధర్మాసనం.. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు ప్రకటించింది.


మోర్లికి స్వాగతం పలికిన పర్యాటక శాఖ అధికారుల బృందం

హైదరాబాద్‌కు మిస్‌వరల్డ్ చైర్ పర్సన్ జూలియా ఈవేలిన్ మోర్లి

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిస్‌వరల్డ్ - 2025 పోటీల ఏర్పాట్లను సమీక్షించేందుకు మిస్‌వరల్డ్ లిమిటెడ్ ఛైర్‌పర్సన్ జూలియా ఈవేలిన్ మోర్లి శుక్రవారం ఉదయం హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా మోర్లికి శంషాబాద్ విమానాశ్రయంలో పర్యాటక శాఖ అధికారుల బృందం సంప్రదాయ పద్ధతిలో ఘనంగా స్వాగతం పలికింది. శుక్రవారం సాయంత్రం నుంచే మిస్ వరల్డ్ పోటీల ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. వివిధ ఈవెంట్లకు సంబంధించిన అంశాలపై జూలియా మోర్లి సంబంధిత ఏజెన్సీలు, వివిధ విభాగాలతో మాట్లాడారు.

తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం

కులగణనతో దేశానికే రోల్‌మోడల్‌గా రాష్ట్రం

తెలంగాణ ప్రతిష్ఠను దేశ స్థాయిలో చాటిన ప్రతి ఒక్కరికీ అభినందనలు

'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి సంతోషం


సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, మే 2 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరగబోయే ఒక గొప్ప సామాజిక విప్లవానికి నాంది పలికే ప్రక్రియకు తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలవడం తనకెంతో గర్వకారణంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో సీడబ్ల్యూసీ సమావేశం ముగిసిన తర్వాత ఆయన 'ఎక్స్' వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. "జనగణనలో కులగణనకు తెలంగాణ మోడల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని సీడబ్ల్యూసీ కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసింది. నాలుగు గోడల మధ్య, నలుగురి ఆలోచనలతో కాకుండా.. మొత్తం పౌరసమాజం, తెలంగాణ మేధావులు, వివిధ కుల సంఘాల నాయకులు, విద్యావేత్తల నుంచి అత్యంత పారదర్శకంగా సలహాలు, సూచనలు స్వీకరించి శాస్త్రీయంగా తెలంగాణ ప్రభుత్వం కులగణన చేపట్టిన విషయాన్ని సీడబ్ల్యూసీ తన తీర్మానంలో ప్రస్తావించింది. ఇది తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం. ఒక గొప్ప సామాజిక విప్లవానికి నాంది పలికే ప్రక్రియ విషయంలో దేశానికే తెలంగాణ రోల్ మోడల్‌గా నిలవడం నాకెంతో గర్వకారణంగా ఉంది. అత్యద్భుతంగా, అత్యంత పారదర్శకంగా కులగణన నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను దేశ స్థాయిలో చాటిన ప్రతి ఒక్కరికీ మరోసారి నా అభినందనలు" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు సీడబ్ల్యూసీ సమావేశంలో రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ తాము కేవలం కులాల లెక్కలు మాత్రమే తీయలేదని, వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా పరమైన వెనుకబాటుతనాన్ని కచ్చితంగా నిర్ధారించామని చెప్పారు. ఇంత పకడ్బందీగా కులగణన గతంలో ఎప్పుడూ జరగలేదని తెలిపారు. తాము జరిపిన కులగణన ఆధారంగా అభివృద్ధి ఫలాలను, ఉపాధి కల్పనను అందించే విషయంపై చర్యలు ప్రారంభించామన్నారు.

గవర్నర్‌కు కాంగ్రెస్

బీసీ నేతల ధన్యవాదాలు

» మహేశ్ గౌడ్ నేతృత్వంలో రాజ్‌భవన్‌కు వెళ్లి జిష్ణుదేవ్‌ను కలిసిన పార్టీ ప్రజా ప్రతినిధులు

» బీసీ బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపినందుకు కృతజ్ఞతలు తెలిపి సన్మానం

» కులగణన క్రెడిట్ రాహుల్ గాంధీదే..: మహేశ్ గౌడ్

» కులగణనలో కేంద్రానికి తెలంగాణే ఆదర్శం: పొన్నం


గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు ధన్యవాదాలు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు మహేశ్‌గౌడ్, పొన్నం, కేకే, విజయశాంతి, బీర్ల అయిలయ్య, అంజన్‌కుమార్, అనిల్‌కుమార్, సారయ్య, అలీఖాన్ తదితరులు

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ తెలంగాణ ఉభయ సభలు చేసిన బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు కాంగ్రెస్ బీసీ వర్గం నేతలు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు విజయశాంతి, బస్వరాజు సారయ్య, అమెర్ అలీఖాన్, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు రాజ్‌భవన్‌కు వెళ్లి జిష్ణుదేవ్ వర్మను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. అనంతరం రాజ్‌భవన్ వద్ద మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. స్వతంత్ర భారతావనిలో కులగణన నిర్వహించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలుస్తుందన్నారు. కులగణన క్రెడిట్ రాహుల్ గాంధీకే దక్కుతుందని.. కేంద్రం జనగణనతో పాటు కులగణనకు తీసుకున్న నిర్ణయం రాహుల్, కాంగ్రెస్ ప్రభుత్వ విజయమని చెప్పారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ సర్కారు చేపట్టే జనగణన, కులగణనకు తెలంగాణే రోల్‌మోడల్‌గా నిలుస్తుందన్నారు. గతంలో తమ నిర్ణయాన్ని వ్యతిరేకించిన వారు ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వ ఆలోచనను కేంద్రం మార్గదర్శకంగా తీసుకుంటే జీర్ణించుకోలేక విమర్శిస్తున్నారని మండిపడ్డారు. కులగణన ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చేసిన చట్టం అమలుకు కేంద్రం ఆమోదం తెలిపి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు.

పార్టీ కోసం సమన్వయంతో పనిచేయాలి..

సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా అందరూ సమన్వయంతో పార్టీ కోసం కలసి పనిచేయాలని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలకు మహేశ్ గౌడ్ దిశానిర్దేశం చేశారు. మంత్రులు, జిల్లాకు చెందిన సీనియర్ నేతల పట్ల అనుచితంగా మాట్లాడుతూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కొందరిని పార్టీ నుంచి తొలగించాలని కోరుతూ మహేశ్‌గౌడ్‌కు వారు తొలుత వినతిపత్రం ఇచ్చారు. దీనిపై మహేశ్ గౌడ్ స్పందిస్తూ.. పార్టీకి వ్యతిరేకంగా పని చేసే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కాగా, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గరేట్ వైన్ ఓవెన్, బ్రిటిష్ హైకమిషన్ రాజకీయ, ఆర్థిక సలహాదారు నళిని రఘురామన్‌లు ఎమ్మెల్యే క్వార్టర్స్ క్యాంప్ కార్యాలయంలో మహేశ్ గౌడ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించారు. అనంతరం తాజా రాజకీయాలు, హైడ్రా పనితీరు, మూసీ ప్రాజెక్టు, కులగణన-బీసీ రిజర్వేషన్లతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించారు.

పెద్దపల్లి ఎయిర్‌పోర్టు.. బసంత్‌నగర్‌లో కాదు..అంతర్గాంలో!

(మొదటిపేజీ తరువాయి)

వాతావరణ రిపోర్టులు, సైట్ వివరాలతో కూడిన ఒక నివేదికను కేంద్రానికి సమర్పించారు. అంతర్గాంలో గుర్తించిన భూములతో పాటు అదనంగా మరికొన్ని భూములను సేకరించేందుకు అవకాశం ఉన్నదని అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ ప్రాంత భూములు విమానాశ్రయం నిర్మాణానికి అనువుగా ఉండడంతో పాటు వాతావరణ రిపోర్టులూ అనుకూలంగానే ఉన్నాయని సంబంధిత అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఇటీవల కేంద్ర అధికారుల బృందం ఒకటి అంతర్గాంలో గుర్తించిన భూములను పరిశీలించేందుకు వచ్చివెళ్లింది. అనంతరం ఆ భూముల్లో విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి 'ప్రీఫీజిబిలిటీ స్టడీ' చేపట్టాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కేంద్రానికి లేఖ రాసింది. కాగా బసంత్‌నగర్‌లో(రామగుండంకు దగ్గర్లో) దాదాపు 50 ఏళ్ల క్రితమే ఒక విమానాశ్రయాన్ని 260 ఎకరాలకు పైగా స్థలంలో ఏర్పాటు చేశారు. ఇప్పటికీ అక్కడ ఎయిర్‌స్ట్రిప్ ఉండగా.. అప్పట్లో అక్కడి నుంచి విమానాలూ నడిచాయి. ఆ తరువాత ఆ సేవలు నిలిచిపోయాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి విమానాశ్రయాల ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా మామునూరు, బసంత్ నగర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో విమానాశ్రయాలను నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం కేంద్రానికి లేఖలు రాసింది. బసంత్‌నగర్, మామునూరులలో గతంలోనే విమానాలు నడవగా.. ఎయిర్‌స్ట్రిప్‌లూ అందుబాటులో ఉన్నాయి. ఆ రెండింటిని పునరుద్ధరించి విమానాలు నడిపేలా చర్యలు తీసుకోవాలని భావించింది. మామునూరులో ప్రభుత్వం భావించినట్టుగానే విమానాశ్రయం నిర్మాణానికి కేంద్రం అనుమతులు ఇచ్చింది. అదనంగా కొన్ని భూములు అవసరమని భావించగా.. సేకరణకు కసరత్తు నడుస్తోంది. బసంత్‌నగర్‌లో మాత్రం పలు సాంకేతిక కారణాలతో ప్రస్తుతమున్న చోటే విమానాశ్రయం నిర్మాణానికి అవకాశం లేకుండాపోయింది. అయినా పెద్దపల్లి జిల్లాలోనే వేరే ప్రాంతంలో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉంది. ఇందులో భాగంగానే అంతర్గాం మండలంలో భూములను గుర్తించినట్టు తెలిసింది. అంతర్గాం మండలంలో భూములను పరిశీలించేందుకు ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర అధికారుల బృందం మరో రెండు ప్రాంతాలను కూడా సందర్శించింది. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో ఏర్పాటు చేయదల్చిన విమానాశ్రయాల కోసం సిద్ధం చేసిన భూములనూ పరిశీలించిందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆ భూముల్లో విమానాశ్రయాల ఏర్పాటుకు ఉన్న అవ కాశాలు, చేపట్టాల్సిన అధ్యయనాలకు సంబంధించి ఆ బృందం చర్చించినట్టు సమాచారం.

ఓల్డ్ సిటీకీ నిధులు కేటాయించాలి

కొన్ని చోట్ల మౌలిక వసతులూ లేవు

కేంద్ర నిధులను వినియోగించండి

మెట్రో ప్రతిపాదనలు పంపిస్తే సహకరిస్తా

అధికారులతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఓల్డ్ సిటీకి కూడా మిగతా ప్రాంతాలతో పాటుగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశా) సమావేశం జరిగింది. కేంద్ర నిధులతో జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. అభివృద్ధి అంటే కేవలం హైటెక్ సిటీ మాత్రమే కాదని, ఓల్డ్ సిటీ, గౌలిగూడ, అంబర్‌పేట, సనత్‌నగర్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలు కూడా కీలకమని అన్నారు. మౌలిక వసతుల కొరత, ప్రాథమిక సౌకర్యాల సమస్యలతో ఓల్డ్ సిటీ ప్రాంతాలు కొట్టుమిట్టాడుతున్నాయని తెలిపారు. జీహెచ్ఎంసీ విస్తరణ, జనాభా పెరుగుతున్న నేపథ్యంలో బడ్జెట్ కేవలం కొన్ని ప్రాంతాలకే కాకుండా వెనుకబడిన ప్రాంతాలకు కూడా కేటాయిస్తూ నగరాభివృద్ధికి పాటుపడాలని కోరారు. ప్రతి డివిజన్‌కు సంబంధించిన అవసరాలను గుర్తించి కేంద్రానికి వివరాలు అందించాలని అధికారులకు సూచించారు. కేంద్ర నిధులను సమర్థంగా ఉపయోగించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. మెట్రో రైలు ప్రాజెక్టు అఫ్జల్‌గంజ్ వరకే పరిమితమైందని, రానున్న రోజుల్లో విడతల వారీగా ప్రతిపాదనలను కేంద్రానికి పంపిస్తే అవసరమైన నిధులు, రుణాలు లభించేలా సహకరిస్తానని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

మదర్సాల్లో ఉగ్ర శిక్షణ?: రఘునందన్

దేవాదాయ భూముల్లో మదర్సాలు ఎలా నిర్మిస్తారని ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జిన్నారం మదర్సాలో ఉన్న 70 మంది విద్యార్థులలో 65 మంది బిహార్‌లోని కిషన్‌గంజ్ నుంచి వచ్చినట్లు తెలిసిందన్నారు. మదర్సాలలో చదువు చెప్పే వారు భారతీయులే కాదని స్థానికులు అనుమానిస్తున్నారని పేర్కొన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి రోహింగ్యాలను తీసుకువచ్చి మదర్సాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు శిక్షణ ఇస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో అనుమతులున్న మదర్సాల వివరాలు, వాటిలో చదువుతున్న విద్యార్థులు, బోధకుల వివరాలు తెలపాలని ప్రభుత్వాన్ని కోరారు. సదాశివపేటలో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశ్ పౌరులకు ఓటరు, ఆధార్ కార్డులు ఉన్నాయని తెలిపారు. ఇస్నాపూర్ వద్ద 247మంది నేపాల్ దేశస్థులకు ఆధార్‌కార్డులు మంజూరు చేశారని, ఇది దేశ భద్రతకు ముప్పేనని పేర్కొన్నారు.

మిస్ వరల్డ్ పోటీలకు పటిష్ఠ భద్రత

» ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్

» రాష్ట్ర పోలీసుల సమర్థతను చాటి చెప్పాలి

» అధికారులతో సమీక్షలో డీజీపీ జితేందర్

» నోడల్ ఆఫీసర్‌గా స్టీఫెన్ రవీంద్ర



మిస్ వరల్డ్ పోటీల భద్రతపై సమీక్ష నిర్వహిస్తున్న డీజీపీ జితేందర్

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ పోటీలకు దాదాపు 120 దేశాల నుంచి ప్రతినిధులు వస్తున్న నేపథ్యంలో పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని డీజీపీ జితేందర్ పోలీసు అధికారులను ఆదేశించారు. వారంతా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్నందున తెలంగాణ పోలీసు యంత్రాంగమంతా ఈ విషయంపై దృష్టి సారించాలన్నారు. విదేశీ అతిథుల రాక శుక్రవారం నుంచి మొదలైందని, ఇప్పటికే 116 దేశాల నుంచి వస్తున్న ప్రతినిధుల సమాచారం అందిందని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీల భద్రతపై శుక్రవారం డీజీపీ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. మిస్ వరల్డ్ పోటీదారులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను బృందాలుగా సందర్శించనున్నట్లు, ఆయా ప్రాంతాలను, కార్యక్రమాలను అనుసంధానం చేస్తూ కంట్రోల్ కమాండ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భారీ స్థాయిలో జరగనున్న ఈ పోటీల ప్రారంభ వేడుకను గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తుండగా, ఫైనల్ పోటీలను ఈ నెల 31న హైటెక్స్‌లో నిర్వహించనున్నారని పేర్కొన్నారు. పోలీసింగ్‌లో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్న తెలంగాణ పోలీసులు 120 దేశాల నుంచి వచ్చే పోటీదారులకు, అతిథులకు పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టి తమ సమర్థతను ప్రపంచంలోని ఇతర దేశాలకు చాటి చెప్పాలని పిలుపునిచ్చారు.

సుందరీమణుల పర్యటన షెడ్యూల్ ఇదీ..

మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న సుందరీమణులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను సందర్శించే షెడ్యూల్‌ను డీజీపీ జితేందర్ వెల్లడించారు. ఈ నెల 12న నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం ప్రాజెక్టును, 13న లాడ్‌బజార్, చౌమహల్లా ప్యాలెస్‌ను వారు సందర్శిస్తారని, 14న వరంగల్ హెరిటేజ్ సందర్శన, రామప్ప ఆలయ సందర్శన, 15న యాదగిరిగుట్ట ఆలయ సందర్శన, పోచంపల్లి చేనేత వస్త్రాల తయారీ, 16న హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో నిర్వహించే మెడికల్ టూరిజం ఈవెంట్, పిల్లలమర్రి, 17న గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే స్పోర్ట్స్ ఫైనల్ ఈవెంట్, రామోజీ ఫిలింసిటీ, 18న తెలంగాణ పోలీస్ కంట్రోల్ కమాండ్ సెంటర్, 20న ఉప్పల్ స్టేడియం, 21న శిల్పారామంలను మిస్ వరల్డ్ పోటీదారులు, విదేశీ ప్రతినిధులు బృందాలుగా సందర్శిస్తారని వివరించారు. ఇందుకనుగుణంగా ఆయా జిల్లాల ఎస్పీలు, కమిషనర్లు ఇతర సీనియర్ అధికారులు బందోబస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీ మహేశ్ భగవత్, మిస్ వరల్డ్ పోటీల నోడల్ ఆఫీసర్ స్టీఫెన్ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వరి ఎకరానికి రూ. 46వేలు!

» నిరుటి కన్నా రుణ పరిమితి వెయ్యి పెంపు

» పత్తి, పామాయిల్ తోటలకు 48 వేలు

» మిర్చి పంటకు 86 వేలు.. టెస్కాబ్ ఖరారు

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): వరి, పత్తి, మొక్కజొన్న తదితర ప్రధాన పంటలతోపాటు చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుకు తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు (టెస్కాబ్) 2025-26 వార్షిక రుణ పరిమితిని ఖరారుచేసింది. వ్యవసాయ, ఉద్యాన పంటలతోపాటు పశువులు, కోళ్లు, మేకలు, గొర్రెలు, చేపలు, పందుల పెంపకానికి కూడా రుణపరిమితిని నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ (ఎస్ఎల్‌టీసీ) ప్రతిపాదనలమేరకు ఖరారుచేసిన రుణపరిమితికి టెస్కాబ్ ఆమోదముద్ర వేసి.... ప్రభుత్వానికి, బ్యాంకులకు, అన్ని జిల్లాలకు పంపించింది. టెస్కాబ్ ఖరారుచేసిన రుణపరిమితికి అనుగుణంగా రైతులకు పంట రుణాలు పంపిణీ చేయాల్సి ఉంటుంది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్-2025-26 ప్రకారం రైతులకు రుణపంపిణీ చేయాలని ప్రభుత్వం నుంచీ బ్యాంకులకు ఆదేశాలు వెళ్లాయి. నిరుటికి ఇప్పటికి రుణపరిమితిలో పెరుగుదల నామమాత్రంగా ఉంది. పంటల పెట్టుబడి వాస్తవ ఖర్చులకు, టెస్కాబ్ ప్రకటించిన రుణపరిమితి కి వ్యత్యాసం ఉంటోంది. అందులో బ్యాంకర్లు కూడా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు రుణాలివ్వటంలేదు.ఈ క్రమంలో రుణపరిమితి పెరుగుతుందని రైతులు ఆశించినా లాభం లేకపోయింది. నిరుటి కన్నా వరికి ఎకరానికి కేవలం రూ.వెయ్యి పెంచారు. మొక్క జొన్న, పత్తి, వేరుశనగకు రూ.2వేల చొప్పున పెం చారు. సజ్జకు, కంది, వినుముకు రూ.వెయ్యి పెంచారు. పామాయిల్‌కు మాత్రం రూ.4వేలు పెరిగింది. వాస్తవ సాగు ఖర్చులు పరిగణనలోకి తీసుకోకుండా నామమాత్రంగా రుణపరిమితి ఖరారుచేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

2025- 26 స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పట్టిక

పంట పేరు	రుణ పరిమితి(రూ.లలో)	పంట పేరు	రుణ పరిమితి(రూ.లలో)	యూనిట్లు	రుణ పరిమితి(రూ.లలో)
వరి	44,000- 46,000	పసుపు	88,000- 90,000	గొర్రెలు(20+1)	26,000- 28,000
వరి (శ్రీ)	36,000- 38,000	జొన్న	19,000- 21,000	మేకలు(20+1)	27,000- 29,000
విత్తన వరి	48,000- 50,000	మినుము	20,000- 22,000	పందులు(3+1)	61,000- 62,000
పత్తి	46,000- 48,000	ఆముదం	20,000- 21,000	గేదె (1)	33,000- 35,000
పత్తి విత్తనోత్పత్తి	1,40,000- 1,50,000	పెసర	20,000- 22,000	ఆవు (1)	33,000- 35,000
మొక్కజొన్న	34,000- 36,000	శనగలు	25,000- 27,000	బ్రాయిలర్ కోడిపిల్ల	200- 210
కంది	23,000- 25,000	పొద్దుతిరుగుడు	28,000- 30,000	లేయర్ కోడిపిల్ల	420- 440
మిర్చి	84,000- 86,000	వేరుశనగ	30,000- 32,000	చేపలు(హెక్టారు)	4,00,000
పామాయిల్	46,000- 48,000	చెరకు	80,000- 82,000	మత్స్యకారులు	35,000
సోయాబీన్	28,000- 30,000	నువ్వులు	20,000- 22,000		

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.